ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కరీంనగర్

fb.com/vaartha Digital

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-7-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 155 పేజీలు: 8+16 వెల: 8.00


ఒకే వేదికపైకి ఠాకరే బ్రదర్స్

యుపిలో ఘోర ప్రమాదం: 8 మంది దుర్మరణం 5




## ఆదాయ సమానత్వంలో భారత్ @ 4

### జి-7, జి-20 దేశాలు సైతం వెనక్కి

### ఆర్థిక ప్రగతి ఫలాలు ప్రజలందరికి సమానం

**న్యూయార్క్, జూలై 5:** ఆదాయ సమానత్వం పరంగా భారత్ ప్రపంచంలోనే ఒక ఆదర్శవంతమైన దేశంగా నిలుస్తోంది. ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ఆదాయ పంపిణీలో అసమానతలను కొలిచే 'గిని సూచీ'లో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించి, ప్రపంచంలోనే 4వ స్థానంలో నిలిచింది. స్లోవాక్ రిపబ్లిక్, స్లోవేనియా, బెలారస్ మాత్రమే భారత్ కంటే ముందున్నాయి. అమెరికా, చైనాతో పాటు జీ7, జీ20 కూటమిలోని అన్ని అగ్ర దేశాలను భారత్ వెనక్కి నెట్టడం విశేషం. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, భారత్ గిని సూచీ స్కోరు 25.5గా నమోదైంది. ఇదే సమయంలో చైనా (35.7), అమెరికా (41.8) వంటి దేశాలు భారత్ కంటే చాలా వెనుకబడి ఉన్నాయి. 2011లో 28.8గా ఉన్న గిని స్కోరు >>2

# లైంగిక హింసపై కొరడా

### చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడే వారిని వదలం

### భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు పూర్తి రక్షణ

### సోషల్ మీడియాతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

### మహిళలు, చిన్నారుల భద్రతపై సిఎం రేవంత్‌రెడ్డి


ఎంసిహెచ్ఆర్‌డిలో శనివారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై5:** చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని,వారికి అత్యంత కఠినమైన శిక్షలు తప్పవని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. మర్రి చెన్నారెడ్డి హెచ్ఆర్‌డీలో శనివారం "లైంగిక దాడుల బాధిత చిన్నారుల రక్షణ, భద్రత" అంశంపై స్టేట్ లెవెల్ స్టేక్ హోల్డర్స్ కన్సల్టేషన్ మీట్-2025 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్ అనే థీమ్‌తో.. తమ బాధను చెప్పుకోలేని వారికి రక్షణ కల్పించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి రాష్ట్ర స్థాయి సమావేశం ఏర్పాటు చేయడం చాలా అవసరం అని చెప్పారు. ఎంతో కీలకమైన అంశంపై సదస్సు నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసు, ఇతర నిర్వాహకులను అభినందిస్తున్నట్లు తెలిపారు.చిన్నారులపై దాడులను నివారించడమే కాకుండా బాల బాధితులకు చట్టపరమైన అన్ని రకాల రక్షణ కల్పించాల్సి ఉందన్నారు. చిన్నారులపై జరిగే లైంగిక హింసను సమాజంలో ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు.బాధితులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. వాటి ద్వారా బాధితులకు పూర్తి భద్రత, సహకారం అందిస్తున్నామని వివరించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రజలు, ముఖ్యంగా యువత సోషల్ మీడియా వాడకం విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. లైంగిక వేధింపుల నుంచి అన్ని రకాలుగా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని, మా ప్రభుత్వం పిల్లలు, మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బాలికల సంరక్షణ కోసం తెలంగాణ భరోసా ప్రాజెక్టును తీసుకొచ్చామని, దానికి >>2

## స్టాంప్ డ్యూటీ మహిళలకు తగ్గింపు!

### కొత్త విధానం రూపకల్పనకు కసరత్తు

### పాత అపార్ట్‌మెంట్‌లకు వెసులుబాటు

### వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు: మంత్రి పొంగులేటి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై5:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సాధారణ ప్రజలకు నష్టం కలిగించకుండా వ్యాపార ఒప్పందాలపై పారదర్శకత ఉండేలా స్టాంప్ విధానాన్ని భారతీయ స్టాంపు చట్టం 1899ను అనుసరించి తెలంగాణ సవరణ బిల్లు-2025ను తీసుకురావాలని నిర్ణయించినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఈ సవరణ బిల్లుపై శనివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, న్యాయ వ్యవహారాల కార్యదర్శి రెండ్ల తిరుపతి, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, ముఖ్యమంత్రి కార్యాలయ ఒఎస్డి వేముల శ్రీనివాస్ తదితరులతో సమావేశం నిర్వహించారు. భారతీయస్టాంపు చట్టం1899 ప్రకారం, తెలంగాణ పరిధిలో నాలుగు సెక్షన్లను, 26 ఆర్టికల్స్‌ను సవరించుట కోసం 2021 సంవత్సరంలో శాసనసభలో సవరణ బిల్లును ఆమోదించి భారత ప్రభుత్వం ఆమోదం కోసం పంపించారని పేర్కొన్నారు. అయితే ఈ బిల్లుపై భారత >>2


శనివారం హైదరాబాద్‌లోని బిజెపి కార్యాలయంలో పార్టీ రాష్ట్ర చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రాంచందర్‌రావు. చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపి అరుణ తదితరులు

## 6 గ్యారంటీలు ఏవీ? ఎక్కడ?

### 20 నెలలవుతున్నా అమలు జాడే లేదు..

### మహిళలకు ప్రతినెలా రూ. 2500 ఎప్పటికి?

### స్కూటీలు, తులం బంగారాలు కనిపించనేలేదు

### సిఎం రేవంత్‌కు బిజెపి చీఫ్ రాంచందర్‌రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్, జూలై 5 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలకు 2023 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలను నమ్మి ప్రజలు పార్టీకి పట్టం కట్టారని, 100 రోజుల్లో 6 గ్యారెంటీ హామీలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ దాదాపు 600రోజులు కావోస్తుందని, అంటే దాదాపు 20 నెలలు అవుతున్నా ఆ హామీలు అమలు కావడం లేదు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. శనివారం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాశారు. ప్రజలకు6 గ్యారెంటీలలో 63 అనుబంధ హామీలు మీరు, మీ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంతకాలతో ఊరూరా పంచారని, మీ అధినాయకులు సోనియా, రాహుల్ గాంధీ సంతకాలతో అన్ని ప్రకటనలు సైతం ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క గ్యారెంటీ కూడా పూర్తిగా అమలు చేయకపోవడం వల్ల మమ్మల్ని మీరు మోసం చేశారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని అన్నారు. మహాలక్ష్మి పేరు మీద మహిళలకు నెలకు రూ.2500 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు, ఇంతవరకూ ఈ హామీ అమలు కాదు కదా, కనీసం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకంలో తులం బంగారం ఇస్తామన్నారు, ఒక్కరికి కూడా ఇచ్చిన దాఖలాలు లేవు అన్నారు. కాలేజీ వెళ్లే ప్రతి అమ్మాయికి స్కూటీ ఇస్తామన్నారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్నారు. చేయూత కింద రూ.4000 నెలవారీ పింఛను ఇస్తామన్నారు. అంతేకాదు, గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎంతోమంది అర్హులకు పింఛను ఇవ్వలేదని, వారికి కూడా ఇస్తామన్నారు. కానీ, వృద్ధులు, వితంతువులెవరికీ రూ. 9300 ఫింఛను అందడం లేదు. మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని తుంగలో తొక్కారు అన్నారు. రైతు భరోసా కింద రైతులకు, కౌలు రైతులకు యేడాదికి ఎకరానికి రూ.15,000 చొప్పున, రైతు కూలీలకు యేడాదికి రూ.12,000 ఇస్తామన్న హామీ కూడా నీటి >>2



## రోజుకు 10 గంటల పని!

### వారంలో 48 గంటలు మించరాదన్న ప్రభుత్వం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై5:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాణిజ్య కేంద్రాలలో పనిచేసే ఉద్యోగుల పని వేళల పరిమితిని సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై రోజుకు 10 గంటల వరకు పని చేసేందుకు అనుమతిచ్చింది. అయితే, వారంలో పని వేళలు 48 గంటలకు మించరాదని స్పష్టం చేసింది.పరిమితి దాటితే మాత్రం ఓటీ వేతనం >>2



## కేంద్ర ఉద్యోగులకు 4% డిఎ పెంపు

**న్యూఢిల్లీ, జూలై 5:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 4శాతం డిఎ పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.ఉద్యోగులకు ప్రతిఏటా రెండుపర్యాయాలు డిఎలను పెంచుతుంది. ద్రవ్యోల్బణ తీరుతెన్నులు ఆధారంగా ఏడో వేతన కమిషన్ సిఫారసులను అనుసరించి ఈ డిఎపెంపు ఉంటుంది. జులై నెలనుంచే ఈ డిఎ ఉద్యోగుల >>2

## మహిళా సాధికారతలో తెలంగాణ రోల్ మోడల్


హైదరాబాద్‌లో శనివారం జరిగిన ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో అర్హులకు చెక్కులను అందజేస్తున్న డి.సిఎం భట్టి, మంత్రులు పొన్నం, సీతక్క

### పది నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉత్సవంలా వడ్డీ లేని రుణాలు

### ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో డి. సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై5:** మహిళా సాధికారతలో తెలంగాణ రాష్ట్రం ఒక రోల్ మోడల్ గా నిలవాలని, దేశం అంతా తెలంగాణ రాష్ట్రానికి వచ్చి చూసేలా ప్రభుత్వ అందిస్తున్న ప్రోత్సాహాన్ని మహిళా సంఘాలు అందిపుచ్చుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ప్రజాభవంలో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా మహిళా సంఘాలకు ఆర్టీసీ నుంచి రావాల్సిన అద్దె చెక్కులను అందజేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళలను మహారాణులుగా గౌరవించుకోవాలని రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు పోతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. మహిళా సంఘాలు లాభాలు ఆర్జించి వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకొని బాగా ఎదగాలన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలను ప్రోత్సహిస్తుందని >>2


శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో కెటిఆర్

## 72 గంటల్లో రా.. తేల్చుకుందాం!

### రైతు సంక్షేమంపై ప్రెస్‌క్లబ్‌లో చర్చిద్దాం

### సిఎం రేవంత్‌కు కెటిఆర్ సవాల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై5:** రైతు సంక్షేమం గురించి చర్చించేందుకు తెలంగాణలో ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు.72 గంటల్లో రా.. తేల్చుకుందామని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. ఈ నెల 8న ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో చర్చకు సిద్ధమని చెప్పారు. చర్చకు మూడు రోజుల సమయం ఇస్తున్నామని, ప్రిపేర్ అయ్యి రావాలన్నారు. లేదంటే చర్చకు వచ్చి బేసిన్లు, బెండకాయలు అంటే ఇజ్జత్ పోతుందని ఎద్దేవా చేశారు. శనివారం పార్టీ నేతలతో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో రైతు రాజ్యం తెచ్చింది కేసీఆర్. రైతు కేంద్రంగా ప్రభుత్వాన్ని నడిపింది బీఆర్ఎస్. నిజం తెలిసినా ఒప్పుకోలేని వ్యక్తి రేవంత్ రెడ్డి. సభ పెడితే బూతులు మాట్లాడుడే రేవంత్ రెడ్డి పనిగా పెట్టుకున్నాడు. రైతు సంక్షేమంపై రేవంత్ రెడ్డి ఎక్కడ చర్చ పెట్టినా మేం రెడీ. 72 గంటలు సమయం ఇస్తున్నా.. ప్రిపేర్ అయ్యి చర్చకు రండి. రేవంత్ రెడ్డికి బేసిన్ తెలవదు, దేవాదుల గోదావరి బేసిన్‌లో ఉందా అని అడుగుతడు. నల్లమల పులి అంటాడు.. మళ్లీ నల్లమల తెలంగాణలోనే ఉందా అని అంటడు. నీళ్లు,నిధులు, నియామకాల నినాదంతో తెలంగాణ >>2

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి 6

### పేషెంట్లను దోచుకునే ప్రైవేటు ఆస్పత్రులపై కఠిన చర్యలు: మంత్రి దామోదర

## ఆరోగ్య అధికారులే అవినీతి మారాజులు!




### దేశంలోనే అతిపెద్ద వైద్యవిద్య కుంభకోణం

### చేతులు మారిన కోట్లు

### ముగ్గురు ఎన్ఎంసి డాక్టర్లు సహా 8 మందిని అరెస్టు చేసిన సిబిఐ

### ఎపి, తెలంగాణకు విస్తరించిన స్కాం

**న్యూఢిల్లీ, జూలై 5:** దేశంలోనే అతి పెద్ద వైద్యవిద్య కుంభకోణాన్ని సీబీఐ వెలికితీసింది. పలు రాష్ట్రాలకు ఈ స్కామ్‌లో సంబంధం ఉండటంతో పాటు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి), మధ్యవర్తులు, ప్రైవేటు కాలేజీ ప్రతినిధులు, ప్రముఖ విద్యావేత్తలు, ఒక స్వయం ప్రకటిత గాడ్‌మెన్ ప్రమేయం ఉన్నట్లు సీబీఐ తెలిపింది. ఇందుకు సంబంధించి 34 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. వీరిలో ఎనిమిది మంది అధికారులు ఆరోగ్య శాఖకు చెందిన వారు ఉండగా, ఒకరు ఎన్‌హెచ్ఏకు చెందిన వారు, ఎన్ఎంసీ తనిఖీ బృందాల్లో పాలుపంచుకున్న ఐదుగురు వైద్యులు ఉన్నారు. విచారణలో భాగంగా సీబీఐ స్కానర్‌లో చిక్కుకున్న ఇంతవరకూ ఎనిమిది మంది అరెస్టు అయ్యారు. ఈ కేసులో ముగ్గురు ఎన్ఎంసీ డాక్టర్లతో పాటు ఎనిమిది మందిని సీబీఐ ఇంతవరకూ అరెస్టు చేసింది. నయ రాయిపూర్‌లోని రావత్‌పుర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు అనుకూలంగా తనిఖీ నివేదికలు అందించేందుకు రూ.55లక్షలు లంచం తీసుకున్నారన్నది వీరిపై అభియోగం. ఎఫ్ఐఆర్ ప్రకారం, ఇన్‌స్పెక్షన్‌కు సంబంధించి రవిశంకర్ ముందస్తు సమాచారం కోరారు. రావత్‌పుర ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ అతుల్ కుమార్ తివారీ >>2



జమ్మూ కాశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలోని అమర్‌నాథ్ మందిరం వైపు సాగుతున్న యాత్రికులు

## లైంగిక హింసపై కొరడా

>> అనుసంధానంగా 29 కేంద్రాలు పనిచేస్తున్నాయని, ఈ కేంద్రాల ద్వారా పోలీసు సహాయమే కాకుండా న్యాయ పరమైన సహాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయన్నారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భరోసా కేంద్రం ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా పిల్లలకు సంపూర్ణ రక్షణ, వారిలో విశ్వాసం, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడం ఈ కేంద్రాల లక్ష్యమని చెప్పారు. పోక్సో చట్టం, జ్యువెనైల్ చట్టాలు మన ప్రగతిశీల సాధనాలుగా పనిచేస్తున్నాయని, అయితే ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి హాని కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలని చెప్పారు. సోషల్ మీడియా ద్వారా పిల్లలపై జరిగే దురాగతాలు, దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపకుండా దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, న్యాయం కేవలం కోర్టుల్లోనే కాకుండా ప్రతి దశలోనూ రక్షణ ఉండాలని చెప్పారు. పోలీస్ స్టేషన్, బాలల సంక్షేమ కేంద్రాలతో అన్ని ప్రక్రియల ద్వారా పిల్లలకు న్యాయం దక్కాలని, రక్షణ కల్పించాలని చెప్పారు. ఇలాంటి విషయాల్లో అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదామని న్యాయమూర్తులు, పోలీసు అధికారులు బాలల సంక్షేమ కమిటీలకు సిఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. న్యాయమంటే కేవలం శిక్షలు విధించడం వరకే కాదు. బాధితుల జీవితానికి భరోసా కల్పించాలి. వారికి అవసరమైన రక్షణ, సమాజంలో తగిన గౌరవం కల్పించేలా చర్యలు తీసుకుని వారి బాల్యాన్ని తిరిగి పొందేలా చర్యలు ఉండాలని చెప్పారు. ఈ కీలకమైన సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సుజయ్ పాల్, హైకోర్టు న్యాయమూర్తులు, డీజీపీ జితేందర్, ఇతర ఉన్నత పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## మహిళలకు తగ్గింపు!

>> ప్రభుత్వం వ్యక్తం చేసిన అభ్యంతరాలకు సమాధానం ఇచ్చినప్పటికీ 2023 జనవరిలో భారత ప్రభుత్వం ఈ సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపించామని ఈ సందర్భంగా అధికారులు మంత్రి దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2021లో ప్రవేశపెట్టిన సవరణ బిల్లును ఉపసంహరించుకొని ప్రస్తుత కాలానికి అనుగుణంగా 2025 సవరణ బిల్లును తీసుకురావాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకుని, నిబంధనలు కట్టుదిట్టమైన రూపంలోకి తీసుకురావడం కొత్త ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించడం లక్ష్యంగా బిల్లును రూపొందించాలని అలాగే పాత చట్టంలో లేనివాటిని కొత్త చట్టం పరిధిలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని సూచించారు. సామాన్య మధ్యతరగతి ప్రజానీకంపై ఎలాంటి భారం పడకుండా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా భూముల ధరలను సవరించాలని ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి విమర్శలకు తావులేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరల సవరణ జరగాలన్నారు. ఏఏ ప్రాంతాల్లో ఎక్కువ వ్యత్యాసం ఉంది అక్కడ హేతబద్ధంగా ఎంత శాతం పెంచేందుకు అవకాశం ఉంది తదితర అంశాలపై లోతైన అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళాభ్యుదయం కోసం ఎన్నో చర్యలు చేపడుతోందని దీనిలో భాగంగా మహిళలకు స్టాంప్ డ్యూటీ తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని అలాగే కొత్త, పాత అపార్ట్‌మెంట్‌లకు స్టాంప్ డ్యూటీ ఒకే విధంగా ఉందని పాత అపార్ట్‌మెంట్‌లకు రిజిస్ట్రేషన్ తేదీలను పరిగణనలోకి తీసుకొని స్టాంప్ డ్యూటీ తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని ఈ రెండు అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారితో చర్చించి విధివిధానాలపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

## ఆరోగ్య అధికారులే అవినీతి మారాజులు!

>> ఈ సమాచారాన్ని మయూర్ రావల్ నుంచి సేకరించారు. తనిఖీ తేదీలు, మూల్యాంకకుల (అస్సెసర్స్) పేర్లను పంచుకునేందుకు రావల్ రూ .25నుంచి 30 లక్షలు డిమాండ్ చేశారు. అనుకూలమైన నివేదిక కోసం డీపీ సింగ్‌ను కూడా రవిశంకర్ సంప్రదించారు. ఈ పనిని సురేష్‌కు సింగ్ అప్పగించారు. దీనిపై సింగ్‌ను సీబీఐ సంప్రదించినప్పటికీ ఇప్పటి వరకూ సింగ్ స్పందించలేదు. ఆరోగ్య శాఖలోని ఎనిమిది మంది అధికారులు భారీ ముడుపులు తీసుకుని కీలకమైన ఫైళ్లను మధ్యవర్తులు, కాలేజీ ప్రతినిధులతో పంచుకున్నారని సీబీఐ ఆరోపించింది. ఇంటర్నల్ నోటింగ్స్‌ను అధికారులు ఫోటోలు తీసి, మధ్యవర్తుల ద్వారా వీటిని షేర్ చేశారు. ఈ చర్యకు పాల్పడిన ఆరోగ్య శాఖలోని అధికారులను పూనమ్ మీనా, ధరమ్‌వీర్, పీయూష్ మల్యాన్, అనూప్ జైశ్వాల్, రాహుల్ శ్రీవాత్సవ, దీపక్, మనీషా, చందన్ కుమార్‌గా సీబీఐ గుర్తించింది. లీకైన సమాచారంతో మెడికల్ కాలేజీలు ముందుగానే ఇన్‌స్పెక్షన్లకు రెడీ కావడం, మూల్యాంకకులకు ముడుపులు చెల్లించడం, గోస్ట్ ఫ్యాకల్టీని ఉపయోగించడం, ఫేక్ పేషెంట్లను అడ్మిట్ చేయడం, బయోమెట్రిక్ టాంపరింగ్‌కు పాల్పడ్డాయి. ఎన్ఎంసీ టీమ్‌లు, మధ్యవర్తులు, ప్రైవేటు మెడికల్ కాలేజీల ప్రతినిధుల మధ్య కోట్లాది రూపాయలు చేతులు మారాయని, హవాలా మార్గాల్లో ఈ లావాదేవీలు సాగాయని సీబీఐ గుర్తించింది. పలు రాష్ట్రాల్లోనూ ఈ స్కామ్ వేళ్లానుకున్నట్టు దర్యాప్తు సంస్థ చెబుతోంది. వీటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కూడా ఉన్నాయి. అనంతపురంలో హరి ప్రసాద్ పలు కాలేజీలకు ఫిక్సర్‌గా పనిచేశారు. ఎన్ఎంసీ తనిఖీలకు డమ్మీ ఫ్యాకల్టీలను ఏర్పాటు చేశారు. హరిప్రసాద్ భాగస్వాములు కృష్ణ కిషోర్, అంకం రాంబాబులు దక్షిణాది కాలేజీ డైరెక్టర్ల నుంచి లంచాలు వసూలు చేశారని సీబీఐ చెబుతోంది. విశాఖపట్నంలోని మెడికల్ కాలేజీ వెంకట్ నుంచి, వరంగల్‌లోని ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఫాదర్ జోసెఫ్ కొమ్మారెడ్డి నుంచి లంచాలు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. కాగా ఈకేసులో యుజిసి మాజీ ఛైర్మన్ డిపిసింగ్, రవిశంకర్ మహరాజ్ అనే గాడ్‌మాన్, రావత్‌పుర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌మెడికల్‌సైన్సెస్‌ఛైర్మన్ సురేష్ సింగ్ భదౌరియా, ఇండోర్‌లోని ఇండెక్స్ మెడికల్ కళాశాల ఛైర్మన్ మయూర్ రావల్, గీతాంజలి రిజిస్ట్రార్ లకు ఈకేసులోప్రమేయం ఉందని, తనిఖీల నివేదికలను తారుమారు చేసినట్లు అభియోగాలునమోదుచేసింది.

## కేంద్ర ఉద్యోగులకు 4%డిఎ పెంపు

>> జీతాలకు తోడవుతుంది. అయితే తుది ప్రకటన వెలువడాల్సి ఉంది. పారిశ్రామిక కార్మి కులకు అన్వయించే అఖిలభారత వినియో గరంగ ధరలసూచీ మేనెలలో 0.5 పాయిం ట్లుపెరిగి 144కి చేరింది. మూడునెలలుగా సూచీ పెరుగుతూనే ఉంది. మార్చిలో 143, ఏప్రిల్‌లో 143.5, మేనెలలో 144 పాయిం ట్లుగా నమోద యింది. జూన్‌లో అయితే ఏకం గా 144.5 పాయింట్లకుచేరింది. 12 నెలల సగటు కూడా 144.17 పాయింట్లుగా ఉంది. ఏడో వేతన కమిషన్ నిబంధనను అనుసరించి డిఎ రేటు ప్రస్తుతం 58.85శాతంగా ఉం టుంది. ప్రభుత్వం ఈ సంఖ్యను 59శాతంగా సవరించే అవకాశం ఉంది. వీటన్నింటి దృష్ట్యా చూస్తే ఈ ఏడాది జులై నుంచి డిఎను కేంద్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు 3నుంచి 4శాతం మేర పెంచుతుందని అంచనా. ప్రస్తుతం ఉద్యోగులకు 55శాతం డిఎ ఉంది. తుది నిర్ణయం జూన్‌నెల ధరలసూచీ ఆధారంగా చేస్తారు. ఈ సూచీ గణాంకాలు ఆగస్టులో విడుదలవుతాయి. ఈ డిఎ పెంపు జులైనుంచి డిసెంబరు వరకూ ఉంటుంది. ఏడోవేతన సంఘం సిఫారసుల మేరకే చేస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. 2014లో ఈకమిషన్‌ను ఏర్పా టు చేసారు. కమిషన్ సిఫారసులన్నీ కూడా 2016 జనవరి ఒకటినుంచి అమలులోకి వచ్చాయి. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర అన్నిరంగాల వారిని సంప్రదించి ప్రభుత్వానికి తన సిఫారసులు అందచేస్తుంది. కేంద్ర ప్రభుత్వం 8వ వేతనసంఘం సిఫారసులను కూడా ఆమోదించింది. 2025 జనవరినుంచి సిఫార సులు చేసింది. అయితే ఇవి 2026 జనవరి ఒకటినుంచి అమలుకువస్తుంది. డిఎ పెంపును కూడా వాస్తవానికి సెప్టెంబరు లేదా అక్టోబ రులో ప్రకటిస్తుంది. ఎందుకంటే ఆరోజులన్నీ పండగసీజన్‌కాబట్టి ఉద్యోగుల ప్రయోజనాల ను దృష్టిలోపెట్టుకుని ప్రకటిస్తుంది. ఈసారి కూడా దీపావళి పండగ సీజన్ ఉన్నందున డిఎ పెంపును ప్రకటించిందని అంచనా.

## 10 గంటల పని!

>> చెల్లించాలని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. రోజులో ఆరు గంటల పనివేళల్లో కనీసం అరగంట విరామం ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. విరామంతో కలిపి రోజుకు 12 గంటల కంటే ఎక్కువ పని చేయించరాదని ఆదేశించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా పని వేళలను సవరించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## వారం - వర్జ్యం

తేది : 06-07-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
ఏకాదశి రా.9.13
విశాఖ రా.10.40
వర్జ్యం రా.3.05-4.51
దు.సా.4.56-5.48
శుభసమయం:ఉ.9.00-10.00, సా.7.15-8.00
రాహుకాలం - సా.4.30-6.00

## వారఫలం

**మేషం :** పోటీపరీక్షలలో, ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. రాజకీయ, కళారంగాల వారు సన్మానాలు, సత్కారాలు పొందుతారు.

**వృషభం :** గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. బాంధవ్యాల యత్నాలు అనుకూలిస్తాయి.

**మిథునం:** సంగీత సాహిత్యా విషయాలలో ఆసక్తి చూపుతారు. రుణవత్తిడుల నుండి బయటపడతారు.

**కర్కాటకం :** గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**సింహం:** దూరప్రాంతాల నుండి సంతోష కరమైన వార్తలు అందుకొంటారు. సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకొంటారు.

**కన్య :** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. కోర్టుకేసుల నుండి బయట పడతారు.

**తుల :** ఉద్యోగయత్నాలు కలిసి వస్తాయి. రాజకీయ, పారిశ్రామిక, వైద్య రంగాల వారికి యోగదాయకంగా వుంటుంది.

**వృశ్చికం:** శ్రమకు తగిన ఫలితాలు పొందుతారు. స్థిరాస్థి వృద్ధి చెందుతుంది. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి.

**ధనుస్సు:** భూవివాదాలు తీరి లబ్ధి పొందుతారు. అనుకోని అతిథుల నుండి కీలక సమాచారం అందుతుంది.

**మకరం:** సోదరులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**కుంభం:** స్థలాలు క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**మీనం :** దూరప్రాంతాల నుండి వచ్చిన వార్త ఆనందం కలుగుతుంది. వృత్తివ్యాపారాలు విస్తరిస్తారు. ప్రయాణాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కృష్ణమ్మ బిరబిర.. గోదావరి జరజరా..

## జలకళలాడుతున్న ప్రాజెక్టులు

### ఆల్మట్టి డ్యాంలో 41 టిఎంసిల అధిక నీరు.. తుంగభద్రకు 55 వేల క్యూసెక్కుల వరద

### శ్రీశైలం జలాశయానికి కూడా 55 వేల క్యూసెక్కుల అధిక నీరు

**హైదరాబాద్,జూలై 5,ప్రభాతవార్త:** కృష్ణానది బిరబిర పరుగులుపెడుతోన్నది. జూరాల నుంచి శ్రీశైలం వరకు నిండు కుండలా ఉంది. ఎగువన కర్నాటకలో కృష్ణా,దాని ఉపనదులపై ఉన్న ప్రాజెక్టుల్లో నీరు నిండటంతో తెలుగు ప్రజలు సంబరాలు చేసుకొంటున్నారు. లాల్‌బహద్దుర్‌శాస్త్రీ ఆలమట్టి డ్యామ్‌లో గత ఏడు కంటే 41.05టిఎంసి నీరు అధికంగా ఉంది. ఆలమట్టి డ్యామ్‌లో 91.08టిఎంసిలకు నీటి మట్టం చేరింది. తుంగభద్ర డ్యాం నుంచి శనివారం 55 వేల క్యూసెక్కులకు పైగా వరద నీరు వచ్చి చేరుతోంది. వరదను దృష్టిలో ఉంచుకొని రాజోలి శివారులోని సుంకేసుల డ్యాంలోని 14 గేట్లను ఒక మీటరు మేర ఎత్తి 55,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి 55వేల క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. 1.23 టిఎంసి నీటినిల్వ సామర్థం ఉన్న డ్యాంలో ప్రస్తుతం 0.85 టీఎంసీల నీటిని నిల్వ ఉంచినట్లుగా ఆయన పేర్కొన్నారు. మరోవైపు జూరాలలో7.66టిఎంసిల నీటి మట్టం రావడంతో 122523 క్యూసెక్కుల నీరు కిందికి వదులుతున్నారు. శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు స్పిల్వే నుంచి 90264, విద్యుదుత్పత్తి ద్వారా 29661 క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతోంది. శనివారం ఉదయం 6గంటలకు ప్రాజెక్టులో నీటి మట్టం 885 అడుగులకు చేరింది. నీటి నిల్వ172.66 టిఎంసిలు రిజర్వాయర్‌లో నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. గత ఏడాది శ్రీశైలంలో 37.09 టిఎంసిల నీరు ఉంది. శ్రీశైలం స్పిల్‌వే నుంచి నీరు విడుదల చేయడంలేదు. ఔట్‌ఫ్లో మాత్రం 64766 క్యూసెక్కులు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ఉంది. విద్యుదుత్పత్తి చేస్తూ కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రం ద్వారా 26140. ఎడమగట్టు కేంద్రం ద్వారా 34926 క్యూసెక్కుల ప్రవాహాన్ని దిగువకు వదులుతున్నారు. కుడి జల విద్యుత్తు కేంద్రంలో 14.428, ఎడమ గట్టు కేంద్రంలో 17.498 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసినట్లు పేర్కొన్నారు. ఎన్ఎస్‌పిలో 155.92టిఎంసిలు నీరు వచ్చి చేరింది. పులిచింతలో20 టిఎంసిలు, కృష్ణాడెల్టాలో 2.89 టిఎంసిలు నీరు ఉంది. గోదావరి నది మందగమనంతో ఉంది. జైక్వాడీ డామ్‌లో 62.83టిఎంసిల నీరు వచ్చి చేరింది.గత ఏడాది తోపోల్చితే 33.52టిఎంసిలు అధికంగానే నీరు ఉంది. బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి 1.5టిఎంసిల వరదనీరు జూలై 1 నుంచి వచ్చి చేరింది. శనివారం ఉదయం 17.97 టిఎంసిల నీరు డ్యామ్‌లో ఉంది. గత యేడాది ఇదేరోజు 11.567టిఎంసిల నీరు మాత్రమే అందులో ఉన్నది. గోదావరి నీటిమట్టం భద్రాచలం వద్ద పెరుగుతున్నది. మిడ్‌మానేరు,లోయర్‌మానేరు, శ్రీపాద ఎల్లంపల్లి,కడెంలో గతంతో పోల్చితే ఎక్కువగానే ఉన్నా ఆశాజనకంగా గోదావరి ప్రవాహం లేదు. దిగువన మేడిగడ్డ వద్ద నీటి ఉధృతి కొనసాగుతోన్నది. మేడిగడ్డ కేంద్రం నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. వారం రోజుల క్రితం 4 అడుగులు ఉన్న నీటిమట్టంశుక్రవారం ఉదయానికి 14.5 అడుగులకు చేరగా, శనివారం 20 అడుగులకు చేరి ప్రవహిస్తోంది. నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం లోని అడవి సోమన్‌పల్లి వద్ద కేంద్రజల సంఘం కేంద్రంలో నమోదైన నీటి గణాంకాల ప్రకారం వెల్లడవుతోంది. గోదావరిలో నీటిమట్టం పెరగడంతో స్నాన ఘట్టాల వద్దకు వరద జలాలు చేరాయి.

## మహిళా సాధికారతలో తెలంగాణ రోల్ మోడల్

>> వివరించారు. రాష్ట్ర విభజన అనంతరం 10 సంవత్సరాలు పరిపాలించిన టిఆర్ఎస్ నేతలు వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాలకు ప్రోత్సాహకాలను గాలికి వదిలేసారని విమర్శిం చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి వడ్డీ లేని రుణాలను ప్రారంభించి మహిళా సంఘాలను ప్రోత్సహించి వారితో ప్రత్యేకంగా వ్యాపారాలు చేయిస్తుందని తెలిపారు. హైదరా బాద్ నగరం నడిబొడ్డున లక్షలాదిమందితో సభ నిర్వహించి ఇప్పటికే రెండుసార్లు వడ్డీ లేని రుణాల చెక్కులు పంపిణీ చేశామని గుర్తు చేశారు. మరోసారి వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఉత్సవంలా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. వడ్డీ లేని రుణాల ద్వారా లభించిన పెట్టుబడులను ఎలా సద్వినియోగం చేసుకోవాలి, ఏ ఏ వ్యాపారాలు చేయాలి అనే అంశంపై ఈనెల ఏడు నుంచి తొమ్మిది వరకు జిల్లా, మండల, గ్రామ శాఖ స్థాయిలో మహిళా సంఘాలు సమావేశమై చర్చించుకోవాలని వడ్డీ లేని రుణాలు ప్రభుత్వం అందిస్తున్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని డిప్యూటీ సీఎం మహిళా సంఘాలకు సూచించారు. ఈనెల 10నుంచి 16 వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో ప్రజలందరి సమక్షంలో వడ్డీ లేని రుణాలకు సంబంధించిన చెక్కుల పంపిణీ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపడుతున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. కేవలం వడ్డీ లేని రుణాలే కాదు బ్యాంకు లింకేజ్, లోన్ బీమా, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం మనందరిదీ సమాజంలో కుటుంబ వ్యవస్థ ప్రధానమైనది ఆ వ్యవస్థను నడిపేది మహిళ వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తే రాష్ట్రం, ప్రజలు తలెత్తుకుని జీవించే పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడుతుందని తెలిపారు.



బ్యూనస్ ఎయిర్ పోర్టులో శనివారం ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ప్రవాస భారతీయులు

## రక్షణ, వాణిజ్యరంగాల్లో అర్జెంటీనాతో బంధం శాశ్వతం

### అధ్యక్షుడు జేవియర్‌మిలీతో చర్చల అనంతరం ప్రధాని మోడీ

**బ్యూనస్ ఏరీస్,జూలై 5:** ఐదుదేశాలపర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోడీ అర్జెంటీనా పర్యటనలో ఆయనకు సాదర స్వాగతం లభించింది. రాజధాని బ్యూనస్ ఏరీస్ ఎయిర్‌పోర్టులో అర్జెంటీనా అధ్యక్షుడుజేవియర్ మిలీ ఆయన్ను ఆలింగనంచేసుకుని స్వాగతం పలికారు. అక్కడినుంచి సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించిన ప్రధాని తదనంతరం అధ్యక్ష కార్యాలయంలో జేవియర్ మిలీతో ద్వైపాక్షిక చర్చలుజరిపారు. రక్షణరంగం, వ్యవసాయం, మైనింగ్, చమురుగ్యాస్, పునరుత్పత్తి ఇంధనం, వాణిజ్యం పెట్టుడుల రంగాలపరంగా ఇరుదేశాధినేతలమధ్య విస్తృత స్థాయిలో చర్చలుజరిపారు. అంతకుముందుప్రధానిమోడీ ఫాదర్ ఆఫ్‌ది అర్జంటీనా జోస్‌డే సాన్ మార్టిన్‌కు ఘన నివాళి అర్పించారు. సాన్‌మార్టిన్ తన పోరాటంతో అర్జెంటీనా, పెరు, చిలీ దేశాలకు స్వేఛ్ఛా స్వాతంత్ర్యాలుసాధించడంలో విశేష కృషిజరిపారు. 57 ఏళ్లతర్వాత మొదటిసారిగా భారత ప్రధానమంత్రి అర్జెంటీనాలోపర్యటించారు. అంతకుముందు 2018సంవత్సరంలో జి20 సదస్సుకు హాజరయ్యారు. బ్యూనస్ ఏరీస్ లోని భారతీయ సంతతికి చెందిన కుటుంబాలు, పౌరులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. అర్జెండీనా అధ్యక్షుడు మిలీని గుజరాత్‌లోని సింహాల శాంక్చువరీని సందర్శించాలనికోరారు. అర్జెంటీనా పర్యటనను ముగించుకుని ప్రధాని ప్రధాని బ్రెజిల్‌పర్యటనకువెళ్లారు. 17వ బ్రిక్స్ సమావేశాలో పాల్గొంటారు. బ్రిక్స్ సదస్సులోని దేశాధినేతలతో భేటీ నిర్వహించిభారత సంబంధాలను పునఃసమీక్షచేస్తారు. అక్కడినుంచి చివరిగా ప్రధాని నమీబియాను సందర్శింస్తారు.

## 6 గ్యారంటీలు ఏవీ? ఎక్కడ?

>> మీది రాతగానే మారింది. యేడాదికి రెండు పర్యాయాలు ఇస్తామన్నారు. ఎకరానికి రూ.7500 చొప్పున, మొత్తం నాలుగు సార్లు రైతుల ఖాతాల్లో జమ కావాలి. కానీ, ఒక పర్యాయం పూర్తిగా ఎగ్గొట్టారు. మిగితా మూడు పర్యాయాలు ఎకరానికి రూ.5000 చొప్పున, అదీ అందరికీ కాకుండా, కేవలం కొంత మంది రైతుల ఖాతాలకే బదిలీ చేశారు. తక్షణమే మీరిచ్చిన హామీ మేరకు ఎకరానికి రూ.15,000 చొప్పున రైతులందరికీ, మధ్యలో ఆపిన రెండో వాయిదా సహా మొత్తం రైతు భరోసా డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసే సంప్రదాయం రాష్ట్రంలో తరతరాలుగా కొనసాగుతోంది. మరి, కౌలు రైతులకు ఆర్థిక సాయం అందించకుండా, కనీసం కౌలు రైతులను గుర్తించడంలోనూ మీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.
రైతులను గుర్తించి, వెంటనే ఎకరానికి రూ.15000 చొప్పున రైతు భరోసా డబ్బులు చెల్లించి, వారిని ఆదుకోవాలన్నారు. వ్యవసాయ కూలీలకు ఇస్తానన్న యేడాదికి రూ.12,000 ఆర్థిక సాయాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ పేరుతో రైతులను నిండా ముంచారని, 2023 డిసెంబర్ 9లోగా రుణమాఫీ ఏకమొత్తంలో చేస్తామన్నారు, అదీ కాలేదన్నారు. రాష్ట్రంలో 40 లక్షలకు పైగా రైతులకు రుణమాఫీ చేస్తామని స్వయంగా మీరే చెప్పారని, కేవలం 20 లక్షల మందికే రుణమాఫీ చేశారని అన్నారు. రుణమాఫీ పూర్తి కాని మిగతా రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. ఇల్లు లేనివారికి ఇంటి స్థలం, రూ. 5లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. దీని కోసం గ్రామ సభలు పెట్టి లబ్దిదారులను ఎంపిక చేశామన్నారు, కానీ ఇంతవరకు ఏ ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వలేదని, రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించలేదన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం సహకరిస్తున్నా, ఇల్లు లేని పేదలను ఆదుకోవడంలో మీప్రభుత్వం ఏమాత్రం చిత్త శుద్ధితో పని చేయడం లేదని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది లోపు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని యువతకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేదు. సంవత్సరం దాటింది. 20 నెలలు అవుతున్నా మీ హామీ నెరవేరలేదన్నారు. శుక్రవారం మీ పార్టీ కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఇప్పటివరకు 60వేల నియామకాలు పూర్తి చేశామని చెప్పారు. ఇందులోనూ గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్లకే నియామక పత్రాలు ఇచ్చినవే ఎక్కువ. మీ ప్రభుత్వం వచ్చాక నోటిఫికేషన్లు జారీ చేసి, భర్తీ చేసిన ఉద్యోగాలు చాలా తక్కువ. మీరిచ్చిన హామీలో పదో వంతు కూడా అమలు కాలేదని స్పష్టమవుతుందన్నారు. మీ హామీ మేరకు తక్షణమే 2 లక్షల నియామకాల భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఇస్తానన్న రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డును కూడా వెంటనే అమలు చేయాలి. ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్సీ అమలు చేయలేదు. డిఏలు ఇవ్వడం. పదవీ విరమణ పొందిన వారికి రిటైర్మెంట్ ప్రయోజనాలు అందించడం లేదు. తక్షణమే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాను. రూ. 300 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కూడా పాక్షి కంగానే అమలవుతుందని, ఇన్ని అర్హతలున్నా చాలా మందికి ఈ పథకాలు అములు కావడం లేదన్నారు. వారికి కూడా ఈ పథకం కింద రూ.500 గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ అందించాలి. మమ్మల్ని నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు 6 గ్యారెంటీలు, 63 అనుబంధ హామీలు తక్షణమే అమలు చేయాలని సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

## ఆసుపత్రి నుంచి కెసిఆర్ డిశ్చార్జ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై5:** బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శనివారం యశోద ఆసుపత్రి డిశ్చార్జ్ అయ్యారు. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా ఆయన గురువారం ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. బ్లడ్ షుగర్, సోడియం స్థాయిలు పర్యవేక్షించడానికి కెసిఆర్‌ను వైద్యులు ఆసుపత్రిలో చేరాల్సిందిగా సూచించారు. దీంతో ఆయన రెండు రోజులు ఆసుపత్రిలో ఉండి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందారు. సాధారణ వైద్య పరీక్షల నిర్వహణ అనంతరం కెసిఆర్ ఆరోగ్యం మెరుగ్గానే ఉందని, సోడియం లెవల్స్ కొద్దిగా పెరిగాయని యశోద వైద్యులు నిర్ధారించారు. కాగా, వైద్య పరీక్షల్లో భాగంగా ఒక వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని, ఆ తర్వాత, మరోసారి కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించాలి ఉంటుందని యశోద వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో.. రానున్న గురు, శుక్ర వారాల్లో వైద్య పరీక్షల నిమిత్తం మరోసారి యశోద హాస్పటల్‌కు అధినేత కెసిఆర్ వెళ్లనున్నారు.

## తేల్చుకుందాం!

>> ఉద్యమాన్ని నడిపాం. రేవంత్ రెడ్డి వచ్చాక నీళ్లను ఆంధ్రాకు, నిధులను ఢిల్లీకి పంపుతున్నారు. తన అనుచరులకు నియామకాలు ఇచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం చేసినట్లు రైతులకు ఎక్కడా, ఎవరూ చేయలేదు. 70 లక్ష మంది రైతుల ఖాతాల్లో నిధులు జమచేశాం. రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. రైతుకు పెట్టుబడి, ఉచిత విద్యుత్, వాగులు నింపిన ఘనత కూడా కేసీఆర్‌దే. రైతు చనిపోతే రూ.5 లక్షల బీమా ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే. దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో చెరువులను ధ్వంసం చేశారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులకు జీవం పోశాం. రూ.30 వేల కోట్ల విలువైన మత్స్య సంపద సృష్టించాం. రాష్ట్రాన్ని కోటి ఎకరాల మాగాణిగా మార్చింది కేసీఆర్ కాదా?. 75 ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత వ్యవసాయ రంగానికి కేసీఆర్ చేసినంత ఎవరూ చేయలేదు. ఎరువుల పంపిణీ చేతకాని మీరు.. కేసీఆర్‌ను చర్చకు పిలుస్తారా?. యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎరువులు, విత్తనాల కోసం లైన్లలో చెప్పులు పెట్టడమేనా ఇందిరమ్మ రాజ్యం అంటే. ఆసిఫాబాద్ జిల్లాలో రైతులు ఎరువల కోసం యుద్ధాలు చేస్తున్నారు. ఆధార్ కార్డు చూపిస్తే రైతుకు ఒక బస్తా యూరియా ఇవ్వాలని ఆదేశించారు. రైతుల ఆత్మహత్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చింది రేవంత్ రెడ్డి కాదా. వాగులు, వంకలు నింపిన ఘనత కేసీఆర్‌ది. బోనస్ ఇవ్వకుండా ఎగ్గొట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ రైతు బీమా తీసుకొచ్చారు. ఆ రైతు బీమాను ఎగ్గొట్టింది రేవంత్ రెడ్డి కాదా?. కేసీఆర్ దేశంలోనే తెలంగాణను నంబర్ వన్ రాష్ట్రంగా మార్చారు. కిందికి నీళ్లను తీసుకెళ్తుంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు హారతులు పట్టారు. గోదావరి, కృష్ణా నీటిని ఒడిసిపట్టి కోటి ఎకరాల మాగాణం చేసింది కేసీఆర్ కాదా?. ఇదంతా తెలంగాణ రైతాంగానికి తెలియదా. మీ గురువు చంద్రబాబు బనకచర్ల ద్వారా నీళ్ల దోపిడీకి పాల్పడుతున్నాడు. చంద్రబాబుకు వత్తాసు పలుకుతున్నదెవరో ప్రజలకు తెలియదా అని ప్రశ్నించారు. నాలుగు పంటలకు రైతుభరోసా ఎగ్గొట్టి పండుగ చేసుకోమంటున్నవు. రైతు భరోసాకు రూ.15 వేలు ఇస్తున్నవా?. కౌలు రైతులకు లేఖలు రాసి ఇప్పుడెందుకు పైసలు ఇస్తలేవు?. రైతు బంధులో మొత్తం రూ.39 వేల కోట్లు ఎగ్గట్టారు. మొదటి విడుతలో రూ.15 వేలు అని చెప్పి రూ.10 వేలే వేశారు. ఎన్నికల వరకే రైతుభరోసా ఇస్తాడు. తర్వాత మొత్తం బంద్ పెడుతారు. ఒక్కో రైతుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.19 వేలు బాకీ ఉంది. రైతు రుణమాఫీ రూ.12 వేల కోట్లు మాత్రమే చేశారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వలేదు. 30 శాతం వడ్లు మాత్రమే కొనుగోలు చేశారు. కేసీఆర్‌హయాంలో ప్రారంభమైన ఉద్యోగ ప్రక్రియకు అపాయింట్‌మెంట్ ఉద్యోగాలు ఇచ్చాడు. మందికి పుట్టిన బిడ్డను మా బిడ్డ అని చెప్పుకుంటున్నాడని కేటీఆర్ తప్పుపట్టారు.

## సమానత్వంలో భారత్@ 4

>> ఇప్పుడు గణనీయంగా మెరుగుపడటం, దేశ ఆర్థిక ప్రగతి ఫలాలు ప్రజలందరికీ సమానంగా అందుతున్నాయనడానికి నిదర్శనమని సాంఘిక సంక్షేమ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ఘనత వెనుక దేశంలో పేదరికాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న స్థిరమైన విధానాలే ప్రధాన కారణమని ప్రపంచ బ్యాంకు తన నివేదికలో స్పష్టం చేసింది. 2011 నుంచి 2023 మధ్య కాలంలో దేశంలో సుమారు 17.1 కోట్ల మంది తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపింది. ఇదే సమయంలో, రోజుకు 2.15 డాలర్ల ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకుంటే, దేశంలో పేదరికపు రేటు 16.2 శాతం నుంచి కేవలం 2.3 శాతానికి పడిపోయింది. ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన ద్వారా 55 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలు తెరవడం, ఆధార్ ద్వారా 142 కోట్ల మందికి ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) సేవలు అందించడం వంటి కార్యక్రమాలు ఈ మార్పునకు దోహదపడ్డాయి. డీబీటీ ద్వారా మార్చి 2023 నాటికి రూ.3.48 లక్షల కోట్లు ఆదా అయినట్లు నివేదిక వెల్లడించింది. వీటితో పాటు, ఆయుష్మాన్ భారత్ కింద 41 కోట్ల మందికి ఆరోగ్య రక్షణ, పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన ద్వారా 80 కోట్ల మందికి ఆహార భద్రత కల్పించడం వంటి పథకాలు కూడా ఆదాయ సమానత్వాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించాయి.

# రైతులకు అందుబాటులో ఏఐ టెక్నాలజీ

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** రైతులకు అందుబాటులో ఏఐ టెక్నాలజీని తీసుకొస్తున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. హైదరాబాద్ సచివాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీతో శాటిలైట్ ఇమెజింగ్ ద్వారా ముందస్తుగానే పంటలకు వచ్చే చీడ పురుగులు, రసం పీల్చే పురుగులను గుర్తించి, వాటిని మొదట్లోనే నిరోధించవచ్చున్నారు. అంతే కాకుండా పంట బయటకు కనిపించే వాటినే కాకుండా



పంట అంతర్గతంగా ఉన్న రోగాన్ని కూడా గుర్తించి దానికి నివారణ చర్యలు కూడా సిఫార్సు చేస్తుందని చెప్పారు. దీనిద్వారా వాటికి కావాల్సిన నివారణ చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. పొలంలో ఎక్కడ ఏ ప్రాంతంలో ఏ మొక్కకు తెగులు సోకిందో ముందు గానే గుర్తించి దానికి మందును కూడా తెలుసుకునే వీలుందని వివరించారు. ఇలాంటి యాప్ ల వినియోగించడం వలన రైతుల విలువైన సమయం ఆదా అవడంతోపాటు, రైతులు తమ పంటలకు ఖచ్చితమైన నివారణ చర్యలు తీసుకునే వీలుకలుగుతుందని అభిప్రాయపడ్డారు.

# ఓటరు లిస్టు నుంచి మాజీ ఎమ్మెల్యే రమేష్ పేరు తొలగింపు

## ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** వేములవాడ నుంచి నాలుగుసార్లు ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ పేరును ఓటరులిస్టు జాబితా నుంచి తొలిగించారని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ తెలి పారు. శనివారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ న్యాయ పోరాటంలో మరో విజయం సాధించినాని ప్రభుత్వ విప్, వేములవాడ ఎంఎల్ఏ ఆది శ్రీనివాస్ అన్నారు.వేములవాడ ఓటర్ల జాబితా నుంచి మాజీ ఎంఎల్ఏ చెన్నమనేని రమేష్ పేరు ను అధికారులు తొలగించిచారని తెలిపారు. ఆయన పేరు తొలగిస్తూ రమేష్ నివాసం గేట్ కు నోటీస్ అంటించినటుట్లు తెలిపారు..చెన్నమనేని రమేష్ భారత పౌరుడు కాదని గతంలో స్పష్టం చేసిన హైకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు ఆధారంగా చెన్నమనేని రమేష్ పేరును ఓటర్ లిస్టు నుంచి తొలగించాలని అధికారులను కోరినానని ఆది శ్రీనివాస్ వెల్లడించారు. ఓటర్ లిస్టు లో పేరు తొలగింపు పైన అధికారులు నోటీస్ లు ఇచ్చినారు. అధికారుల నోటీస్ కు చెన్నమనేని రమేష్‌సమాధానం ఇవ్వలేదని తెలిపారు. దీంతో రమేష్ పేరును ఓటర్ లిస్టు నుంచి తొలగించినారు. నాలుగు సార్లు ఎంఎల్ఏ గా గెల్చిన నేత పేరు ను ఓటర్ లిస్టు నుంచి తొలగించడం దేశం లోనే మొదటి సారి కావడం విశేషం అని ఆయన అన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు..

# బిజెపి శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి సిట్ నోటీసులు

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాజకీయంగా ప్రకంపనలు రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో బిజెపి శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్ రె డ్డికి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. వాస్తవానికి మహేశ్వర్ రెడ్డికి శుక్రవారం నాడు నోటీసులు ఇచ్చిన అధికారులు శనివారం నాడు విచారణకు రావాల ని కోరగా తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పదవీ స్వీకారం వుండడంతో రాలేనని ఆయన సమాధానం ఇచ్చారు. దీంతో వచ్చే బుధవారం లేదా గురువారం నాడు విచారణకు రావాలని సిట్ అధికారులు మహేశ్వర్ రెడ్డిని కోరారు. ఇందుకు ఆయన సమ్మతించినట్లు తెలిసింది. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు బిజెపి నుంచి ఎంపి ఈటల రాజేందర్‌తో పాటు మరో ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు హాజరై తమ వాంగ్మూలం ఇచ్చారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో వుండగా మరో ఎంపి రఘునందన్ రావు వాంగ్మూలాన్ని సిట్ అధికారులు ఆసుపత్రికి వెళ్లి తీసుకున్నారు. నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్‌తో పాటు మరో ఇద్దరు ఎంపిలు, నలుగురు ఎంఎల్ఏల వాంగ్మూలం తీసుకోవాల్సి వుంది. వచ్చే వారంలో వీరి వాంగ్మూలం తీసుకునే వీలుంది.

# రేపు ఐసెట్-2025 ఫలితాలు విడుదల

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఎంబిఏ, ఎంసిఏ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఐసెట్-2025 కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ ఫలితాలను రేపు(సోమవారం) విడుదల చేయనున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు మాసబ్ ట్యాంక్‌లో గల తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విడుదల చేయనున్నారు. ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, మహాత్మాగాంధీ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఐ సెట్ ఫలితాలను విడుదల చేయనున్నారని ఐ సెట్-2025 సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఆలువాల రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐ సెట్ పరీక్షలకి 90.51 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షను జూన్ 8, 9తేదిల్లో నిర్వహించారు. మూడు సెషన్‌లలో కలిపి 90.51 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఐ సెట్-2025కి 71,746 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 64,938 మంది పరీక్షలకు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 జోన్లలో 93 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకి 34,409 మంది పురుషులు దరఖాస్తు చేసుకోగా.. 37,331 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం మూడు సెషన్‌లలో 71,746 మందికిగాను.. 64,938 మంది(90.51 శాతం) హాజరయ్యారు. ఐ సెట్ ప్రాథమిక కీని జూన్ 21న విడుదల చేయగా.. అభ్యర్థుల నుంచి జూన్ 26వరకు అభ్యంతరాలను స్వీకరించారు. సోమవారం ఫలితాలను విడుదల చేయనున్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను చెల్లించాలి

## లేకపోతే ఉద్యమ కార్యాచరణ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోన్ని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించి వివిధ రకాల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే ఉద్యమ కార్యాచరణ తప్పదన్నారు. శనివారం హైదరాబాద్‌లోని నారాయణగూడలో ఉన్న పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి, మాజీ బాధ్యులు పేరి వెంకట్ రెడ్డి, మనోహర్ రావు, క్రమశిక్షణా కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, నాయకులు వంగ మహేందర్ రెడ్డి, వెంకటనర్సయ్య, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ. 700 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చి గత నెల కేవలం రూ.180 కోట్లు మాత్రమే చెల్లించిందన్నారు.

ఈ నెల గతనెలతో కలుపుకొని రూ.1200 కోట్లు చెల్లించి మాట నిలుపుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు ప్రకటించాలని సమావేశం తీర్మానించింది. గురుకుల పాఠశాలల సమయ పాలన సవరించాలని, కెజిబివి ఉద్యోగినులకు కనీస మూలవేతనం, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దుద్వారా వేతనాల చెల్లింపు, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు తదితర ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2025 సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు సూచించారు.

# 19 నెలల వ్యవధిలో 18,973 డ్రైవింగ్ లైసెన్స్‌ల సస్పెన్షన్

## డ్రంకన్, రాష్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌లు ప్రధానకారణం

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** తెలంగాణలో తొలిసారిగా 19 నెలల వ్యవధిలో 18,973 వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో మద్యం సేవించి పట్టుబడిన వారు, అతి వేగంగా, అడ్డదిడ్డంగా వాహనాలు నడుపుతూ దొరికి పోయిన వారు, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసిన వారి లైసెన్స్‌ల రద్దుకు పోలీసు శాఖ చేసిన సిఫార్సుల మేరకు 18,973 మంది వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌ల ను సస్పెండ్ చేశారు.

వీరంతా 2023 డిసెంబర్ నుంచి 2025 జూన్ నెలాఖరు వరకు జరిగిన స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులు కావడం గమనార్హం. రాష్ట్రంలో ఇంతకు ముందు కేవలం డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారుల లైసెన్స్‌లను మాత్రమే సస్పెండ్ చేసేవారు. అయితే రోడ్డు ప్రమాదాలన గరిష్టస్థాయికి తగ్గించేందుకు ఇండియన్ రోడ్ సైన్స్ కాంగ్రెస్ చేసిన సిఫార్సుల మేరకు అతి వేగంగా, అడ్డదిడ్డంగా వాహనాలు నడుపుతూ దొరికిపోయిన వారు, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసిన వారిని కూడా ఇందులో చేర్చారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దయిన వారిలో తొలిసారిగా సస్పెండ్ అయిన వారు 50 శాతం వరకు వుండగా మి గతా వారు రెండు అంతకు ఎక్కువసార్లు సస్పెండ్ అయిన వారు వున్నారు. ఇందులో కొందరు మళ్లీ డ్రైవింగ్ లైసెన్స్ పొందే అవకాశాలు లేవని పోలీసు అధికా రులు చెబుతున్నారు. వీరు అతిగా మద్యం సేవించడంతో పాటు రాష్ డ్రైవింగ్ చేస్తూ దొరికిపోయిన వారుగా అధికారులు తెలిపారు. దీంతో పాటు వాహనదా రుల డ్రైవింగ్ స్కిల్స్‌ను పెంచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 25 ద్విచక్ర, 27 త్రిచక్ర,, 27 ఫోర్ వీలర్, ఐదు భారీ వాహనాల టెస్టింగ్ ట్రాక్‌లను ఆటోమేటెడ్ డ్రైవి ంగ్ టెస్ట్ ట్రాక్‌లుగా మార్చేందుకు సర్కారు నిర్ణయించింది. ఇందుకోసం ఈ ఏడాది ఆగస్టు చివరి నాటికి వాహన అప్లికేషన్ ద్వారా డిజిటల్ సేవలను అందుబా టులో తేనున్నారు. ఇక రాష్ట్రంలో వాహనాల కోడ్‌ను టిఎస్ నుంచి డిజిగా మార్చడం తెలిసిందే. 2024 మార్చి 15వ తేదీన ఈ మార్పు అమల్లోకి రాగా జూన్ 30 నాటికి 13.05 లక్షల వాహనాలు టిజి కోడ్‌తో రిజిస్టర్ అయ్యాయి.

### పర్యావరణ పరిరక్షణ కోసం ఇవిలకు ప్రోత్సాహకాలు

ఇదిలా ఉండగా రాష్ట్రంలో ఓవైపు ఇష్టానుసారం వ్యవహరించే డ్రైవర్లపై కొరడా ఝళిపిస్తున్న సర్కారు మరోవైపు పర్యావరణ హితం కోసం విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగం పెంచేం దుకు ప్రోత్సాహకాలను పెంచింది. ఇందుకోసం రాయితీలను కూడా పెంచింది. ఈవీ పాలసీ రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజులో 100 శాతం మిన హాయింపును ఇస్తున్నట్లు రవాణా శాఖ పేర్కొంది. 2024 నవంబర్ 16వ తేదీ నుంచి 2025 జూన్ 30వ మధ్య కాలంలో 49,633 ఈవీ లకుగానూ 369.27 కోట్ల రూపాయల పన్నులను సర్కారు మినహాయించింది.

# నేడు పాతబస్తీలో మొహర్రం ఊరేగింపు

## పటిష్టమైన భద్రతాఏర్పాట్లు

## బీబీకాఆలంను సందర్శించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్ (చార్మినార్), జూలై 25, ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతనగరంలో ఈ నెల 6వ తేదీ ఆదివారం మొహారం ఊరేగింపు జరగనున్నది. మొహారం ఊరేగింపు సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం పాతబస్తీ డబీర్‌పుర లోని బీబీకా ఆలంను సందర్శించి ఆలంకు పూలు, దట్టీలు సమర్పిం చారు. ఈ కార్య క్రమంలో ఎమ్మెల్సీలు అమేర్‌అలీఖాన్, ఎఫెండీ, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ తోపాటు పలు వురు పాల్గొన్నారు. కాగా పాత బస్తీ డబీర్‌పుర బీబీకా ఆలం ఊరేగింపుకు కర్ణాటక రాష్ట్రం నుంచి ఏనుగు లక్ష్మి వచ్చింది. కర్ణాటకలోని హోరాపేటే, తుమ్‌కూర్‌లోని కరి బసవ స్వామి మఠ్, జగద్గురు చెన్న బసవ రాజేంద్ర మహా సమిగల్‌కు చెందిన లక్ష్మి ఏనుగు శనివారం పాతబస్తీకి చేరుకుంది. కాగా డబీర్‌పుర నుంచి అలీజాకోట్ల, చార్మినార్, గుల్జారా హౌస్. ఛాదర్ ఘాట్ వరకు ఆదివారం జరగనున్న మొహారం ఊరేగింపు సందర్భంగా గట్టి బందో బస్తు ఏర్పాట్లు చేశామని మీర్‌చౌక్ ఎసిపి శ్యామ్‌సుందర్ తెలిపారు.



డబీర్‌పురలోని బీబీకాఆలంను సందర్శించిన రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

# మంత్రి సీతక్కకు మావోయిస్టుల బెదరింపు లేఖలో కొత్త ట్విస్ట్

## తాము ఏ లేఖ రాయలేదని ఆ పార్టీ ప్రకటన

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను బెదరిస్తూ మావోయిస్టుల పేరిట ఇటీవల వచ్చిన లేఖ రాష్ట్ర వ్యాప్తంగా స ంచలనం రేపడం తెలిసిందే. ఈ లేఖపై మంత్రి సీతక్క సైతం స్పందించి దీనిపై తనకు అనుమానాలు వున్నాయని, తనలాంటి వ్యక్తులను మావోయిస్టులతో పాటు ఎవరూ టార్గెట్ చేసే అవకాశం లేదని తెలపడం విదితమే. ఈ లేఖపై పోలీసు శాఖ విచారణ చేబట్టి కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేబట్టింది. ఈ విచారణ ఓవైపు కొనసాగుతుండగానే శనివారం నాడు మావోయిస్టు పార్టీ పేరిట ఒక లేఖ విడుదలయ్యింది. రాష్ట్ర మంత్రి సీతక్కను తాము బెదిరించినట్లు వచ్చిన లేఖ బూటకమని, ఈ లేఖను తాము రాయలేదని మావోయిస్టు పార్టీ పేర్కొంది. దీంతో సీతక్కకు వచ్చిన బెదిరింపు లేఖను కొందరు కావాలని సృష్టించినదని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దీనికి కారకులైన వారి కోసం ఆరా తీస్తున్నారు. మంత్రి సీతక్కను బెదిరించడం ద్వారా ఏదైనా లబ్ధినపొందాలని లేఖ రాసిన వారు భావిస్తున్నారా? అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేబట్టారు.

# బాసర త్రిపుల్ ఐటీలో మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రవేశాలు

## 243 మందికి అడ్మిషన్లు

## 180 మంది బాలికలు.. 63 మంది బాలురు

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** నిర్మల్ జిల్లాలోని బాసరలో కొనసాగుతున్న రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జె టెక్నాలజీస్(ఆర్‌జియుకెటి) అడ్మిషన్లలో మోడల్ స్కూల్స్‌లో చదివిన విద్యార్థులకు సీట్లు దక్కాయి. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూల్స్‌లో చదివిన వారిలో 243 మంది విద్యార్థులు ఆర్‌జియుకెటిలో అడ్మిషన్లు పొందారు. వారిలో 180 మంది బాలికలు ఉండగా.. 63 మంది బాలురున్నట్టు తెలంగాణ మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బి టెక్ ప్రొగ్రామ్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల వివరాలను యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ విసి ప్రొఫెసర్ ఏ గోవర్ధన్ ప్రకటించారు. మొత్తం 1690 సీట్లకు అడ్మిషన్లను తీసుకున్నట్టు తెలిపారు. అందులో 243 మంది మోడల్ స్కూల్స్‌లో చదివిన వారు ఉండటం విశేషం. నిజామాబాద్ జిల్లాలోని స్కూల్స్ నుంచి ఇద్దరు బాలురు, 13 మంది బాలికలు ఆర్‌జియుకెటిలో సీట్లు పొందారు. అలాగే కరీంనగర్ జిల్లా నుంచి నలుగురు బాలురు, 9 మంది బాలికలు, రాజన్న సిరిసిల్ల నుంచి ముగ్గురు బాలురు, 19 మంది బాలికలు, మహబూబాబాద్ జిల్లా నుంచి ఏడుగురు బాలురు, నలుగురు బాలికలు కలిపి మొత్తం 180 మంది బాలికలు, 63 మంది బాలురు ఆర్‌జియుకెటిలో సీట్లు పొందినట్టు మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ తెలిపారు.

# బిజెపి అంటే కార్యకర్తల పార్టీ

## రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలవి రెండు విఫల ప్రభుత్వాలు

## రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రాంచందర్‌రావు

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** బిజెపి అంటే కార్యకర్తల పార్టీ అని, తెలంగాణలో 40 లక్షల మంది కార్యకర్తలు బూత్ స్థాయిలో అహర్నిశలు పనిచేస్తున్నారని బిజెపి రాష్ట్ర కొత్త అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఆయన్ను గజలమాలతో సత్కరించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎంపిలు డికె అరుణ, ఈటల రాజేందర్‌లు రాంచందర్‌ను అభినందించారు. అంతకుముందు రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తన నివాసం నుంచి ర్యాలీగా ఉస్మానియా యూనివర్సిటీలోని సరస్వతి దేవాలయం, చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాయలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

మామూలు కార్యకర్తగా పార్టీలో పనిచేస్తూ, సైకిళ్లపై తిరుగుతూ పోస్టర్లు అంటించడం, బ్యానర్లు వేయడం, బూత్ ఏజెంట్‌గా పార్టీ కోసం నిబద్ధతతో పనిచేయడం ద్వారా నా రాజకీయ ప్రయాణం బిజెపిలో ప్రారంభమైందన్నారు. విద్యార్థి పరిషత్‌లో ఉన్న సమయంలో ప్రారంభించిన ఉద్యమ స్వభావం, బిజెపిలో కొనసాగించానని, దేశంలో సొంత మెజార్టీతో బిజెపి ప్రభుత్వం 13 రాష్ట్రాల్లో అ ధికారంలో ఉందన్నారు. మరికొన్ని రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి ద్వారా అధికారంలో ఉంది.ఇటువంటి బలమైన పార్టీలో సాధారణ కార్యకర్తగా ఉన్న నాకు, పార్టీ అధిష్టానం నమ్మకంతో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతను అప్పజెప్పడం, నేను పనిచేసిన కృషికి గుర్తింపుగా భావిస్తున్నానని అన్నారు.

బిజెపి బలోపేతం వెనుక వేలాది మంది కార్యకర్తల త్యాగాలు ఉన్నాయి. వారి ప్రాణత్యాగాలే బిజెపిని 14 కోట్ల సభ్యత్వంతో ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించిందని అన్నారు. తాను సైతం ఒక కార్యకర్తగా అహోరాత్రులు పార్టీ కోసం కృషి చేశానుని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ - బిఆర్ఎస్ పార్టీలు రెండు విఫలమైన ప్రభుత్వాలు అన్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రజలు బిజెపిని అధికారంలోకి తీసుకురావాలని కోరుకుంటున్నారని అన్నారు.

# 4 లీటర్ల పెయింటింగ్ కోసం 275 మందికూలీలా!

## మధ్యప్రదేశ్ విద్యాశాఖలో నిధుల దుర్వినియోగం



**షహడోల్,(ఎంపి), జూలై 5:** మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించిన ఓ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. కేవలం 10 కిటికీలు, 4 తలుపులకు రంగులు వేయడానికి ఏకంగా 275 మంది కూలీలను, 150 మంది మేస్త్రీలను నియమించినట్లు పత్రాలు సృష్టించి లక్షల రూపాయలు కాజేశారు. షాడోల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన ఈ అవినీతి బాగోతం ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే నిపానియా గ్రామ ప్రభుత్వ పాఠశాలలో 10 కిటికీలు, 4 తలుపులకు 20 లీటర్ల పెయింట్ వేయడానికి సుధాకర్ కన్‌స్ట్రక్షన్ అనే సంస్థ రూ. 2.3 లక్షల బిల్లును సమర్పించింది. ఈ చిన్న పని కోసం 275 మంది కూలీలు, 150 మంది మేస్త్రీలను వినియోగించినట్లు రికార్డుల్లో చూపడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇదే తరహాలో, సకండి గ్రామంలోని మరో పాఠశాలలో కేవలం నాలుగు లీటర్ల పెయింట్ వేయడానికి రూ. 1.07 లక్షల బిల్లు పెట్టారు. ఈ పనికి 168 మంది కూలీలు, 65 మంది మేస్త్రీలు అవసరమయ్యారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పత్రాల తారుమారు కూడా స్పష్టంగా కనిపిస్తోంది. నిపానియా పాఠశాలకు సంబంధించిన బిల్లును 2025 మే 5న సృష్టించగా, పాఠశాల ప్రిన్సిపాల్ ఏకంగా నెల రోజుల ముందే, అంటే ఏప్రిల్ 4నే దాన్ని వెరిఫై చేసి ఆమోదించడం గమనార్హం. నిబంధనల ప్రకారం పనులకు ముందు, తర్వాత తీసిన ఫోటోలను బిల్లులకు జతచేయాల్సి ఉన్నప్పటికీ, అవేవీ లేకుండానే అధికారులు బిల్లులను ఆమోదించారు. ఈ ఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారి ఫూల్ సింగ్ మర్పాచి స్పందించారు. 'రెండు పాఠశాలలకు సంబంధించిన బిల్లులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ జరుపుతున్నాం. విచారణలో వెల్లడైన వాస్తవాల ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని ఆయన తెలిపారు.



# టేకాఫ్ దశలో ఉన్న బోయింగ్ విమానంలో ఫైర్ అలారం

## భయంతో రెక్కలు ఎక్కి దూకేసిన ప్రయాణికులు

**మ్యాడ్రిడ్, జూలై 5:** స్పెయిన్‌లో ఓ విమానంలో ఆకస్మిక గందరగోళం చోటు చేసుకుంది. టేకాఫ్ దశలో ఉన్న బోయింగ్ 737లో అకస్మాత్తుగా ఫైర్ అలారం మోగడంతో ప్రయాణికుల్లో తీవ్ర భయం నెలకొంది. ఒక్కసారిగా విమానం లోపల కేకలు, అరుపులతో ఆందోళన వాతావరణం ఏర్పడింది. అత్యవసర సిబ్బంది ప్రయాణికులను అత్యవసర ద్వారాల ద్వారా బయటకు తరలించేందుకు ప్రయత్నించారు.

అయితే భయం ఎక్కువైన కొందరు ప్రయాణికులు సిబ్బంది సూచనలను పట్టించుకోకుండా విమాన రెక్కలపైకి ఎక్కారు. ఆ తర్వాత వారు కిందకు దూకేసారు. ఈ ఘటనలో కనీసం 18 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ భయానక ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చాయి.


ప్రయాణికులు భయంతో విమానం నుంచి ఎలా బయటపడ్డారనేది వీడియోలు స్పష్టంగా చూపించాయి. ఈ వీడియోలు శరవేగంగా వైరల్ కావడంతో ప్రపంచ వ్యాప్తంగా ఈ సంఘటనపై దృష్టి వెళ్లింది. ఫైర్ అలారం మోగటానికి అసలు కారణం సాంకేతిక లోపమేనని, విమానంలో ఎలాంటి మంటలు లేకపోయాయని స్పష్టం విమానసంస్థ స్పష్టం చేసింది. ముందు జాగ్రత్త చర్యగా టేకాఫ్‌ను తాత్కాలికంగా నిలిపివేశామని, ప్రయాణికులందరిని సురక్షితంగా టెర్మినల్‌కి తరలించామని తెలిపింది. ప్రస్తుతం గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

# ప్రాణాలు తీసిన బోటింగ్ సరదా

## ప్రమాదవశాత్తు నీటమునిగి ఇద్దరు మహిళలు మృతి

## రిసార్టు యాజమానుల నిర్లక్ష్యమే కారణం : కుటుంబసభ్యులు

**వికారాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** సరదా ఇద్దరి ప్రాణాలు బలిగొంది. వారాంతం కావడంతో సరదాగా కుటుంబ సభ్యులు, స్నేహితులతో సంతోషంగా గడిపేందుకు రిసార్టుకు వచ్చిన వారికి విషాదం మిగిలింది. బోటింగ్ చేస్తూ ఇద్దరు మహిళలు నీట మునిగి మృత్యు ఒడికి చేరుకున్నారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా, వికారాబాద్ మండలం సర్పన్‌పల్లి ప్రాజెక్టు పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం వీకెండ్ కావడంతో బీహార్ కు చెందిన రెండు కుటుంబాల వారు వికారాబాద్ మండల పరిధిలోని సర్పన్ పల్లి ప్రాజెక్ట్ పక్కనే కొనసాగుతున్న ది విల్డెర్నెస్ రిసార్టు క్యాంపు సైట్‌లో ఔటింగ్‌కు వచ్చారు. వారికి రిసార్టు నిర్వాహకులు బోటింగ్ చేయిస్తాము.. ఇతర సౌకర్యాలు కల్పిస్తాము అంటూ వారికి చెప్పడంతో.. సరదాగా బోటింగ్ చేద్దామని ప్రాజెక్ట్ లోకి ఇద్దరు మహిళలు, ముగ్గురు మగ వారు బోటింగ్ చేసేందుకు వెళ్ళారు. వారికి తోడుగా రిసార్టు నిర్వాహకులు మాత్రం వెళ్ళలేదు. దీంతో ప్రాజెక్టు మధ్యలోకి వెళ్ళగానే బోటు ప్రమాదవశాత్తు తిరగబడింది. ఈ పమాదంలో బోటులో ఉన్న రేటా కుమారి (55), పూనమ్ సింగ్ (60) అనే ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా కేంద్రంలోని ఒక ప్రముఖ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఇద్దరు మహిళల మృతి కారణం రిసార్టు నిర్వాహకుల నిర్లక్ష్యమేనని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. కనీసం గజ ఈతగాళ్లు లేకుండా బోటింగ్ ఎలా చేయిస్తారని, ముందు జాగ్రత్త చర్యలు పాటిం చకుండా ప్రాజెక్టు నీటిలో బోటింగ్‌కు పర్యాటకులను ఎలా పంపుతారని మృతుల కుటుంబసభ్యులు ఆగ్రహంవ్యక్తంచేస్తున్నారు.



సర్పన్‌పల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్న రిసార్టు

### బోటింగ్‌కు అనుమతులు ఉన్నాయా..?

వికారాబాద్ జిల్లా కేంద్రానికి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న సర్పన్ పల్లి ప్రాజెక్ట్ పక్కనే కొనసాగుతున్న ది విల్డెర్నెస్ రిసార్టు క్యాంపు సైట్ ఉంది. గత 5 సంవత్సరాలుగా టూరి జం, ఇరిగేషన్ శాఖల నుండి ఎలాంటి అ నుమతులు లేకుండానే అక్రమంగా బోటింగ్, హోమ్ బోటింగ్ నిర్వహిస్తున్నారు. సంబం ధిత ఇరిగేషన్ అధికారు లతో పాటు ఇతర అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు ముట్టడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్న అధికారులు అటు వైపు కన్నెత్తి చూడ టం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బోటింగ్‌కు సైతం రిసార్టు వారికి ఎలాంటి అనుమతులు ఇవ్వకున్న రాజకీయ నాయకుల అండదండలతో రిసార్టును యథేచ్ఛగా కొనసాగిస్తూ అసాంఘీక కార్యక్రమాలకు తెరలేపుతున్నారని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ సంఘటనతోనైనా సంబంధిత శాఖ అధికారులు స్పంధించి రిసార్టు నిర్వాహకులపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానము - కొండగట్టు
కార్యనిర్వహణాధికారి గారి కార్యాలయము,

ఆర్.సి. నెం. ఎ/480/2024, నోటిఫికేషన్ తేది: 05-07-2025

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా శ్రీ ఆంజనేయస్వామివారి దేవస్థానము కొండగట్టు మల్యాలపేట గ్రా॥, మల్యాల మం॥, జగిత్యాల జిల్లా నందు చాత్తాద శ్రీ వైష్ణవ ఆగమ సాంప్రదాయము ప్రకారముగా ఈ క్రింది షెడ్యూల్ నందు చూపబడిన పరిచారక పోస్టులు రెగ్యులర్ యందు శ్రీయుత కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ హైదరాబాద్ గారి ఉత్తర్వులకు లోబడి జి.ఓ.ఎమ్.ఎస్ నెం.261 తేది: 20.05.2021 మరియు జి.ఓ.ఎమ్.ఎస్ నెం 888 తేది: 08-12-2000 లోని రూల్ 46 ప్రకారముగా నియామకం చేసుకొనుటకు.

| క్ర. సం. | ఉద్యోగ వివరములు | క్యాడర్ స్ట్రెంత్ ప్రకారముగా మంజూరు కాబడిన పోస్టుల సంఖ్య | వయస్సు | విద్యార్హతలు |
|---|---|---|---|---|
| 1 | పరిచారిక | 03 | 18 సంవత్సరములు నిండి తేది: 01.07.2025 వరకు 38 సంవత్సరముల లోపు వారు అర్హులు | చాత్తాద శ్రీవైష్ణవ ఆగమసాంప్రదాయము ఆచార వ్యవహారములు తెలిసి అనుభవము కలిగి యుండి కనీస విద్యార్హత ఉండవలెను. |

పైన తెలిపిన ప్రకారము అర్హతలు, వయస్సు, ఆచార సాంప్రదాయములు కలిగిన చాత్తాద శ్రీవైష్ణవ అభ్యర్థులు పై పోస్టులకు తెలంగాణ స్థానికత కల్గినవారు తేది: 04-08-2025 సాయంత్రము 5:00 గం.ల వరకు కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానము, కొండగట్టు నందు దరఖాస్తు చేసుకొనవలెను. ఆ తదుపరి వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవు. తదుపరి దరఖాస్తులు పరిశీలించి శ్రీయుత కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ హైదరాబాద్ గారికి తెలుపబడును. వారి ఉత్తర్వుల మేరకు నియామకము చేయబడిన కమిటీ ద్వారా నియామక ప్రక్రియ చేపట్టి ఎంపిక చేయబడును. నోట్ :- ఇతర వివరములకు దేవస్థాన కార్యాలయ పని వేళలలో సంప్రదించగలరు.

DIPR.No.4664-PP/CL/Advt/1/2025-26, తేది: 05.07.2025 సం/- ఉప కమిషనర్ & కార్యనిర్వహణాధికారి

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశ వ్యాప్తంగా ఖరీఫ్ (వానాకాలం సాగు) సీజను ప్రారంభమైంది. నైరుతి రుతుపవనాల ఆగమనంతో ఖరీఫ్ సీజనుపై రైతులు దృష్టి సారించారు. వానకాలం సీజన్ రైతులకు అనుకూలంగా ఉండటంతో జూన్ మొదటి వారంలో వేసిన పత్తి విత్తనాలు మొలకెత్తాయి. పంటలకు అవసరమైన సమయంలో వర్షాలు పడుతుండడంతో పత్తి, సోయా, మక్క పంట ఎదుగుదల బాగా ఉంది. రైతులు పంటలు పెరగడానికి ఎరువులను వినియోగిస్తారు. అయితే రైతులకు ఎరువులు పెద్ద సమస్య అయింది. మున్ముందు ఎరువులకు మరింత ఇబ్బంది ఎదురయ్యే ప్రమాదం ఉంది. కేంద్రప్రభుత్వం ఎరువులు సరఫరా చేయడం లేదని ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చేసిన ప్రకటన, ప్రస్తుతం ఉన్న ఎరువుల నిల్వలపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. వరి, మక్క, పత్తి పంటలకు కీలకం కానున్న యూరియాకుకొరత ఏర్పడితే పరిస్థితి ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ఈ నెలలో కేటాయింపులు జరిగితేనే కొరత లేకుండా ఉంటుందని, లేదంటే తాము రోడ్డె క్కాల్సి వస్తుందని రైతాంగం వాపోతున్నది. రైతులకు అవసరమైన ఎరువులు దుకాణాల్లో లభించకపోవడంతో పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకున్నది. ఈనెలలో సరిపడా ఎరువులు కేటాయించకుంటే రైతులు మరింత ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుంది. అయితే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అవసర మైన ఎరువులు సరఫరా చేయడం లేదని ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కేంద్రప్రభుత్వం కూడా సకాలంలో ఎరువులు కేటాయిస్తేనే కొరత లేకుండా ఉంటుంది. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని అందర్‌బంద్ వద్ద 222 బస్తాలతో ఉన్న యూరియా లారీని టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు.

# అన్నదాతకు ఎరువుల టెర్రర్

**సిహెచ్.వి.వి.రఘుబాబు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కీలకమైన ఖరీఫ్ పంటలు ఊపందుకున్న నేపథ్యంలో రైతులు యూరియా తదితర ఎరువుల కొరతను ఎదుర్కొంటున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎరువుల కొరత ప్రారంభమైంది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు ఉన్న ఎరువులను బ్లాక్ చేస్తూ, అత్యధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే కొరతను ఎదుర్కొంటున్న రెండు రాష్ట్రాల్లో ఎరువులు సకాలంలో కేటాయించకుంటే తీవ్రమైన కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉన్నది.? ఇప్పటికే యూరియా తదితర ఎరువుల కొరత రైతులను పట్టి పీడిస్తోంది. డీఏపీ కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అవసరానికి తగినట్లు సరఫరా లేదు. ప్రత్యామ్నాయంగా కాంప్లెక్స్ ఎరువులు కూడా వాడుకోవచ్చని అధికారులు చెబుతున్నప్పటికీ డీఏపీ వాడినంత ఫలితం ఉండదనే ఉద్దేశ్యంలో రైతులు ఉన్నారు. ఎరువుల కోసం రైతులు సహకార సంఘాలు, ఆగ్రో సెంటర్లు, మార్క్‌ఫెడ్ తదితర వాటి చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ప్రధానమైన వరి, మక్క, పత్తి పంటలకు ఎక్కువగా ఎరువులు వినియోగిస్తుండగా, కీలక దశలో ఎరువుల కేటాయింపు తగిన రీతిలో లేకుంటే రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఉంటుంది. వరి, పత్తి వంటి కీలక పంటల భవితవ్యాన్ని సకాలంలో సరఫరాలు నిర్ణయిస్తాయి. ఎకరానికి సగటున 173 కిలోల ఎరువుల వాడకంతో భారతదేశంలో ఐదవ స్థానంలో ఉన్న రాష్ట్రం, సరఫరా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది, దీని ఫలితంగా స్థానికీకరించిన ధరలు పెరిగాయి, కొంత మంది రైతులు సబ్సిడీరేటు రూ.266.50 నుండి రూ.268 వరకు ఉండగా, 45 కిలోల సంచికి రూ.300 నుండి రూ. 325 వరకు చెల్లిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత ఏడాది పంట కాలంలో 39 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా ఎరువుల కొరతతో ఈ ఏడాది దానిని 35 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గించేలా వ్యవసాయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో డైఅమోనియం ఫాస్ఫేట్, యూరియా ఎరువుల కొరత వరి సాగుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. రాష్ట్రానికి మొత్తం 16.76 లక్షల టన్నుల ఎరువులు కేటాయించబడ్డాయి, వీటిలో 6.22లక్షల టన్నులయూరియా, 2.60 లక్షల టన్నుల డిఎపి, 0.70 లక్షల టన్నుల ఎమ్‌ఒపి, 0.94 లక్షల టన్నుల ఎస్ఎస్‌పి, 6.30 లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయి. అయితే నెలవారీగా రావాల్సిన ఎరువుల సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఫలితంగా ఆంధ్రాలో ఎరువుల కోసం రైతులు పాట్లు పడుతున్నారు. అలాగే ఏప్రిల్ నుండి జూన్ వరకు తెలంగాణకు కేంద్రం ఐదు



లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించింది, కానీ కేవలం 3.06 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేయబడ్డాయి, ఫలితంగా 1.94 లక్షల మెట్రిక్ టన్నులలోటు ఏర్పడింది. జూలై నెలలో, కేంద్రం 1.60 లక్షల మెట్రిక్ టన్నులు ఇస్తామని హామీ ఇచ్చింది, అందులో 60శాతం దిగుమతి చేసుకున్న యూరియా, కానీ దాని రవాణా కోసం ఏ నౌకలను కేటాయించలేదు, దీనివల్ల మరింత ఆలస్యం జరుగుతుందనే భయాలు తలెత్తుతున్నాయి. సరఫరాలో ఈఅంతరం, లాజిస్టికల్ వైఫల్యాలతో మరింతగా పెరిగి, ఖరీఫ్ సీజన్‌ను పతనపరిచే ప్రమాదం ఉంది. ముందస్తు నైరుతి రుతుపవనాల రాకతో కురుస్తున్న వర్షాలతో వానాకాలం సాగులో ఎరువుల కొరత ప్రధానంగా యూరియా పెద్ద సమస్యగా తయారవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ, వరంగల్, జగిత్యాల తదితర జిల్లాల్లో రైతులు ఎరువుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక పక్క వానకాలం సీజన్‌లో విత్తనాలు విత్తు కోవడం ప్రారంభం కావడంతో ఎరువులు అవసరమైన రైతులు దుకాణాల చుట్టు యూరియా, డీఏపీ మందుల కోసం పాకులాడుతున్నారు. అనుకూల వాతావరణం, రిజర్వాయర్ నీటి నిల్వలు పూర్తి స్థాయిలో ఉండటంతో పంటల సాగుపై దృష్టి సారించారు. దుక్కులు దున్ని సాగుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ముఖ్యంగా యూరియాకు డిమాండ్ ఏర్పడింది. ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ మండలంలో యూరియా, డీఏపీ కొరత తీవ్రంగా ఉండడంతో ఉదయం 6 గంటల నుంచే సహకార సంఘాల వద్ద రైతులు పెద్ద సంఖ్యలో ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్నారు. ఖమ్మం జిల్లాలో అరకొర యూరియాతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మేలో 831 టన్నుల యూరియాకు గాను 419 టన్నులు, జూన్‌లో 4,153 టన్నులకు కేవలం 1,973 టన్నులు మాత్రమే సరఫరా చేయడంతో రైతాంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనికి తగినట్లుగా ఈ వానాకాలం సాగులో తెలంగాణ ఎరువుల వినియోగంలో గణనీయమైన పెరుగుదల చోటు చేసుకుంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఇది గత ఏడాది కంటే మించిపోతుందని అంచనా. 2023-24లో దేశం మొత్తం యూరియా వినియోగంలో తెలంగాణ 5.8 శాతం వాటాను కలిగి ఉంది. ఇదే కాలంలో రాష్ట్రం 1.08 మిలియన్ టన్నుల డిఎపి, 0.16 మిలియన్ టన్నుల ఎంఒపి, 1.11 మిలియన్ టన్నుల ఎన్‌పికె కాంప్లెక్స్ ఎరువులను వినియోగించింది. 2023-24లో హెక్టారుకు 139.8 కిలోల మేర ఎరువుల వినియోగం ఉండగా, ఈ సారి అది 145 కిలోలకు చేరుకునే వీలుందని అంచనా. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో యూరియాకు లోటుఏర్పడింది. అధికారిక లెక్కల ప్రకారం కేంద్రం వానాకాలం సాగుకై తెలంగాణకు 9.8 లక్షల టన్నుల యూరియాను కేటాయించింది. అయితే, ఏప్రిల్, మేలో 3.3 లక్షల టన్నులకు 2.16 లక్షల టన్నులు మాత్రమే పంపిణీ చేసింది, దీనితో 1.14 లక్షల టన్నులలోటు ఏర్పడింది. ఇక ఏప్రిల్‌లో 1.7 లక్షల టన్నులకు 1.22 లక్షల టన్నులు, మేలో 1.6 లక్షల టన్నులకు 0.94 లక్షల టన్నులు మాత్రమే వచ్చింది. ఈ నెలకు సంబంధించి కేటాయించిన 1.7 లక్షల టన్నులలో ప్రస్తుతం 37 శాతం మాత్రమే దేశీయంగా సేకరించబడుతుందని భావిస్తున్నారు. మిగిలిన 67శాతం దిగుమతులపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా ఎరువులు అధికంగా ఉపయోగించే వరి, మొక్కజొన్న సాగువిస్తరణ కారణంగా యూరియా డిమాండ్ పెరుగుతోంది, ఈ కొరత రైతులలో ఆందోళనకు కారణమైంది. కీలకమైన విత్తనాలు వేసే సమయంలో ఎరువుల లభ్యతను అంతరాయం లేకుండా చూసుకోవడానికి జూన్ నెల కేటాయింపులతో పాటు మిగిలిన 1.14 లక్షల టన్నుల లోటును త్వరగా తీర్చాలని ఇప్పటికే రాష్ట్రసర్కార్ కేంద్రాన్ని లేఖరాసినా ఇంత వరకూ అది కార్యరూపం దాల్చ లేదు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రమంత్రులకు లేఖ రాస్తూ ఎరువుల సంక్షోభాన్ని పరిష్కరించడానికి వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు. జూలై నెలకు నిర్ణయించిన 0.97 లక్షల మెట్రిక్ టన్నుల దిగుమతి చేసుకున్న యూరియాను రవాణా చేయడానికి వెంటనే ఓడలను కేటాయించాల ని, రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ నుండిదేశీయ యూరియా సరఫరాను 30,800 టన్నుల నుండి 60,000 టన్నులకు పెంచాలని తన లేఖలో కోరారు. ఏప్రిల్, జూన్ లోటును భర్తీ చేయడానికి అదనపు కోటాను కూడా కోరుతూ, ఈకీలకమైన వ్యవసాయ సీజన్‌లోతెలంగాణ రైతుల కు మద్దతు ఇవ్వడానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని రిక్వెస్ట్ చేశారు.

కర్ణాటక

# దినదిన గండం!

**ఎ.వి.వి ప్రసాద్**

దినదిన గండం..నూరేళ్లాయుష్షు అంటూంటారు. కర్ణాటక నాయకత్వ వివాదాన్ని చూస్తే ఆ సామెతే గుర్తుకు వస్తుంది. ముఖ్యమంత్రిగా ఉన్న సిద్ద రామయ్య, ఉప ముఖ్యమంత్రిగా ఉన్న డికె శివకుమార్ మధ్య నెల కొన్న 'కోల్డ్ వార్' ఇటీవల మరింత పెరిగినట్లు కనిపిస్తోంది. వారి ముఖ్య అనుచరులు చేసే కామెంట్లు, అప్పుడప్పుడు ఆ ఇద్దరు నేతలు చేస్తున్న ప్రకటనలు అందరిలో చాలా అనుమానాలనే కలిగిస్తున్నాయి. సెప్టెంబర్, అక్టోబర్‌లో నాయకత్వ మార్పు తప్పదా? అనే ప్రశ్నఅందుకే అధికంగా వినిపిస్తోంది. మీడియా ప్రతినిధులు వేసే ప్రశ్నలకు'అంతా అధిష్ఠానం నిర్ణయిస్తుంది' అని సిద్దరామయ్య, డికె అనడం ఎక్కువయింది. కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి 'అధిష్ఠానం' పాత్ర అటువంటిదే గనుక వారు అలా అనడంలో తప్పు లేదనుకోవచ్చు. కానీ పార్టీఅధ్యక్షుడైన మల్లికార్జున ఖర్గే కూడా 'ఆ విషయం అధిష్ఠానం చూసుకొంటుంది' అనడమే ఆశ్చర్యంకలిగిస్తుంది. కర్ణాటక వారైన ఖర్గేకు సొంత రాష్ట్రం రాజకీయాలపై పట్టు మరింత ఎక్కువ ఉంటుంది కనుక అయన సిఫారసులకే ప్రాధాన్యత లభిస్తుంది. కానీ ఆయనే'అధిష్ఠానం' వేరే ఉన్నట్లు అనడం చూస్తే రాష్ట్రంలో నాయ కత్వ మార్పు తప్పదేమో! అనే అభిప్రాయమే కలుగుతుంది. ఆయన ఉద్దేశంలో ఆ అధిష్ఠానం రాహుల్, సోనియా కావచ్చు. అంటేహైకమాండ్ కంటె ఎక్కువగా హయ్యస్ట్ కమాండ్ అన్న మాట. అయితే ఆ హయ్యస్ట్ కమాండ్ ఆలోచన ఏమిటన్నది ఇంకా అస్పష్టంగానే ఉన్నా, కొన్ని ప్రకటనలు మాత్రం కార్యకర్తల్లో అనుమానాలు పెంచుతున్నాయి. పార్టీ ఎమ్మెల్యే అయిన ఇక్బాల్ హుస్సేన్ ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ రెండు, మూడు నెలల్లో డికె ముఖ్యమంత్రి అవుతారని బహిరంగంగానే ఓ ప్రకటన చేయడంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. దానికి కొందరు చిలవలు పలవలుఅల్లేసరికి సిఎం సిద్దరామయ్య స్వయంగా స్పందించి' అయిదేళ్ల అధికారంలో నేనే ఉంటా. దానిలో ఎలాంటి మార్పు ఉండదు' అంటూ ఓ ప్రకటన చేశారు. ఆ తర్వాత డికె మరో ప్రకటన చేస్తూ 'సిఎంకు అండగా ఉండడం తప్ప నాకు మరో ఆప్షన్‌లేదు. నేను ఆయనకు మద్దతివ్వాలి. అధిష్ఠానం ఏం చెప్తే అది చేయాలి కదా!' అన్నారు. మామూలుగా అయితే వివాదానికిఅక్కడితో ఫుల్ స్టాప్ పడాలి. కానీ' ముఖ్యమంత్రి కావాలనే కోరిక నాలో ఇంకాఉంది. అది ఎప్పటికి తీరుతుందో' అని డికె మరో ప్రకటన కూడాచేశారు. 'ప్రయత్నాలు ఇంకా ఫలించకపోయినా తాను బలంగా కోరుకున్నదాని కోసం చేసిన ప్రార్థనలకు తగిన సమాధానం దొరకకపోదు' అని కూడా అన్నారు. అక్కడే మెలికకనిపిస్తోంది. దానితో వివాదానికి మళ్లీ కొత్త చిగుళ్ల వచ్చాయి. నిజానికి సిద్దరామయ్య కంటె డికె కే హయ్యస్ట్ కమాండ్‌వద్ద ఎక్కువ పట్టు ఉందంటారు.



సిద్దరామయ్య


అసెంబ్లీలో పార్టీకి గల 150మంది ఎమ్మెల్యేలలో మెజారిటీ మద్దతు కూడా డికె కే ఉన్నదంటున్నారు. కానీ బిసినేతగా సిద్దరామయ్యకు ఒక వర్గం ప్రజల్లో ఆదరణ బాగా ఉంది. అందుకే అధిష్ఠానం ఆయనను కొనసాగిస్తోంది. ఎన్నికలు జరిగిన తర్వాత గత రెండున్నరేళ్లలో సిద్దరామయ్య గ్రాఫ్‌నిజానికి పడిపోయిందనే చెప్పాలి. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలే అందుకు కారణం. ముఖ్యంగా ముడా స్కాం, వాల్మీకి స్కాంలు ఆయన ఇమేజ్‌ను బాగా తగ్గించాయి. మైసూరు అర్బన్‌డెవలప్మెంట్ అథారిటీ సిద్ద రామయ్య భార్యకు 14 ప్లాట్లు కేటాయించిన వివాదం హైకోర్టు దాకా వెళ్లి ఇడి, లోకాయుక్త విచారణలతో అనేక మలుపులుతిరిగి సిద్దరామయ్య మెడకు గట్టిగా బిగుసు కొంది. రూ.400కోట్ల కుంభకోణం అది. దానికి తోడు రూ.200 కోట్ల వాల్మీకి స్కాంలో కూడా ముఖ్యమంత్రి చిక్కుకొన్నారు. దానిపై కూడా సిఐడి, ఇడి విచారణలు సాగుతున్నాయి. టిఎ, డిఎ బిల్లులస్కాం కూడా ఆయన మెడకే చుట్టుకొంది. తాజాగా చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట ఘటన బాధ్యత కూడా ఆయన ఖాతాలోనే పడేట్లు కనిపిస్తోంది. 'నేను పూర్తిగా ఐదేళ్ల పదవిలో ఉంటా' అని సిద్దరామయ్య గట్టిగానే అంటున్నా, దాని వెనుక కొంత బెదురు కూడా కనిపిస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు. ఎన్నికల సమయంలోనే డికె రొటేషన్ షరతు పెట్టారనీ, దానికి అధిష్ఠానం అప్పట్లోనే సమ్మతించిందనీ అందువల్ల మార్పు తప్పదనీ ఒక వర్గం గట్టిగా చెబుతోంది. కానీ అది తప్పనిసరికాదనీ, రొటేషన్ ఫార్ములా అంటూ ఏదీలేదనీ మరోవర్గం వాదిస్తోంది. కానీ అనిశ్చితి మాత్రం కొనసాగుతోంది. ఇటువంటి అనిశ్చితి ఉంటే పాలన సమర్థంగా సాగుతుందా? అనే అనుమానం కూడా అందరిలో ఉంది. వాల్మీకి కార్పొరేషన్‌కు చెందినదాదాపు రూ.200 కోట్లు పక్కదారి పట్టాయనీ, ముఖ్యమంత్రి సన్నిహితులు కొందరికి దానిలో భాగం ఉందనీ ఆరోపణలు ఉండడంతో దర్యాప్తు జరుపుతున్న సిబిఐ ఎప్పుడుఎటువంటి చర్య తీసుకొంటుందో అనే అనుమానం కూడాఉంది. ఎన్నికలకు ఇంకా రెండున్నర సంవత్సరాల వ్యవధి ఉన్నందున తొందరపాటు ప్రకటనలు చేయొద్దంటూ నేతలను పార్టీ అధ్యక్షుడు కూడా అయిన డికె హెచ్చరించారు. అయితే ఎన్నికల సమయానికి డికె ముఖ్యమంత్రిగా ఉంటేనే పార్టీ విజయావకాశాలు మెరుగుపడతాయనీ, లేకుంటే చీలికలు తప్పవనీ పలువురు భావిస్తున్నారు. అధి ష్ఠానం వద్దనేగాక పార్టీ కార్యకర్తల్లో కూడా డికెకు మంచి పట్టు ఉన్నదనీ, పార్టీ మరోసారి అధికారంలోకి రావాలనుకుంటే మాత్రం నాయకత్వ మార్పు చేయక తప్పదనీ వారుఅంటున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సూర్జేవాలా గతవారం బెంగళూ రులో ఉండి నాయకుల అభి ప్రాయాలను సేకరించారనీ, ఆయన ఇచ్చే నివేది కపై రాజకీయ మార్పులు ఆధారపడి ఉంటా యనీ తెలుస్తోంది. ఏదిఏమైనా సిద్దరామయ్య పరిస్థితి మాత్రంగందరగోళంగానే ఉన్నట్లనిపిస్తోంది. హయ్యస్ట్ కమాండ్ ఏం నిర్ణయం తీసుకొంటుందో చూడాలి.

అమెరికా

# బిలియనీర్ల కోసమేనా 'బ్యూటిఫుల్' బిల్లు!

**గన్ని మోహన్**

అమెరికా భవిష్యత్తును నిర్దేశించే బిల్లుగా చెపుతున్న బిగ్ బ్యూటిఫుల్ బిల్లును చట్టరూపంలోకి తెచ్చేందుకు అధ్యక్షుడుడొనాల్డ్‌ట్రంప్ సంతకం చేసారు. అదికూడా అమెరికా ఆవిర్భావ దినోత్సవం రోజునే కావడం విశేషం. లక్షలకోట్ల డాలర్ల విలువైన ఈ బిల్లులో ప్రత్యేకించి సంపన్నులకు ఎంతో ఊరట నిచ్చి సామాన్య మధ్య తరగతిని ప్రభుత్వ ఫలాలకు దూరం చేస్తున్నారన్న విమర్శలు వచ్చినా అమెరికా గ్రేట్ ఎగైన్, అమెరికా గెలిచింది. గతంలో ఎన్నడూలేనంత విజయం సాధించామంటూ ట్రంప్ బిల్లును చట్టరూపంలోకి తెచ్చారు. 900 పేజీలు ఉన్న ఈబిల్లును ఆమోదింప చేసుకునేందుకు సెనేట్, రిపబ్లికన్లను సముదాయించేందుకు ఉభయ సభల అధిపతులు కష్టపడ్డారు. ప్రత్యే కించి ప్రతినిధుల సభ స్పీకర్ జాన్సన్ కృషి కీలకం అయిందనే చెప్పాలి. సంపన్నులకు ప్రయోజనం కల్పించే విధంగా పన్ను తగ్గింపులు వయో వృద్ధులకు ఇచ్చే 6వేల డాలర్ల తగ్గింపు వంటివి విమర్శలు పాలవుతున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా మెడికెయిడ్ ప్రయోజనాల్లో కోత విధించడం వల్ల ఇప్పుడు అమెరికాలో సుమారు 12 మిలియన్ల పౌరులు ఆరోగ్యబీమాను పొంద లేని స్థితికి వచ్చారు. అమెరికాలో సుమారుగా ఉన్న 17 మిలియన్ల వేతన జీవుల నుంచి దోపిడీ చేసి ట్రంప్ సంపన్నులు, కార్పొరేట్లకు ప్రయోజనాలు కల్పిస్తున్నారని ఆర్థికరంగ నిపుణుల వాదనలు కూడా ట్రంప్ లెక్క చేయలేదు. ఇక ప్రభుత్వ స్థానిక సంస్థల పన్నులు తగ్గింపు లను అంటే 'సాల్ట్' పిలిచే వీటిని మూడురెట్లు పెంచారు. ఐదేళ్లకాలంలో 40 వేల డాలర్లకు పెరిగాయి. వ్యాపార వేత్తలకు నూరుశాతం ఊరటనిచ్చే విధంగా కొన్నింటిని రద్దుచేసారు. ఇక సంపన్న కుటుంబాలకు మేలు జరుగుతుంటే అల్పాదాయ వర్గాలకు మాత్రం ఏడాదికి 1600 డాలర్లు అధికభారం మోసే పరిస్థితి వస్తోంది. మెడికెయిడ్, ఫుడ్‌ఎయిడ్‌లలో కోత విధించడమే ఇందుకు కారణం. మెడికెయిడ్, పౌష్టికాహార ప్రయోజనాల పరంగానే ట్రంప్ తన కొత్త చట్టం ద్వారా 1.2 లక్షలకోట్ల డాలర్లు కోతవేసారు. ఇక ప్రత్యేకించి వలసలను నివారించడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న ట్రంప్ ఈ బిల్లుద్వారా 350 బిలియన్ డాలర్లు సరిహద్దు, జాతీయ భద్రత అజెండా కోసం కేటాయిస్తున్నారు. అమెరికా మెక్సికో సరిహద్దులో లక్షమంది వలస జీవులడిటెన్షన్ కేంద్రం ఏర్పాటుచేసేందుకు బిల్లులో నిధులు ప్రతిపాదించారు. సరైన పత్రాలు లేని వారందరినీ 'అక్రమ గ్రహాంతరవాసులు' అని చెప్పిన ట్రంప్ వీటిని కట్టడిచేసేందుకు అదనపు అధికారులకు అనుమతించారు. పదివేల మంది కొత్తవారు వస్తారు. సరిహద్దు గస్తీ అధికారులకు పదివేల డాలర్ల బోనస్‌లు కూడా ప్రకటించారు. ఈ బిల్లును చట్టరూపం లోకి తీసుకురావడానికి ప్రధాన కారణం కూడా అమెరికా నుంచి ప్రతి ఏటా పది లక్షలమంది వీసాపత్రాలు లేనివారిని వారి స్వదేశాలకు పంపించేయాలన్న ప్రధాన లక్ష్యం ఉంది.



ట్రంప్

ఇందుకోసం వలసజీవులు కొత్త రుసుంలు కూడా చెల్లించాల్సి ఉంటుంది. శరణార్థులుగా ఉండాలనుకుంటే వారు రక్షణకోసం కూడా ఫీజులు చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఇక రక్షణ వ్యవస్థ పెంటగాన్‌కు నౌకానిర్మాణం, ఆయుధ వ్యవస్థలకు బిలియన్లకొద్దీ డాలర్లు కేటాయించింది. రక్షణ రంగంలోన్న సిబ్బంది జీవనశైలి మెరుగుపరిచేందుకు అదనపు నిధులు అవసరమని ఈ బిల్లు ద్వారా ట్రంప్ తేల్చిచెప్పారు. కేవలం సరిహద్దు భద్రతకే ఈ బిల్లుద్వారా రక్షణ విభాగానికి 100 కోట్ల డాలర్లు నిధులు అందుతాయి. ఇక 2029 నాటికి పూర్తిచేసేవిధంగా ఇజ్రాయల్ ఐరన్‌డోమ్ తరహాలో అమెరికాలో 175 బిలియన్ డాలర్ల వ్యయంతో గోల్డెన్‌డోమ్ క్షిపణి వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తొలివిడతగా 25 బిలియన్ డాలర్లు ఈ బిల్లులో కేటాయించారు. అమెరికా ప్రయోజనాల కోసమే అని చెపుతున్న ఈ బూటిఫుల్ బిల్లులో నిరుపేదలకు అందే సాయంపై కోత విధించడం తీవ్ర విమర్శలకు కారణమయింది. గర్భిణీలు, వికలాంగులు, చిన్నారులకు అందించే ఈ సాయం వృధా అని మోసం అని దుర్వినియోగం అవుతున్నదని పేర్కొనడం డెమొక్రాట్లకు ఆగ్రహం రప్పించింది. నెలకు 80 గంటల పని విధానంలో 65 ఏళ్లపైబడినవారు, 14 ఏళ్లకు పైబడిన పిల్లలున్నవారు కూడా ఈ బిల్లులో నిబంధనలకు అర్హులై ఉండాలి. ముఖ్యంగా మెడికెయిడ్ పొందే పౌరులు ఇప్పుడు 35 డాలర్లు అదనపు చెల్లింపులు భరించాలి. అమెరికాలో 7.1 కోట్లమంది మెడికెయిడ్‌పై ఆధారపడి ఉన్నారు. 40 మిలియన్ల మంది పౌష్టికాహార పథకం కింద సాయం పొందుతున్నారు. ఇప్పుడు ఈ బిల్లులో వీటన్నింటిపైనా కోత విధించడం, అమెరికా గ్రేట్ అగైన్ అంటూ ట్రంప్ పేర్కొంటుండటం డెమొక్రాట్లు, విభిన్న రంగాల మేధావులు, నిపుణులకు ఎంత మాత్రం రుచించడంలేదు. వచ్చే మధ్యంతర ఎన్నికల్లో తమ విజయానికి ఇదే తొలిమెట్టు అని భావిస్తున్న డెమొక్రాట్లు ఈ బిల్లును వ్యతిరేకించేందుకు శతవిధాల ప్రయత్నించినా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం చట్టరూపంలోకి తెచ్చేంతవరకూ విశ్రమించలేదు. తన అనుంగు మిత్రుడు తన విజయానికి కీలక పాత్రపోషించిన ఎలాన్ మస్క్ దూరం అయినా సరే లెక్క చేయలేదు. ఈ బిల్లు అమెరికాను మళ్లీ అంథకారంలోకి నెట్టివేస్తుందని, తాను కొత్తపార్టీతో వస్తానని చెప్పిన మస్క్‌ను సైతం ట్రంప్ హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న అన్ని సబ్సిడీలు, రాయితీలు కట్ చేస్తామని చెప్పిన ట్రంప్ చిరవకు మస్క్‌ను కూడా నోరు మూయించగలిగారు. మొత్తంగా చూస్తే అక్రమ వలసలను కట్టడి చేయడం, అసలు వలస జీవులు లేని దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ట్రంప్ ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా స్వతహాగా సంపన్నుడయిన ట్రంప్ తన బిల్లు ద్వారా సంపన్నులకే రాయితీలు అన్నీ కట్టబెట్టారన్న విమర్శలు కూడా ఇప్పుడు మోయక తప్పదు.

# అవినీతి ప్రవాహం అభివృద్ధికి అవరోధం



**సుంకవల్లి సత్తిరాజు**

అవినీతి ఈ ప్రపంచానికి ఒక శాపంగా పరిణమించింది. కొంతమంది సంపద అనూహ్యంగా పెరిగిపోతుంటే, మరికొంత మంది తినడానికి తిండి లేక కనీస వసతి సదుపాయాలు లేక అలమటిస్తున్నారు. అగ్రరాజ్యాలతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ ప్రజల మధ్య పెరుగుతున్న ఆర్థిక అంతరాల గురించి కూలంకషంగా అధ్యయనం చేసి, ప్రజలందరికీ ఆర్థిక ఫలాలు అందించడానికి కృషి చేయాలి. ఆర్థిక అంతరాలు తగ్గించడానికి ప్రయత్నాలు చేపట్టకపోతే భవిష్యత్తులోఅనేక అవాంఛనీయ పరిణామాలు సంభవించే అవకాశాలను తోసిపుచ్చలేం. అడ్డదిడ్డంగా సంపాదిస్తున్న అవినీతి సంపదవలన ప్రజలందరికీ సమన్యాయం జరగడం లేదు. మనం గొప్పగా చెప్పుకుంటున్న దేశాల్లో కూడా అవినీతి కొనసాగుతుంది. ఆయా ప్రభుత్వ విధానాలు, సంస్కరణల వలన చాలామంది వ్యక్తులు ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. బ్లాక్‌మనీ కూడా వైట్ మనీగా మార్చే ప్రక్రియలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. భారతదేశం గతంలో కంటే ఆర్థికంగా బలోపేతమవుతున్నా, ఆ ఆర్థిక ఫలాలు కూడా ప్రజలకు పూర్తిస్థాయిలో అందడం లేదు. ప్రభుత్వాలు ప్రజల బాగోగుల కోసం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నమాట వాస్తవం. ఇదే సందర్భంలో దేశంలోని ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుదల ఆశాజనకం లేదు. అరకొర ఆదాయంతో జీవితాలను నెట్టుకొచ్చే పరిస్థితులు నెలకొంటున్నాయి. నిత్యావసర వస్తువులు, కరెంటు బిల్లులు, పిల్లల చదువులు మోయలేని భారంగా మారిపోతున్నాయి. రోగమొస్తే ఆసుపత్రుల ఖర్చులు భరించలేక ఉన్న ఆస్తులు అమ్ముకునే దుస్థితి ఏర్పడింది. చాలా దేశాల్లో ప్రజల జీవన ప్రమాణాలు అత్యంత దారుణంగా పడిపోయాయి. భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించి, 78 సంవత్సరాలు కావస్తున్నా ఇంకా పేదరికం తాండవించడం, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం, విద్య, వైద్య సదుపాయాలు అందుబాటులోఉన్నా, వాటిని అందుకునే ఆర్థిక స్థోమత లేకపోవడం బాధాకరం. ప్రజలకిస్తున్న సంక్షేమ, ఉచిత పథకాల వలన శాశ్వత ప్రయోజనం సిద్ధించదు. దీర్ఘకాల ప్రజాప్రయోజనాల కోసం ప్రభుత్వాలు పాటుబడాలి. పెరుగుతున్న అవినీతిని అరికట్టాలి. ఎన్నికల్లో విచ్చలవిడిగా అభ్యర్థులు పెడుతున్న ఖర్చు ఎక్కడిది? దీని వల్ల అంతిమంగా అవినీతి జరగదా? ప్రజలు ఆర్థికంగా నష్టపోరా? అవినీతి వివిధ రూపాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్నది. కేసులు, దర్యాప్తులు, జైలుశిక్షలు వంటి చర్యల వలన ప్రజల సంపద తిరిగి ప్రభుత్వానికి చేరుతున్నదా? భారత దేశంతో సహా పలు ప్రపంచదేశాల్లోని ప్రజలు పెరుగుతున్న అవినీతి వలన అనేక కష్టాలను అనుభవిస్తున్నారు. అవినీతిని అంతం చేయకుండా ఆర్థిక ప్రగతి సాధ్యపడదు. సంపద కేవలం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కావడం వలన ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు. చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలు ఆర్థిక మాంద్యంలో కూడా బలపడుతున్నాయి. అయితే ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో పెద్దగా మార్పులేమీ చోటుచేసుకోకపోవడం విడ్డూరం. అమెరికా 30.51 ట్రిలియన్ల డాలర్ల స్థూలజాతీయోత్పత్తితో ప్రపంచంలో అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా వెలుగొందుతున్నది. ఇంతగా అభివృద్ధి చెందిన దేశం ఇతర దేశాలను భయపెట్టి ట్రేడ్ డీల్ కుదుర్చుకోవడంలో గల మతలబు ఏమిటి? రష్యాతో స్నేహం చేయవద్దని, రష్యా ఆయుధాలు కొనవద్దని భారత్ లాంటి దేశాలకు హుకుం జారీ చేయడం అమెరికా ఆర్థిక వ్యవస్థలోని డొల్లతనాన్ని బయటపెడుతున్నది. ట్రంప్ ప్రతిపాదిత "బిగ్ బ్యూటీఫుల్ బిల్లు' అమెరికా ఆర్థిక దివాళా కోరుతనాన్ని సూచిస్తున్నది. ఇక చైనా విషయానికొస్తే కొన్ని ఆశ్చర్యకరమైన నిజాలు వెలువడతాయి. చైనా 19.23 ట్రిలియన్ల డాలర్లతో ప్రపంచంలో రెండవ ఆర్థిక అగ్రగామి దేశంగా ఉంది. అయితే అక్కడ కూడా అవినీతి చోటుచేసుకుంటున్న దాఖలాలు కనబడుతున్నాయి. జీ జిన్ పింగ్ విధానాలే చైనా ఆర్థిక పతనానికి కారణమనే ఉద్దేశ్యంతో జిన్ పింగ్‌ను



అధ్యక్ష పదవిని తప్పిస్తారనే వార్తలు వెలువడుతున్నాయి. చైనా తర్వాత ఆర్థికంగా జర్మనీ మెరుగైన స్థితిలోఉంది. జర్మనీ 4.74 ట్రిలియన్ డాలర్లతో, ఇండియా 4.187, జపాన్ 4.186 ట్రిలియన్ డాలర్ల జిడిపితో అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతున్నట్టు ఐ.ఎమ్.ఎఫ్ గణాంకాలు సూచిస్తున్నాయి. యు.కె, ఫ్రాన్స్, ఇటలీ, కెనడా, బ్రెజిల్ లాంటి దేశాలు ఈ దేశాల తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచంలో బిలియనీర్ల సంఖ్య పెరుగుతున్నది. ఇందులో ఎలాన్ మస్క్, మార్క్ జూకర్ బర్గ్, జెఫ్ బెజోస్, లారీ ఎల్లీసన్, వారెన్ బఫెట్, బెర్నార్డ్ అర్నాల్ట్, బిల్ గేట్స్ వంటి కుబేరుల వద్ద వందల కొద్దీ బిలియన్లు మూలుగుతున్నాయి. ఎక్కువ మంది బిలియనీర్లున్న దేశంగా అమెరికా పేరొందింది. ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీ, సావిత్రి జిందాల్, శివనాడార్ వంటి భారతీయ కుబేరుల వద్ద బిలియన్ల కొద్దీ సంపద ఉంది. సుమారు 900 మంది బిలియనీర్ల చేతుల్లో అమెరికా సంపద దాగిఉంది. చైనా, హాంకాంగ్‌లు సుమారు 500లకు పైగా, ఇండియా 200 లకు పైగా కుబేరులతో తులతూగుతున్నది. అమెరికాలో కేవలం 10 శాతం మంది చేతుల్లోనే అధికశాతం సంపద కేంద్రీకృతమై ఉంది. భారతదేశంలో కుబేరులంతా తమ తమ వ్యాపారాలతో, తెలివి తేటలతో దేశ సంపదను పెంచుకుంటున్నారా? వీరంతా తమకున్న సంపదతో దేశంలోకొద్ది శాతం మందికి ఉపాధి కలిగించవచ్చు. దేశ ఆర్థికవ్యవస్థ బలపడడానికి కొంతమేరకు తోడ్పడి ఉండవచ్చునేమో కాని దేశ ఆదాయం అందరికీ ఉపకరించకపోవడం బాధాకరం. మన దేశంలో 26శాతం మందికిపైగా ప్రజలు ఇంకా దారిద్ర్య రేఖకు దిగువనున్నారు. 5శాతం మంది ప్రజలు అత్యంత దుర్భర జీవితం గడుపుతున్నట్టు కొన్ని అధ్యయనాల వలన తేటతెల్లమవుతున్నది. ఆర్థిక ఫలాలు అందరికీ అందాలి. అవినీతి జాడ్యం మహమ్మారిలా విస్తరించడం ప్రజలకు దీర్ఘకాలంలో శాపంలా పరిణమించనున్నది. అవినీతి ఆర్థిక అంతరాలకు మూలం. అవినీతి తిమింగాలు అడుగడుగునా అగుపిస్తున్నాయి. చిన్న చేపలు గేలానికి చిక్కుతున్నాయి. కోట్లాది సంపదను కూడబెట్టుకున్నవారు పెద్ద మనుషుల్లా చెలామణి అవుతున్నారు. పెద్ద పెద్ద ఆర్థిక నేరస్తులను వదిలేసి, చిన్నచిన్న ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్న వారిని శిక్షించడంలో గల ఔచిత్యమేమిటో అవగతం కావడంలేదు. న్యాయస్థానాల్లో ఏళ్ళతరబడి కేసులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. విచారణ నత్తనడక సాగుతున్నది. ఆర్థిక నేరస్తుల దగ్గర మూలుగుతున్న ధనరాశులు తిరిగి ప్రభుత్వానికి చేరే మార్గం కనపడడం లేదు. స్కాముల డొంక కదులుతున్నా, శిక్షలు పడడంలో జాప్యం జరుగుతున్నది. ఇదే ఆర్థిక నేరస్తులకు వరంగా మారింది. తప్పు చిన్నదైనా, పెద్దదైనా నేరమే. కాని పెద్దపెద్ద ఆర్థిక నేరాలకు పాల్పడిన వారిని శిక్షించడంలో ఆలస్యం తగదు. త్వరితగతిన కేసుల విచారణ జరగాలి. ఆర్థిక నేరాల సత్వర విచారణకు ఉన్నత న్యాయస్థానం ప్రత్యేక బెంచ్‌లను ఏర్పాటుచేయాలి. అవినీతి అత్యంత ప్రమాదకరం. అవినీతికి శిక్షలు పడకపోతే ప్రజలే అంతిమ బాధితులుగా మిగిలిపోతారు. ప్రజల ధనాన్ని అవినీతి మార్గాల ద్వారా మళ్ళించి తమ సొంతసంపాదనగా మార్చడం అత్యంత దారుణం. 21వ శతాబ్ధంలో కూడా ఇంకా కోట్లాది మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. ఆర్థిక అంతరాలు అంబరాన్నంటుతున్నాయి. అవినీతి పెరుగుదల ఆర్థిక ప్రగతి కాబోదు. ప్రజలంతా బాగుండాలంటే వారి బ్రతుకులు బాగుపడాలి. వారి జీవన ప్రమాణాలస్థాయి పెరగాలి. ప్రజల వాస్తవ తలసరిఆదాయం పెరగాలి. ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. ధనిక దేశాలు బీద దేశాలను వాటి ఆర్థిక అవసరాల మాటున భయపెట్టి లొంగదీసుకోవడం వంటి చర్యల వలన ప్రపంచంలో అశాంతి తలెత్తుతుంది. దేశాల మధ్య, ప్రజలమధ్య హద్దులు లేకుండా పెరిగిపోతున్న ఆర్థిక అంతరాల వలన అనేక విపత్కర పరిణామాలు సంభవిస్తున్నాయి. కుల, మత విభేధాల కంటే ఆర్థిక అంతరాలే అత్యంత ప్రమాదకరం. శ్రమ వలన సంపద పెరుగుతుంది. న్యాయబద్ధమైన సంపాదనతో ఉన్నత శిఖరాలకు ఎదగడం హర్షించదగ్గ పరిణామమే. ఆర్థిక అసమానతలు ఈనాటివికావు. శతాబ్దాల తరబడి విశ్వవ్యాప్తంగా కొనసాగుతున్న ఈ అసహజ ప్రక్రియకు మూలకారణం అవినీతి. సామాన్యప్రజల ఆర్థిక పునాదులు పటిష్ఠమయ్యే తరుణమెప్పుడు? ఆర్థిక అంతరాలను కనీసస్థాయికి తగ్గించాలి. ప్రజలకు నాణ్యమైన జీవన పరిస్థితులు ఏర్పడాలి. అప్పుడే దేశం వాస్తవంగా ఆర్థికంగా బలోపేతం కాగలదు.

# ఒకే వేదికపైకి ఠాకరే బ్రదర్స్

**రెండుదశాబ్దాల తర్వాత చేతులు కలిపిన సోదరులు**

**త్రిభాషా విధానాన్ని రాష్ట్రంలో రద్దు చేయడం పట్ల హర్షం**



**ముంబయి, జులై 5:** శివసేన యూబీటీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధినేత రాజ్ ఠాక్రే దాదాపు 20 ఏళ్ల తర్వాత ఒకే రాజకీయ వేదికపైకి చేరుకున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో హిందీని తప్పనిసరి చేస్తూ తెచ్చిన త్రిభాషా విధానాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంతో ముంబయిలో నిర్వహించిన మెగా విజయోత్సవ సభలో ఇరువురు నేతలు పాల్గొన్నారు. మరాఠీ తమ హక్కు అని ఇరువురు నేతలు ఉద్ఘాటించారు. మహాయుతి సర్కారు రాష్ట్రంలో హిందీ భాషను అమలు చేయిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ ఈ సభను ఇరుపార్టీలు సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. కలిసి ముందుకు సాగేందుకే తన సోదరుడు రాజ్ ఠాక్రేతో తాను కలిసిపోయామని శివసేన (ఉద్ధవ్) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. ఇప్పుడు అందరి చూపు తమ ఇద్దరు సోదరులపైనే ఉందని, ప్రతి ఒక్కరు తమ ప్రసంగాల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఈ సభను తాము ప్రకటించినప్పటి నుంచి ప్రతీ ఒక్కరు ఆతుర్తగా రాజ్‌ఠాక్రే ప్రసంగం కోసం ఎదురు చూస్తున్నారని ఉద్ధవ్ చెప్పుకొచ్చారు. రాజ్ గొప్ప వక్త అని, ఆయన ప్రసంగాలు అమోఘంగా ఉంటాయని కితాబిచ్చారు. అందుకే తాను ఇక మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. తన దృష్టిలో తమ ఇద్దరి ప్రసంగాల కంటే ఈ సభే చాలా ముఖ్యమైందని ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. గత 11 ఏళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముంబయికి, మహారాష్ట్రకు ఏం చేశాయని ఉద్ధవ్ ప్రశ్నించారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ద్వారా శివసేన (ఉద్ధవ్) చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి అందరికీ తెలుసన్నారు. ముంబయిలోని ప్రముఖ పరిశ్రమలను సైలెంట్‌గా గుజరాత్‌కు తరలించుకుపోయారని ఆయన ఆరోపించారు. మహారాష్ట్ర వెన్ను విరిచే ప్రణాళికలో భాగంగానే ఇలాంటివన్నీ చేస్తున్నారని ఉద్ధవ్ మండిపడ్డారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కోసం ఏం చేశారని తమను ప్రశ్నించే వాళ్ళు, మహారాష్ట్రలోని ముఖ్య పరిశ్రమలు గుజరాత్‌కు ఎందుకు తరలిపోతున్నాయి అనే దానికి బదులివ్వాలన్నారు. మహాయుతి ప్రభుత్వం వైఫల్యం వల్లే మహారాష్ట్రలోని డైమండ్ వ్యాపారమంతా గుజరాత్‌కు తరలిపోయిందని ఆయన ధ్వజమెత్తారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌పై ఎంఎన్ఎస్ అధినేత రాజ్ ఠాక్రే ఫైర్ అయ్యారు. తమ ఇద్దరు సోదరులను కలపడం బాలాసాహెబ్ ఠాక్రే వల్ల కూడా కాలేదని, ఫడ్నవిస్ సర్కారు చేష్టల వల్ల తమ మధ్య దూరం తొలగిపోయిందన్నారు. మహారాష్ట్రలో హిందీ భాషను తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయంపై తాను రాష్ట్ర మంత్రి దాదా భూసేను నిలదీశానని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్‌లలో మూడో భాషగా ఏముందని ఆయన్ను ప్రశ్నించినట్లు రాజ్ ఠాక్రే చెప్పారు. హిందీ పాలిత రాష్ట్రాల్లోనే లేని రూల్‌ను మహారాష్ట్రలో బలవంతంగా ఎందుకు అమల్లోకి తెచ్చారని దాదా భూసేను ప్రశ్నించినట్లు తెలిపారు. అయితే తాను హిందీ వ్యతిరేకిని కాదని, ఏ భాషనూ వ్యతిరేకించనని తేల్చి చెప్పారు. మరాఠా సామ్రాజ్యం చాలా ప్రాంతాలను పాలించినా, ఎన్నడూ ఆయాచోట్ల మరాఠీని బలవంతంగా రుద్దలేదన్నారు. కానీ హిందీని బలవంతంగా రుద్దే ప్రక్రియను మహారాష్ట్రలోనే ప్రయోగాత్మకంగా మొదలుపెట్టినట్లుగా కనిపిస్తోందని రాజ్ ఠాక్రే విమర్శించారు. దీన్ని మహారాష్ట్ర ప్రజలు వ్యతిరేకించకుంటే, ముంబయి నగరాన్ని రాష్ట్రం నుంచి వేరు చేసేందుకూ వెనుకాడరని మండిపడ్డారు. మా పిల్లలు ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో చదువుకున్నారు. అయితే ఏంటి? మరాఠీ మీడియం స్కూళ్లో చదువుకున్న దాదా భూసే మంత్రి అయ్యారు. ఇంగ్లిష్ మీడి యంలో చదివిన ఫడ్నవిస్ సీఎం అయ్యారు. అయితే ఏంటి? నేను మరాఠీ మీడియం స్కూలు లో చదివాను. బాలాసాహెబ్ ఠాక్రే, మా నాన్న శ్రీకాంత్ ఠాక్రేలు ఇంగ్లిష్ మీడియంలో చదివారు. వాళ్లందరికి మరాఠీ భాషపై ఉన్న ప్రేమను ఎవరైనా ప్రశ్నించగలరా? రేపు నేను హిబ్రూ భాషను కూడా నేర్చుకుంటాను. అలా చేసినంత మాత్రాన నాకు మరాఠీపై ఉన్న ప్రేమను ఎవరైనా ప్రశ్నిస్తారా? మహారాష్ట్రలో ఉండే గుజరాతీలైనా, ఎవరైనా సరే మరాఠీ తెలిసిన వారై ఉండాలి. అయితే మరాఠీ భాషలో మాట్లాడనంత మాత్రాన వారిని కొట్టాల్సిన అవసరం లేదు. ఎవరైనా అనవసర డ్రామాలు చేస్తే మాత్రం మీరు గూబలు గుయ్‌మనేలా కొట్టండి. దాని వీడియోలు తీయకండి. బాధిత వ్యక్తే అందరికీ చెప్పుకోనివ్వండని ఎంఎన్ఎస్ అధినేత రాజ్ ఠాక్రే కీలక వ్యాఖ్యలు చేశారు. కాగా, ఈ సభ ప్రారంభం కావడానికి ముందు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి ఉద్ధవ్, రాజ్ సోదరులు పూలమాల వేశారు. ఈసందర్భంగా ఇద్దరు సోదరులు ఆప్యాయంగా కౌగిలించుకున్నారు.

## యుపిలో ఘోర ప్రమాదం: 8 మంది మృతి, ఇద్దరికి సీరియస్

### పెళ్లి వేడుకకు వెళ్తున్న ఇంట్లో పెనువిషాదం



**సంభాల్,(యూపి),జూలై 5:** పెళ్లి వేడుకకు వెళ్తున్న ఆ ఇంట్లో పెను విషాదం చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పెళ్లికొడుకు, ఇద్దరు చిన్నారులు సహా ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనతో పెళ్లి జరగాల్సిన ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి. హార్‌గోవింద్‌పూర్ గ్రామానికి చెందిన సుఖ్‌రామ్ తన కుమారుడు సూరజ్ పాల్ (20)వివాహాన్ని బదౌన్ జిల్లాలోని సిర్సౌల్ గ్రామానికి చెందిన యువతితో నిశ్చయించారు. నిన్న సాయంత్రం పెళ్లి బృందంతో కలిసి దాదాపు 11 వాహనాలు బయలుదేరాయి. కాగా, వరుడు సూరజ్‌తో పాటు మరో తొమ్మిది మంది ప్రయాణిస్తున్న మహీంద్రా బొలెరో వాహనం కాస్త వెనుకబడింది. మీరట్‌బదౌన్ జాతీయ రహదారిపై జునావాయి పట్టణం సమీపంలోకి రాగానే బొలెరో వాహనం అతివేగంతో అదుపు తప్పి జనతా ఇంటర్ కాలేజీ ప్రహరీని బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు వాహనం నుజ్జునుజ్జయింది. స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వాహనంలో చిక్కుకు పోయిన వారిని బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించారు. ఒక జేసీబీ సహాయంతో వాహనం భాగాలను తొలగించి క్షతగాత్రులను బయటకు తీశారు. వెంటనే వారిని సమీపంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తరలించగా, అప్పటికే ఎనిమిది మంది మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుల్లో వరుడు సూరజ్ పాల్‌తో పాటు రవి (28), ఆశ (26), సచిన్ (22), మధు (20), కోమల్ (15), ఐశ్వర్య (3), గణేష్ (2) ఉన్నారు. తీవ్రంగా గాయపడిన హిమాన్షి, దేవ అనే మరో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం వేరే ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పెళ్లి వేడుకకు బయలు దేరిన వారు మార్గమధ్యంలోనే మృత్యువాత పడటంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

## కాక్‌పిట్‌లోనే కుప్పకూలిన పైలట్

**బెంగళూరు, జూలై 5:** ఎయిరిండియా సంస్థకు చెందిన పైలట్ కాక్‌పిట్‌లోనే కుప్పకూలి పోయారు. విమానం బయలుదేరే కొన్ని నిమిషాల ముందే ఆ అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. దీంతో వెంటనే సంబంధింత వర్గాలు మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించాయి. శుక్రవారం ఉదయం బెంగళూరు నుంచి ఢిల్లీ వెళ్లే విమానంలో ఘటన జరిగినట్లు తెలిపాయి. అధికారుల సమాచారం ప్రకారం, విమాన కాక్‌పిట్‌లోకి పైలట్ వెళ్లాక కొన్ని తప్పనిసరి పేపర్స్‌పై సంతకాలు చేయాల్సి ఉంది. అందులో టెక్ లాగ్ వంటి దస్త్రాలు ఉంటాయి. వాటిపై సంతకాలు చేసిన సమయంలోనే కుప్పకూలిపోయారు. దీంతో విమానంకొద్దిసేపు నిలిచిపోయింది. మరో పైలట్ వచ్చాక ఆ విమానం బయలు దేరింది. అయితే ఈ పరిణామంపై ఎయిరిం డియా ప్రకటన చేసింది. జులై 4న ఉదయం తమ పైలట్‌లలో ఒకరికి అత్యవసర వైద్య పరిస్థితి ఏర్పడిందని తెలిపింది. దీంతో బెంగళూరు నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన ఏఐ 2414 విమానాన్ని నడపలేకపోయారని పేర్కొంది. వెంటనే ఆయన్నుస్థానిక ఆసుపత్రికి తరలించామని తెలిపింది. ప్రస్తుతం పైలట్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నారని పేర్కొంది. ఇలాంటి సమయంలో పైలట్‌కు, ఆయన కుటుంబానికి అండగా నిలబడటమే తమ ప్రాధాన్యమని ఎయిరిండియా తెలిపింది.

## పొలం దున్నిన సిఎం పుష్కర్‌సింగ్ ధామి



**డెహ్రాడూన్, జూలై 5:** నిత్యం అధికారిక సమీక్షలు, సమావేశాలతో తీరిక లేకుండా గడిపే ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, అందుకు భిన్నంగా ఓ కొత్త పాత్రలో కనిపించారు. ఏకంగా రైతు అవతారమెత్తి, పొలంలోకి దిగి అందరినీ ఆశ్చర్యపరిచారు. కాడెద్దులతో నాగలి పట్టి పొలాన్ని దున్ని, స్థానిక రైతులతో కలిసి వరి నాట్లు వేశారు. వివరాల్లోకి వెళ్తే.. ముఖ్యమంత్రి ధామి తన సొంత పొలంలో సంప్రదాయ పద్ధతిలో వ్యవసాయ పనులు చేపట్టారు. కాడెద్దులతో నాగలిపట్టి పొలాన్ని దుక్కి దున్నారు. అనంతరం అక్కడున్న స్థానిక రైతులతో కలిసిపోయి ఉత్సాహంగా వరి నాట్లు వేశారు. సీఎం సామాన్యుడిలా వ్యవసాయ పనుల్లో నిమగ్నమవ్వడంతో ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఉత్తరాఖండ్ రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా వ్యవసాయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. రైతులంతా వరి నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇదే సమయంలో రైతులకు భరోసా కల్పిస్తూ వారిలో ఒకరిగా సీఎం ధామి పొలం పనుల్లో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, మరో వైపు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడుతుండటం, వరదలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది.

## హిందూ యువతుల బలవంతపు మతమార్పిడిపై ఎన్ఐఎ కేసు నమోదు

**భోపాల్, జూలై 5:** హిందూ యువతులను ఆకర్షించి మతమార్పిడికోసం ముస్లిం యువకులకు డబ్బులు ఇచ్చారనే తీవ్ర ఆరోపణలపై ఇండోర్‌కు చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్ అన్వర్ ఖాద్రీపై పోలీసులు జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్టయిన ముగ్గురు యువకులు తమకు అన్వర్ ఖాద్రీయే డబ్బులు ఇచ్చారని పోలీసుల విచారణలో చెప్పడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. హిందూ యువతులను లక్ష్యంగా చేసుకుని, వారిని వివాహం చేసుకుని ఇస్లాంలోకి మార్చేందుకు ఒక్కొక్కరికి రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు ఖాద్రీ చెల్లించినట్లు ఆరోపణలు వచ్చాయి. మతం దాచిపెట్టి మోసం చేసి తమపై లైంగికదాడికి పాల్పడ్డారంటూ రెండు వారాల క్రితం ఇద్దరు హిందూ యువతులు బం



గాంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ కుట్ర బయటపడింది. ఈ ఫిర్యాదుతో పోలీసులు సాహిల్ షేక్, అల్తాఫ్ అలీ అనే ఇద్దరిని అరెస్టు చేశారు. విచారణలో వీరు ఖాద్రీ పేరు చెప్పడంతో ఆయనపై మత స్వేచ్ఛ చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఖాద్రీ పరారీలో ఉండగా, ఆయన ఆచూకీ తెలిపిన వారికి రూ. 10,000 రివార్డును పోలీసులు ప్రకటించారు. ఈ ఘటనపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ స్పందించారు. పరారీలో ఉన్న కౌన్సిలర్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని,దోషులు ఎవరైనా వదిలిపెట్టేది లేదని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, బీజేపీ ఎమ్మెల్యే రమేశ్వర్ శర్మ తీవ్రంగా స్పందించారు. ఖాద్రీని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. ఇండోర్ కలెక్టర్ ఆశిష్ సింగ్ కూడా సామాజిక సామరస్యానికి ముప్పు వాటిల్లుతున్నందునే ఎన్ఎస్ఏ ప్రయోగించినట్లు ధ్రువీకరించారు. ఆధారాల ప్రకారమే చర్యలు తీసుకుంటున్నామని, ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉన్నా ఉపేక్షించేది లేదని పోలీసులు తెలిపారు.

## మెగామార్ట్‌లో అగ్నిప్రమాదం



**న్యూఢిల్లీ, జూలై 5:** దేశ రాజధాని ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కరోల్ బాగ్ ప్రాంతంలోని ప్రముఖ విశాల్ మెగా మార్ట్‌లో గత రాత్రి జరిగిన ఈ దుర్ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో లిఫ్ట్‌లో చిక్కుకుపోవడం వల్లే ఆయన మృతి చెందినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు ధ్రువీకరించారు. సాయంత్రం 6:44 గంటల సమయంలో భవనంలోని మొదటి అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. మొదట మాల్ సిబ్బంది అక్కడున్న అగ్నిమాపక పరికరాలతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ, అవి వేగంగా స్టోర్ మొత్తం వ్యాపించాయి. ఈ ప్రమాదంలో లక్షల రూపాయల విలువైన వస్తువులు, సరుకులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ అగ్నిమాపక సిబ్బంది 13 ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఢిల్లీ పోలీసులు కూడా సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. సుమారు రాత్రి 9 గంటల సమయానికి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ప్రమాదం జరిగినప్పటికీ, ఇంకా భవనంలో వేడి తగ్గకపోవడంతో కూలింగ్ ప్రక్రియ కొనసాగుతోం దని, ఆరు ఫైరింజన్లు ఘటనా స్థలంలోనే ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టెక్సాస్‌ను ముంచెత్తిన వరదలు: 24 మంది మృత్యువాత



**న్యూయార్క్, జూలై 5:** అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరదలు సంభవించాయి. ఈ ప్రకృతి విపత్తులో ఇప్పటివరకు 24 మంది ప్రాణాలు కోల్పోగా మరో 20 మందికిపైగా బాలికలు గల్లంతయ్యారు. వీరి కోసం రెస్క్యూ సిబ్బంది ముమ్మరంగా గాలిస్తున్నారు. వర్షాల కారణంగా హంట్ ప్రాంతంలోని గ్వాడాలుపే నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమ్యాయి. అనేక నివాసాలు నీట మునిగాయి. వీధుల్లోకి భారీగావరద నీరు చేరింది. ఇప్పటి వరకు 24మంది మృతి చెందినట్లు స్థానిక అధికారులుధ్రువీకరించారు. వరదల్లో చిక్కుకున్న దాదాపు 200 మందికిపైగా ప్రజలను రక్షించారు. గ్వాడులుపే నదీతీరంలో ఉన్న క్రిస్టియన్ క్యాంప్‌లో వేసవి శిక్షణాశిబిరం నిర్వహిస్తున్నారు. ఈ క్యాంప్‌ను వరదలు ముంచెత్తడంతో ఇందులో దాదాపు 23–25మంది బాలికలు గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఈబాలికల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వారి ఆచూకీ తెలియజేయాలంటూ సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు షేర్ చేస్తున్నారు. మరోవైపు, బాలికల కోసం అధికారులు తీవ్రంగాగాలిస్తున్నారు. పడవలు, హెలికాప్టర్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

## పాకిస్థాన్-రష్యా మధ్య రైలు మార్గానికి అంగీకారం



**ఇస్లామాబాద్, జూలై 5:** పాకిస్థాన్‌ను తమ దేశంతోపాటు మధ్యాసియా దేశాలతో అనుసంధానించే బలమైన రైలు, రోడ్డు నెట్‌వర్క్ ఏర్పాటులో సహకారం అందించేందుకు రష్యా అంగీకరించింది. ఈ మేరకు ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. రష్యాతో కుదిరిన ఒప్పందం తమ దేశాన్ని ఒక వ్యూహాత్మక అంతర్జాతీయ రహదారి కూడలిగా మారుస్తుందని పాకిస్థాన్ కమ్యూనికేషన్ల మంత్రి అబ్దుల్ అలీం అన్నారు. చైనాలోని టియాన్‌జిన్‌లో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఒ) మంత్రిత్వస్థాయి సమావేశం సందర్భంగా ఆయన ఈ విషయం వెల్లడించారు. ప్రపంచ దేశాలతో వాణిజ్య, ఆర్థిక అనుబంధం పెంపొందించుకునేందుకు తాము కృషచేస్తున్నామన్నారు. పాకిస్థాన్ చేపట్టిన ఆధునీకరణ చర్యన్ని ఆయన ప్రస్తావించారు. ఇందులో భాగంగానే రవాణా మౌలిక సదుపాయాలను డిజిటీకరించామని, ఎలాంటి అవరోధాల్లేని మోటార్‌వేల ఏర్పాటు, ఈ–ట్యాంగింగ్, సిసిటివి నిఘా వంటి అనేక చర్యలు చేపట్టామన్నారు. పాకిస్థాన్ రష్యాల మధ్య సహకారం ప్రాంతీయ వాణిజ్య సమీకరణలను మార్చివేస్తాయని రష్యా ఉప మంత్రి నికిటిన్ అన్నారు.

## ప్రజల సేవలో మరో 40 యేళ్లు జీవిస్తే చాలు

### కొనసాగుతున్న వారసుని ఎంపిక ప్రక్రియ: దలైలామా



**న్యూఢిల్లీ, జులై 5:** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తన మనసులోని మరో విషయాన్ని బయటపెట్టారు. జులై 6న తన 90వపుట్టిన రోజు వేడుక నిర్వహించుకోనున్న నేపథ్యంలో ఆయన అనుచరులు దలైలామా దీర్ఘాయుష్షు కోసం పలు ప్రార్థనలు నిర్వహించారు. అందులో భాగంగా టిబెట్ టిబెట్ బౌద్ధమత గురువు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేస్తూ మరో 30,40 ఏళ్లు జీవించాలని ఉందనే తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. మరికొన్నేళ్లు ఆరోగ్యంగా జీవించగలననే దేవుని స్పష్టమైన సంకేతాలు తనకు అందుతున్నాయన్నారు. బుద్ధుని బోధనల వ్యాప్తికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గతంలోనూ దలైలామా తన ఆయుష్షు గురించి మాట్లాడుతూ తాను 110 ఏళ్లు జీవిస్తానని ఓ కల వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తనకు 90 ఏళ్లు నిండటంతో 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని దానిని నిర్వహించే అధికారం గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్‌కు మాత్రమే ఉందని ఇటీవల టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువారం దలైలామా తేల్చి చెప్పారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. 2011 సెప్టెంబర్ 24నే తాను టిబెట్ బౌద్ధమత పెద్దలు, నాయకులు, ఇతర సంస్థలతో భేటీ నిర్వహించి తన వారసుడి ఎంపిక కొనసాగించాలా? అనే అంశంపై అభిప్రాయాలు కోరినట్లు పేర్కొన్నారు. ఇందుకు అన్ని వర్గాల నుంచి సానుకూల స్పందనలు వచ్చాయన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం ఎవరికీ లేదని చైనాను ఉద్దేశించి అన్నారు. కాగా టిబెట్‌పై పట్టు కోసం భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని కబ్జా చేయాలని చైనా భావిస్తోంది. ఆ స్థానం ఎంపికలో పంచయిన్ లామా పాత్ర చాలా కీలకం. టిబెట్‌లోనే ఉండిపోయిన పంచయిన్ లామా 1989లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయనపై విషప్రయోగం చేశారంటారు. పంచయిన్ లామా వారసుడిగా ఎంపికైన బాలుడిని తన ఆధీనంలో ఉంచుకొన్నట్లు కొన్నేళ్ల కిందట బీజింగ్ ప్రకటించింది. ఈ ఎత్తుగడలను గ్రహించిన దలైలామా తన పునర్జన్మ టిబెట్ బయట కూడా జరగవచ్చని ప్రకటించారు. దీంతోపాటు వారసుడిని ఎంపిక చేసే ప్రక్రియ కూడా తమ దేనని తేల్చిచెప్పారు.

## టిబెట్ సరిహద్దుల్లోకి చైనా మానవరహిత ఆయుధాలు!



**బీజింగ్,జూలై 5:** చైనా మరో స్కెచ్ సరిహద్దుల వద్ద మాన్‌స్టర్స్ చైనా అన్ మ్యాన్డ్ గ్రౌండ్ వెహికల్స్ (యుజివి)లను పెద్ద సంఖ్యలో తయారు చేస్తోంది. వీటిని ఎక్కడినుంచైనా ఆపరేట్ చేయొచ్చు. వీటి కోసం జవాన్లు యుద్ధ భూమిలోకి దిగాల్సిన అవసరం లేదు. అలాగేసరిహద్దులవద్ద రోబో మాన్‌స్టర్స్‌ను కూడా ఏర్పాటుచేస్తోంది. ప్రపంచం మొత్తం ఒక తీరు మాదొక తీరు అనే చైనా టెక్నాలజీ పరంగా మాత్రం టాప్‌లో ఉంది. కొత్త కొత్త టెక్నాలజీలను అభివృద్ధి చేస్తూ దేవుడి సృష్టికి ప్రతి సృష్టి చేస్తోంది. టెక్నాలజీని ఉపయోగించి ఆర్మీని మరింత పటిష్టం చేస్తోంది. చైనా ఏ దేశంపైనా నేరుగా యుద్ధానికి దిగకపోయినా, యుద్ధానికి మాత్రం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. పరోక్ష యుద్ధానికి అవసరమైన సన్నాహాలు చేసుకుంటూ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తమ సైనికులను యుద్ధానికి పంపకుండా మిషిన్లతోటే యుద్ధం చేయడానికి చూస్తోంది. ఇందుకోసం అన్ మ్యాన్డ్ గ్రౌండ్ వెహికల్స్ (యుజివి)లను పెద్ద సంఖ్యలో తయారు చేస్తోంది. వీటిని ఎక్కడినుంచైనా ఆపరేట్ చేయొచ్చు. వీటి కోసం జవాన్లు యుద్ధ భూమిలోకి దిగాల్సిన అవసరం లేదు. చైనా ప్రస్తుతం యూజీవీలపై పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తోంది. హిమాలయాల్లో పట్టు సాధించటం కోసం వీటిని ఉపయోగించాలని చూస్తోంది. మనుషులు వెళ్లలేని చోటుకు కూడా యూజీవీలు వెళ్లగలవు. జవాన్ల కంటే వేగంగా కదలగలవు. చైనా ఇప్పటికే చాలా యూజీవీలను తయారు చేసింది. యూజీవీలలో రెండు రకాలు ఉన్నాయి. ఒకటి షార్ప్ క్లా, రెండోది షార్ప్ క్లా 2. షార్ప్ క్లా 120 కేజీల బరువు ఉంటుంది. ఆరు కిలోమీటర్ల రేంజ్ వరకు వీటిని ఆపరేట్ చేయవచ్చు. కొండలపైకి కూడా ఎక్కగలవు. వీటిలో మిషిన్ గన్స్ ఉంటాయి. కెమెరాల ద్వారా అన్నిటిని చూడగలదు. షార్ప్ క్లా 2 గుహల్ని, బంకర్లను, బిల్డింగులను ధ్వంసం చేయగలదు. చైనా నాలుగు కాళ్ల రోబో కక్కులు, తోడేళ్లను కూడా తయారు చేసింది. అయితే, వాటిని మాత్రం యుద్ధ భూమిలోకి తీసుకురాలేదు. చైనా తమ యూజీవీలను టిబెట్ సరిహద్దుల దగ్గరకు చేర్చినట్లు తెలుస్తోంది. ఇదే ఇపుడు భారత్‌ను కలవరపెడుతోంది. హిమాలయాల్లో భారత జవాన్లు చైనా యూజీవీలతో పోరాటం చేస్తే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. చైనా గోతి కాడ నక్కలాగ సరైన అవకాశం కోసం ఎదురు చూస్తూ ఉంది.

## హామాస్ అంతమే టార్గెట్‌గా ఇజ్రాయెల్ దాడులు



**గాజాసిటీ, జూలై 5:** హమాస్ అంతమే లక్ష్యంగా గాజాపై ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడుతున్నాయి. ఐడీఎఫ్ జరుపుతున్న ఈ దాడుల్లో అనేక మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా గాజాపై ఇజ్రాయెల్ దళాలు జరిపిన వైమానిక దాడులు, కాల్పుల వల్ల వివిధ ప్రాంతాల్లో తలదాచుకున్న దాదాపు 42 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు గాజా ఆసుపత్రి వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఆహారం కోసం వేచి ఉన్న ప్రజలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ దళాలు దాడులు చేసినట్లు పేర్కొంది. తాజా దాడుల్లో అనేక మంది గాయపడినట్లు పేర్కొంది. క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మరోవైపు 60 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనపై వెంటనే చర్చలు ప్రారంభించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు హమాస్ ప్రకటించింది. ఇజ్రాయెల్‌హమాస్ మధ్య యుద్ధం అక్టోబర్ 2023లో ప్రారంభమైన విషయం తెలిసిందే. హమాస్ ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాలపై దాడి చేసింది. ఈ దాడుల్లో 1200 మందికిపైగా ఇజ్రాయెల్ పౌరులు మరణించారు. ఆ తర్వాత ఇజ్రాయెల్ ప్రతీకారంలో ఇప్పటివరకు 58 వేలకుపైగా పాలస్తీనియన్లు మరణించారు. గాజాలో పెద్ద సంఖ్యలో జనాభా నిరాశ్రయులయ్యారు. వేలాదిమంది ఆకలి బాధల ను ఎదుర్కొంటున్నారు. గాజా అంశంలో తమ ప్రతినిధులు ఇజ్రాయెల్‌తో సుదీర్ఘ చర్చలు చేపట్టారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపిన విషయం తెలిసిందే. గాజాలో 60 రోజుల కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ అంగీకరించిందని, ఆ సమయంలో అన్ని పార్టీలతో కలిసి యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తా మన్నారు. శాంతి ఒప్పందం కోసం ఖతార్, ఈజిప్ట్ తీవ్రంగా ప్రయత్నించాయని, వాళ్లే దీనికి సంబంధించిన తుది ప్రతిపాదన చేస్తారన్నారు. మిడిల్ ఈస్ట్ మంచి కోసం హమాస్ ఆ ఒప్పందాన్ని అంగీకరిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. అయితే, గాజాపై యుద్ధాన్ని పూర్తిగా ఆపేస్తామంటేనే ఒప్పందాన్ని అంగీకరిస్తామని హమాస్ సంస్థ తెలిపింది. గాజాలో 60 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ట్రంప్ ప్రకటన వేళ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కీలక వ్యాఖ్యలు చేశారు. హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తామని వ్యాఖ్యానించారు. 'హమాస్ ఉండదు.. హమస్థాన్ ఉండదు. ఆ సంస్థను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం' అని వ్యాఖ్యానించారు.

## బిజెపినేత గోపాల్‌ఖేమ్కా హత్య



**పాట్నా,జూలై 5:** బీహార్ రాజధాని పాట్నాలో దారుణం చోటుచేసుకుంది. బీజేపీ నేత, ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కాను దుండగులు కాల్చి చంపారు. సరిగ్గా మూడేళ్ల క్రితం ఆయన కుమారుడు గుంజన్ ఖేమ్కా కూడా ఇలాగే హత్యకు గురయ్యారు. ఒకే కుటుంబంలో తండ్రీకొడుకులు హత్యకు గురవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. గాంధీ మైదాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పనాచే హోటల్ సమీపంలో ఉన్న ట్విన్ టవర్ అపార్ట్‌మెంట్‌లో గోపాల్ ఖేమ్కా నివాసం ఉంటున్నారు. ఆయన ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై కాల్పులు జరిపి పరారయ్యారు. ఈ ఘటనలో ఖేమ్కా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సిటీ ఎస్పీ సెంట్రల్ దీక్ష మాట్లాడుతూ, "గోపాల్ ఖేమ్కా హత్యకు గురైనట్లు మాకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆ ప్రాంతాన్ని మా ఆధీనంలోకి తీసుకున్నాం. ఒక బుల్లెట్, షెల్ కేసింగ్‌ను స్వాధీనం చేసుకున్నాం. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తూ దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

## యాత్రీకుల బస్సులు ఢీ: 36 మందికి తీవ్ర గాయాలు



**జమ్ము,జూలై 5:** అమర్‌నాథ్ యాత్రకు భక్తులతో వెళ్తున్న బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో 36 మంది యాత్రికులు గాయపడ్డారు. జమ్మూకశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలో యాత్రికులతో వెళ్తున్న ఓ బస్సు అదుపుతప్పి ఆగి ఉన్న ఇతర బస్సులను వెనుక నుంచి ఢీకొట్టింది. పవిత్ర అమర్‌నాథ్ పుణ్యక్షేత్రానికి వెళ్తున్న యాత్రికుల కాన్వాయ్ చందర్‌కోట్ ప్రాంతంలో అల్పాహారం కోసం ఆగింది. ఆ సమయంలో కాన్వాయ్‌లోని ఓబస్సు నియంత్రణ కోల్పోయింది. దీంతో ముందు పార్క్ చేసి ఉన్న నాలుగు బస్సులను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనతో యాత్రికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంపై రాంబన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్పీ) కుల్బీర్ సింగ్ స్పందించారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆరోగ్యశాఖ రూపొందించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ తదితరులు

## డెంగీ ప్లేట్‌లెట్స్ పేరిట పేషెంట్లను దోచుకునే ప్రైవేట్ హాస్పిటళ్లపై కఠినచర్యలు

### సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై జూబ్లీహిల్స్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి శనివారం సమీక్ష నిర్వహించారు. సమీక్ష సమావేశంలో వైద్య, ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్రకుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, మెడికల్ కార్పొరేషన్ ఎండీ ఫణీంద్ర రెడ్డి, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, పబ్లిక్‌హెల్త్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అమర్ సింగ్ నాయల్, జాయింట్ డైరెక్టర్ శివబాలాజీ పాల్గొన్నారు. సమావేశంలో.. మే నెల నుంచే వర్షాలు ప్రారంభమయ్యాయని, వాతవరణంలో వచ్చిన ఈ మార్పుల నేపథ్యంలో మే, జూన్ నుంచే అక్కడక్కడ సీజనల్ వ్యాధులు మొదల య్యాయని అధికారులు మంత్రికి దృష్టికి తీసుకొచ్చారు. అయితే గతేడాదితో పోలిస్తే ఈసారి చాలా జిల్లాల్లో డెంగీ కేసులు తక్కువగా నమోదయ్యాయని.. గ్రేటర్ హైదరా బాద్‌లో స్వల్పంగా కేసులు పెరిగాయని తెలిపారు. 19 జిల్లాల్లో పది కంటే తక్కువ కేసులు నమోదవగా, మిగిలిన జిల్లాల్లో పదికంటే ఎక్కువ కేసులు నమోదైనట్టు అధికారులు మంత్రికి చెప్పారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్న జిల్లాలు, గ్రేటర్ హైదరాబాద్‌లో యాంటిలార్వల్ ఆపరేషన్‌ను విస్తృతం చేయాలన్నారు.

వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న జీహెచ్ఎంసీ జోన్లకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని జీహెచ్ఎంసీ అధికారులను మంత్రి ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై కలెక్టర్లతో సమీక్షించాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. అలాగే ట్రైబల్ ఏరియాలపై ఎక్కువగా ఫోకస్ చేయాలని, ఐటీడీఏ పీవోలతో సమన్వయం చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి, ప్రజలకు అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన పేషెంట్లకు చికిత్స అందించేందుకు హాస్పిటళ్లలో అవసరమైన అన్ని వసతులతో సిద్ధంగా ఉంచాలని అధికారులను మంత్రి ఆదేశించారు. డెంగీ, ప్లేట్‌లెట్స్ పేరిట పేషెంట్లను దోచుకునే ప్రైవేట్ హాస్పిటల్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రతి సోమవారం నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఇంట్లో అలాగే ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని మంత్రి ప్రజలకు సూచించారు.

# ముగిసిన దోస్త్-2025 అడ్మిషన్ల ప్రక్రియ

## మూడు విడతల్లో సీట్ల కేటాయింపు

### కాలేజీల్లో చేరడానికి శనివారంతో ముగిసిన గడువు

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025 అడ్మిషన్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం మూడు విడతల్లో సీట్లను కేటాయించారు. రెండు, మూడో విడతల్లో సీటు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో చేరడానికి ఇచ్చిన గడువు కాస్త శనివారం(జులై 5)తో ముగిసింది. దీంతో 2025-26 సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసినట్టయింది. మొదటి విడతలో 65వేల మందికి సీట్ల కేటాయింపు చేపట్టగా వారిలో సుమారు 43 వేల మంది కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ ఇచ్చారు. ఇక రెండో విడతలో 43వేల సీట్ల కేటాయింపు చేయగా.. మూడో విడతలో 85,680 మంది విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేశారు.

సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 30 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉండగా దానిని కాస్త జులై 5 వరకు పొడిగించారు. అదికాస్త శనివారంతో ముగిసింది. దోస్త్ మూడో విడత సీట్ల కేటాయింపును జూన్ 28న విడుదల చేశారు. దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్‌లో భాగంగా 82,770 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మూడో విడతలో 96,015 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 85,680 మందికి సీట్ల కేటాయింపు చేపట్టారు. తక్కువ ఆప్షన్లు ఇచ్చిన కారణంగా 10,335 మందికి మొదటి విడతలో సీట్ల కేటాయింపు చేయలేదు.

రెండు, మూడో విడతలో సీటు పొందిన వారు రూ. 500.. రూ. 1000 ఫీజు చెల్లించి ఆయా కాలేజీల్లో చేరడానికి శనివారం(జులై 5) వరకు అవకాశం కల్పించగా .. గడువు కాస్త ముగిసింది. మొత్తంగా మూడు విడతల్లో కలిపి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో చేరిన విద్యార్థుల సంఖ్యను దోస్త్ అధికారులు సోమవారం ప్రకటించే అవకాశం ఉంది. రాష్ట్రంలో 4లక్షలకిపైగా డిగ్రీ సీట్లు అందుబాటులో ఉన్నాయి.

# స్పీకర్ చైర్‌లో దళితుడు కూర్చోవడాన్ని కెసిఆర్ జీర్ణించుకోవడం లేదు

## రేవంత్‌తో చర్చించే దమ్ము కెటిఆర్‌కు లేదు

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ డిఎన్ఎలోనే దళిత వ్యతిరేకత ఉంది స్పీకర్ చైర్‌లో దళితుడు కూర్చోవడంతో కెసిఆర్ జీర్ణించుకోలేక అసెంబ్లీకి రావడంలేదు ఎఐసిసి అధ్యక్షుడి మల్లికార్జు ఖర్గేపై అక్కసుతో ఆయనకు వ్యతిరేకంగా పోస్టర్లు వేయించారు అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం సిఎల్‌పి కార్యలయంలో విలేఖరులతో మాట్లాడుతూ మా ప్రభుత్వం పైన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద ఆడిపోసుకోవడమే కెటిఆర్‌కు పనిగా మారిందని దుయ్యబట్టారు. అక్కసు, కుళ్లు తప్ప కెటిఆర్‌లో మాటల్లో ఏ మాత్రం పస లేదని తెలిపారు. మా ప్రభుత్వ పనితీరుపై బహిరంగ చర్చకు సిద్ధమా అని కెటిఆర్ సవాల్ చేస్తున్నారు. మా ప్రభుత్వ పనితీరుపై ఎప్పుడైనా మేం చర్చకు సిద్ధం అని ఆయన ప్రకటించారు. ప్రజాస్వామ్యం లో చర్చకు చట్ట సభలున్నాయి అక్కడ జరిగే చర్చలు రికార్డు అవుతాయి అని ఆయన అన్నారు. అసెంబ్లీలో చర్చకు రావాలని మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత కొన్ని రోజులుగా సవాల్ విసురుతున్నారు..కృష్ణా, గోదావరి జలాలతో పాటు అన్ని అంశాలపై అసెంబ్లీలో చర్చకు మేం సిద్ధం నీకు దమ్ముంటే స్పీకర్ దగ్గరకు వెళ్లి అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు కోరుతూ మీ పార్టీ తరపున లేఖ ఇవ్వండని ఆయన తెలిపారు. ప్రధాన ప్రతిపక్ష నేత కెసిఆర్ ను అసెంబ్లీకి తీసుకువచ్చి చర్చ చేయమనండి అని కోరారు. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించేంత స్థాయి, దమ్ము బచ్చా కేటీఆర్ కు లేదు.. మేం చాలుకేటీఆర్ హరీష్ రావు లాంటి పిల్ల గాళ్లకు మేం చాలు, మా ముఖ్యమంత్రి అవసరం లేదని ఆయన అన్నారు. ప్రెస్ క్లబ్ లో చెట్ల కింద ఎందుకు అసెంబ్లీ కి రండి, తేల్చుకుందాం అని ఆయన అన్నారు. కెటిఆర్ రైతుల కోసం మా ప్రభుత్వం ఏం చేసిందో చర్చకు మేం సిద్ధం అని అన్నారు. సిరిసిల్ల, చింతమడక, తెలంగాణ భవన్ , ప్రెస్ క్లబ్ ఎక్కడికైనా వచ్చి చర్చిస్తామని అన్నారు. 72 గంటలు కాదు,72 నిమిషాల్లోనైనా చర్చకు సిద్ధం..మా ముఖ్యమంత్రి చెప్పినట్లు వచ్చే ఎన్నికల్లో మేం వంద సీట్లు గెలుస్తామని ఆయన ఢంకా భజాయించి చెప్పారు. 9 రోజుల్లో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో వేసింది మా ప్రభుత్వం అని అన్నారు.

# వైద్య పోస్టుల సెలక్షన్ లిస్ట్ విడుదల

## ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు 156

### ఎంఎన్‌జెలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 45

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఇప్పటికే ఈ యేడాదిలో రెండు నోటిఫికేషన్లను జారీ చేయగా.. ఇప్పుడు డాక్టర్లకు మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు మరో శుభవార్త తెలిపింది. ఆయుష్ మెడికల్ ఆఫీసర్, ఎంఎన్‌జె హాస్పిటల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించిన సెలక్షన్ లిస్ట్‌ను శనివారం విడుదల చేసింది. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు 156 ఉండగా.. ఎంఎన్‌జెలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 45 ఉన్నాయి. ఈ పోస్టులకు ఎంపికైన వారి వివరాలను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు శనివారం ప్రకటించింది. పోస్టుల భర్తీతో ఆయుష్ వైద్య సేవలు మరింత మెరుగవుతాయని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవలను బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను మంత్రి గుర్తుచేశారు. ఆయుష్‌లో ఇటీవలే సుమారు 630 వరకు యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించామని, మరో 200లకు పైగా పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. అలాగే రాష్ట్రంలో కేన్సర్ పేషెంట్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కేన్సర్ వైద్యసేవలను విస్తరిస్తు న్నామని మంత్రి తెలిపారు. కొత్తగా 45 మంది డాక్టర్ల నియామకంతో ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్‌లో వైద్యసేవలు మరింత మెరుగవుతాయన్నారు. జిల్లాలకు కూడా ప్రభుత్వ కేన్సర్ వైద్య సేవలను విస్తరిస్తున్నామని మంత్రి వెల్లడించారు. కొత్త జిల్లాల్లో డిస్ట్రిక్ట్ కేన్సర్ కేర్ సెంటర్లను ఏర్పా టు చేస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో రీజనల్ కేన్సర్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు మంత్రి తెలిపారు. ఈ సెంటర్లు అందుబాటులోకి వచ్చాక, పేషెంట్లు హైదరాబాద్ వరకూ రావాల్సిన అవసరం ఉండబోదని.. జిల్లా స్థాయిలోనే మెరుగైన వైద్య సేవలు అందుతాయని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు.

# భట్టి విక్రమార్క ఎల్‌ఒసితో కేన్సర్‌ను జయించిన మహిళ

## గాంధీభవన్ ముఖాముఖి కార్యక్రమానికి స్పందన

### కృతజ్ఞతలు తెలిపిన భర్త రామకృష్ణ

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఎల్‌ఒసితో ఒక మహిళ కేన్సర్ జయించి మంత్రులతో ముఖాముఖి కార్యక్రమానికి ఒక సార్థకత చేకూర్చింది. కాంగ్రెస్ పాలకులు గడీలకు పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేల వరకు ప్రజల బాధలు వారి బాధలుగా భావిస్తూ నిత్యం ప్రజల్లో ఉండటం వల్ల వారి కష్టసుఖాలకు పరిష్కార మార్గం సత్వరమే దొరుకుతున్నది. ఆర్థికకష్టాలు రాష్ట్రాన్ని చుట్టుముట్టినా నేనున్నాని అనే ధీమా ప్రజల్లో భద్రతా భావం పెంపొందిస్తున్నది. మంత్రులతో ముఖాముఖి వంటి కార్యక్రమం ఎంతోమంది అణగారిన వర్గాల ప్రజలకు ప్రభుత్వంను చేరువలోకి తీసుకొచ్చింది. కేన్సర్ జయించిన మహిళ కుటుంబం వివరాల్లోకి వెళితే.. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన రామకృష్ణ హైదరాబాద్ నగరంలో మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఆయన భార్య క్యాన్సర్ లంప్ తో బాధపడుతున్నట్టు గుర్తించి ఓ ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించారు. కొంతకాలం చికిత్స అనంతరం వారు వైద్యఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో గాంధీభవన్‌లో మంత్రుల ముఖాముఖి కార్యక్రమం జరుగుతుందని తెలుసుకొని రామకృష్ణ కుమారుడు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లును కలిసి లిఖితపూర్వకంగా తన తల్లిదండ్రుల ఆవేదనను వివరించారు. చలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు వెను వెంటనే లెటర్ ఆఫ్ క్రెడిట్ ఇచ్చి రామకృష్ణ జీవితం సహచరికి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సహాయం ఎక్కడ ఆగకుండా ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేసి చెప్పాలని తన సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎల్ ఒ సి తో రామకృష్ణ తన భార్యకు 5 సార్లు కీమో థెరపీ చేయించ గలిగారు. కీమో అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించగా రామకృష్ణ శ్రీమతి క్యాన్సర్ మహమ్మారి నుంచి పూర్తిగా విముక్తి పొందినట్టు వైద్యులు నిర్ధారించారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పందించడంతో తన కుటుంబం నిలబడిందని, శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రామకృష్ణ డిప్యూటీ సిఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. క్యాన్సర్ ను విజయవంతంగా జయించిన ఆ కుటుంబానికి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అభినందనలు తెలియజేశారు.



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్, బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

# కరీంనగర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా

## కేంద్రమంత్రి బండి సంజయ్

**జమ్మికుంట (హుజురాబాద్ ఆర్సీ), ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో అంతవరకే రాజకీయాలు.. ఆ తర్వాత వార్డు మెంబర్ స్థాయి నుండి పార్లమెంట్ స్థాయి వరకు మనకు ఓట్లు వేసిన గెలిపించిన ప్రజల మనోభావాలకు అనుగుణంగా నాయకులము అన్న విషయాన్ని మర్చిపోయి, ప్రజలకు సేవకులుగా వారి అవసరాలను గుర్తించి, గ్రామాల అభివృద్ధికి కృషి చేసినప్పుడే ప్రజలు మనల్నను ఆశీర్వదిస్తారని, హక్కున చేర్చుకుంటారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుజురాబాద్ నియోజకవర్గం వీణవంక, జమ్మికుంట మండలాల పరిధిలో1కోటి 56 లక్షల వ్యయంతో, వీణవంక మండలంలో 18 అంతర్గత సీసీ రోడ్లను నిర్మించగా, కరీంనగర్ నుండి వీణవంకకు వచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను హుజురాబాద్ బిఆర్ఎస్ శాసనసభ్యుడు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, బిజెపి పార్టీ శ్రేణులు బండి సంజయ్‌కుమార్ ఘనంగా గజమాలతో స్వాగతం పలికారు. వీణవంకలో నిర్మాణమైన 18 సీసీ రోడ్లను మంత్రి బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు.

అనంతరం జమ్మికుంట మండలంలోని గండ్రపల్లి గ్రామంలో మరో 78లక్షల వ్యయంతో 13అంతర్గత సీసీ రోడ్లను ఇరువురు చేతుల మీదుగా ప్రారంభించారు. అంతకుముందే పలుచోట్ల గ్రామ దేవతలకు, పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ గడిచిన ఆరు సంవత్సరాల కాలంలో 20వేల కోట్ల రూపాయల వ్యయంతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ప్రజల అవసరాలను గుర్తించి, నంబర్ 1 పార్లమెంట్‌గా అభివృద్ధిలో తీర్చిదిద్దానని, మరిన్ని నిధులు అభివృద్ధి పనులకు తీసుకువస్తానని బండి సంజయ్‌కుమార్ స్పష్టం చేసారు.

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అభివృద్ధికి అగ్రగామిగా తీర్చిదిద్దడమే పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులకు రాజకీయాలు, పార్టీలు పక్కనపెట్టి ప్రజల అభ్యున్నతి, సంక్షేమం కోసం కలిసికట్టుగా అందరితో కలిసి పనిచేస్తున్నానని మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. జాతీయ ఉపాధి పథకం కింద ఈ నిధులను తీసుకువచ్చినట్లు మంత్రి విలేకరులకు తెలిపారు.

# టెట్-2025 ప్రాథమిక కీ విడుదల

## 8 వరకు అభ్యంతరాలు స్వీకరణ

### పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జూన్ 18 నుంచి 30 వరకు నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)-జూన్-2025 పరీక్షలకి సంబంధించిన ప్రాథమిక కీని పాఠశాల విద్య శాఖ శనివారం విడుదల చేసింది. ప్రాథమిక కీపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 8 సాయంత్రం 5 గంటల వరకు నమోదు చేసుకోవాలని పాఠశాల విద్య డైరెక్టర్, టెట్-2025 ఛైర్మన్ నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా టెట్ పరీక్షలు జూన్ 18 నుంచి 30 వరకు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షలకు 74 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షలను 9 రోజులపాటు 18 సెషన్‌లలో నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 66 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహిం చారు. టెట్ పరీక్షలకు రాష్ట్రంలో 1,83,653 దరఖాస్తులు రాగా.. అందులో పేపర్-1కి 63,261 మంది, పేపర్-2కి 1,20,392మంది దరఖాస్తు చేసుకున్నారు. 2 పేపర్లకు 15,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-1 పరీక్షలకి 63,261 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 47,224 మంది (74.65 శాతం) పరీక్షకు హాజరయ్యారు. పేపర్-2లో భాగంగా గణితం అండ్ సైన్స్ పరీక్షకి 66,686 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 48,998 మంది(73.48 శాతం) మంది హాజరయ్యారు. పేపర్-2 సోషల్ స్టడీస్‌కి 53,706 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 41,207 మంది(76.73శాతం) పరీక్షలకి హాజరయ్యారు.

# అసెంబ్లీ చర్చకు రమ్మంటే ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతానంటున్న కెసిఆర్

## కాంగ్రెస్ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** గోదావరి, కృష్ణా జలాలపై అసెంబ్లీలో చర్చ పెడదామని సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుంటే కెసిఆర్ మాత్రం ప్రెస్‌మీట్ పెడతా అంటున్నారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించిన సామ స్పందించారు. కెసిఆర్ అసెంబ్లీకి వస్తే బతుకు గోదాట్లో దూకినట్లే అని భాష్యం చెప్పారు. కృష్ణాలో మునిగినట్లేననే విషయం బిఆర్ఎస్ నేతలకు తెలియదన్నారు. అందుకే రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చర్చ విషయాన్ని బిఆర్ఎస్ నేతలు కెసిఆర్ దృష్టికి తీసుకువెళ్తే కెసిఆర్ మాత్రం నేను ప్రెస్‌మీట్ పెడతానని చెబుతున్నారని ఈ నిర్ణయంతో గులాబీ నేతలు తలగొక్కుంటున్నారని సెటైర్ వేశారు. ప్రెస్‌మీట్ అయితే అడిగేవాళ్లు ఉండరు. చెప్పాల్సింది చెప్పి దులుపుకుని పోవచ్చనే కెసిఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని సామ విమర్శించారు. ఎవరైనా మీడియా ప్రతినిధి ప్రశ్న వేస్తే 'ఏ పేపర్ నీది.. ఏం తెల్సు నీకు.. నాకంటే తెల్విఉందా నీకు' అంటూ రిపోర్టర్‌పైనే కెసిఆర్ ఎదురుదాడి చేసుడు మనకు తెలిసిందే కదా అంటూ పోస్టు చేశారు.

# గుర్తుకుల సీట్ల విషయంలో దళారులను నమ్మొద్దు

## పైరవీకారులతో తస్మాత్ జాగ్రత్త

## పారదర్శకంగా సీట్లు కేటాయింపు

### సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎస్‌సి అభివృద్ధి శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకులాల్లో సీట్ల విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని ఎస్సీ గురుకుల సొసైటీ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసింది. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాలయాల్లో అడ్మిషన్ల విషయంలో వివిధ తరగతుల్లో సీట్లు ఇప్పిస్తామని కొంతమంది మధ్య దళారులు డబ్బులు తీసుకొని మోసపోయిన సంఘటనలు సొసైటీ దృష్టికి రావడం జరిగిందని.. కాబట్టి తల్లిదండ్రులు అలాంటి మోసగాళ్ల చేతిలో వారు చెప్పే మాట లను నమ్మవద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియపరుస్తున్నట్టు సొసైటీ ప్రకటించింది. కొంత మంది మధ్య దళారులు పలువురు ప్రజా ప్రతి నిధులైన ఎమ్మెల్యే, ఎంపీల పేరుతో ఉన్నా లెటర్ ప్యాడ్లు ఉన్నా వాటిని ఫ్యాబ్రికేటెడ్‌గా తయారుచేసి తల్లిదండ్రులను మోసం చేస్తున్న సంఘటనలు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఇలా మోసం చేసిన వారిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలనీ సంస్థ సూచించింది. గతంలో సాంఘిక సంక్షేమ గురుకులాలలో ఇష్టారీతిగా సీట్లను అమ్ముకోవడం, డబ్బులు ఇచ్చినవారికి, మధ్య దళారుల చేత పైరవీ చేసిన వారికీ సీట్లను కేటాయించిన సంఘటనలు పలు పిర్యాదులు రావడం జరిగిందని... దాంతో ఈ ఏడాది 2025-26 విద్యాసంవత్సరం నుండి గురుకులాల్లో ఎంతో పారదర్శకంగా అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించడం జరిగింది. తద్వారా అట్టడుగు వర్గాలకు అలాగే ఆదాయం తక్కువ వున్న నిరుపేదవర్గాల కుటుంబాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. ఇలా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందిరికి ప్రవేశాల కోసం ఫిబ్రవరిలో నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పారదర్శకంగా సీట్లను కేటాయించడం జరిగింది. సీట్లు లభించిన విద్యార్థులకు వారు రిజిస్టర్ చేసుకున్న మొబైల్ ఫోన్లకు సంక్షిప్త సమాచారం అందించడంతోపాటు వాయిస్ మెసేజ్ సైతం పంపించడం జరిగింది. దీంతోపాటు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ అధికారిక వెబ్ సైట్‌లో కుడా మెరిట్ లిస్టును పొందుపర చడం జరిగిందని సంస్థ తెలిపింది. ఇలా అన్ని దశలలో ఎక్కడ ఎలాంటి పొరపాటు లేకుండా పూర్తి పారదర్శకంగా మెరిట్ విద్యార్థులకు సీట్లను కేటాయించడం జరిగిందని.. ఈ నేపథ్యంలో మధ్యదళారులు ఎటు తోచకపోవడంతో ఇప్పుడు పలు మార్గాలను ఎంచుకొని కొందరు అమాయక తల్లిదండ్రులను టార్గెట్‌గా చేసుకొని సీట్లను ఇప్పిస్తామని డబ్బులు దండుకొంటున్నారని పేర్కొం ది. కాబట్టి తల్లిదండ్రులు మోసపోవద్దని.. మెరిట్ విద్యార్థులు రిపోర్ట్ చేసి ఇంకా జాయిన్ కాకపోతే ఏర్పడిన ఖాళీ సీటును తదుపరి మెరిట్ వున్న విద్యార్థిచే భర్తీ చేయబడుతుందని సొసైటీ స్పష్టం చేసింది. అన్ని విషయాలను తల్లిదండ్రు లందరు అర్థం చేసుకొని జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నట్టు సంస్థ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

# కాంగ్రెస్ కార్యకర్తల కృషి ఫలితమే సమరభేరి విజయం

## ప్రమాదంలో పార్టీ కార్యకర్త మృతి బాధాకరం

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** సామాజిక న్యాయ సమరభేరి అద్భుతంగా విజయవంతం కావడానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకుడి కృషి ఫలితమని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభను విజయవంతం చేసేందుకు కార్యకర్త నుంచి రాష్ట్ర నాయకుల వరకు అందరూ అహర్నిశలు కృషి చేశారని ఆయన గుర్తు చేసుకొన్నారు. రాష్ట్రంలో ప్రతి మారుమూల నుంచి నాయకులు సభలో పాల్గొన్నారని పేర్కొన్నారు. సభకు పిలవగానే రాష్ట్ర రాజధానికి వచ్చి రెండు రోజులపాటు ఇక్కడే ఉండి పిసిసి, పిఎసి సమావేశాలలో కార్యవర్గ సమావేశంలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ కేడర్‌కు ఎంతో స్ఫూర్తినిచ్చారని అన్నారు.

ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, కార్యదర్శి విశ్వనాథన్, మంత్రులు అందరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. సామాజిక సమరభేరి సభకు హాజరై తిరుగుప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ కార్యకర్త శ్రీను మృతి చెం దడం బాధాకరమని పిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ, మహేష్‌కుమార్‌గౌడ్ సంతా పం తెలిపారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి మండలం చెన్నైపాలెం గ్రామానికి చెందిన శ్రీను శుక్రవారం సభకు వచ్చి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడం అత్యంత బాధా కరమని పేర్కొన్నారు. పార్టీ కోసం గ్రామ స్థాయిలో విశేషంగా కృషి చేసిన నేతగా ఆయన పాత్రను పిసిసి చీఫ్ కొనియాడారు. శ్రీను కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుంటుబాన్ని కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

# గిరిజనుల సంఖ్యలో కొత్తగూడెం అగ్రస్థానం

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని 33 జిల్లాలలో గిరిజనుల జనాభాను చూస్తే అత్యధికంగా కొత్తగూడెం జిల్లా అగ్రస్థానంలో ఉంది. ఈ జిల్లాలో నాలుగు లక్షల మంది గిరిజన జనాభా ఉన్నట్లు ప్రభుత్వ సర్వేలో వెల్లడైంది. అలాగే 3 లక్షల మందితో మహబూబాబాద్ రెండో స్థానంలోను, 2.25 లక్షలతో ఆదిలాబాద్ మూడో స్థానంలో ఉన్నాయి. ఇక రాష్ట్రంలోని నల్గొండ జిల్లాలో 2.10 లక్షల మంది గిరిజనులు, ఖమ్మంలో 2 లక్షల మందితో అధిక జనాభాను కలిగి ఉన్న జిల్లాగా నమోదైంది. అదేవిధంగా రాష్ట్రంలో లక్ష నుంచి లక్షన్నర మధ్య రంగారెడ్డి, సూర్యాపేట, కొమరం భీమ్, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలు, 50 నుండి లక్ష జనాభా మధ్యన కలిగిన షెడ్యూల్ ట్రైబ్స్ జిల్లాలు వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ మంచిర్యాల, నిర్మల్, ములుగు ఉన్నాయి. వీటితో పాటు, హైదరాబాద్‌లో 50, వేలు, భువనగిరిలో 44 వేలు, వనపర్తిలో 46 వేలు ఎస్టీల జనాభా ఉంది. 20 నుండి 40 వేల మధ్యన గిరిజన జనాభా గలిగిన జిల్లాలు జనగాం, హనుమకొండ, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, నారాయణపేట, జోగులంబ గద్వాల్, కరీంనగర్, పెద్దపల్లి, జోగులాంబ గద్వాల తక్కువ జనాభాతో కలిగి ఉన్న జిల్లాలుగా ఉన్నాయి.

# అసెంబ్లీలో చర్చిద్దాం రా..!




## సిఎం సవాల్‌కు స్పందించని ప్రతిపక్ష నేత

### కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** అసెంబ్లీలో చర్చిద్దాం రా..! సిఎం రేవంత్‌రెడ్డి సవాల్‌కు ప్రతిపక్షనేత కెసిఆర్ స్పందించడంలేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో విచిత్ర పరిస్థితి కనిపిస్తుందని సాధారణంగా ప్రతిపక్ష పార్టీ అసెంబ్లీ సమావేశమ పరచమని అధికార పార్టీని డిమాండ్ చేస్తుందని కానీ ఇక్కడ రివర్స్ ఉందని సిఎం రేవంత్ అసెంబ్లీ పెడతా ప్రతిపక్ష నాయకుడు రావాలి అని కోరుతున్నాడని అన్నారు. ప్రతిపక్షనేత కెసిఆర్ సభకు వస్తా అంటే అసెంబ్లీ పెడతా రండి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరుతున్నా ప్రతిపక్ష నాయకుడు మాట్లాడ కుండా సెకండ్ బెంచ్ లీడర్స్ మాట్లాడు తున్నారని అన్నారు. జాతీయపార్టీకి చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉపప్రాంతీయ పార్టీ ప్రతిపక్షనే కెసిఆర్ మధ్యలో సెకండ్ బెంచ్ కెటిఆర్,హరీష్‌రావులు వచ్చి బోట్స్ క్లబ్ కి ప్రెస్ క్లబ్ కి రా అంటున్నారని రెండు రోజులు పోతే కల్లుదుకాణం కాడికిరా అని అంటారేమో జగ్గారెడ్డి విమర్శించారు. కెటిఆర్ ఆంధ్రోళ్ల ను తిట్టింది నువ్వే,కాలుకు ముళ్ళు గుచ్చుకుంటే నోటితో తీస్తా అన్నది మీరే అని ఆయన ఎద్దేవ చేశారు. కెసిఆర్ గ్రేటర్ ఎన్నికలు రాగానే ఆంధ్రా వాళ్ళ కాళ్ళకు ముళ్ళు గుచ్చుకుంటే పంటితో తీస్తా అన్నావు అప్పుడు నీ అజెండా నీది నీళ్లను దొంగతనం చేసిన వాళ్లను ఇంటికి పిలిచి ఎందుకు మీటింగ్ పెట్టినవు అని నిలదీశారు. రేవంత్ కెసిఆర్ ఇద్దరూ మొదటి బెంచ్ వాళ్ళే అని ఆయనఅన్నాఉ. నువ్వు కోడి కూర పెడితివి అక్కడ పోయి చేపల కూర తిని వస్తిరి అని ఎకసెక్కాలు చేశారు. రేవంత్ గడ్డం పట్టుకుని బతిమి లాడుతున్నారు అసెంబ్లీకి రండి చర్చ చేద్దాం, సలహాలు ఇవ్వండి అంటున్నాడు ఎం ఎల్ ఎ లు చర్చ చేసేది అసెంబ్లీ లోనాఅని ప్రశ్నించారు. కెటిఆర్ దమ్మంటే మీ ప్రతిపక్షనేతతో రాజీనామా చేయించు నీవే లీడర్‌గా వచ్చి చర్చ చేయ్ అన్నారు. మీ నాయన చంద్రబాబు విహెచ్ నాయ కత్వంలో పనిచేశారు. మీ నాయన వైస్ రాయ్ హోటల్‌లో చంద్రబాబుకు సహకరించడంతో రవాణాశాఖ మంత్రి పదవి పొందారని చరిత్రను గుర్తుచేసుకున్నారు.

# రాజస్థాన్‌లో ఫేక్ పోలీస్!

**జైపూర్, జూలై 5:** పోలీస్ ఉద్యోగ పరీక్షల్లో పాస్ కాకపోయినా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రాజస్థాన్ పోలీసు అకాడమీలో చేరిన ఓ యువతి ఏకంగా రెండేళ్లపాటు అక్కడే కొనసాగింది. ఏడాదిగా పరారీలో ఉన్న నిందితురాలు మోనా బుగాలియాను పోలీసులు తాజాగా అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మోనా బుగాలియా అలియాస్ మూలీ దేవి ఎలాంటి రిక్రూట్ మెంట్ పరీక్షల్లో పాస్ కాలేదు. అయినా కూడా అందరి కళ్లు కప్పి ట్రెయినీ పోలీసుగా అకాడమీలో చేరి రెండేళ్ల పాటు కొనసాగింది. 2021లో పరీక్ష రాసి ఫెయిలయ్యాక



ఆమె తన పేరును మూలీ దేవిగా మార్చుకుని తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సృష్టించింది. ఆ తరువాత తాను ఎస్సై పరీక్షలో నెగ్గినట్టు, ఉద్యోగానికి ఎంపికైనట్టు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంది. ఈ క్రమంలోనే కొత్తగా ఎంపికైన ఎస్సైల వాట్సాప్ గ్రూపులో కూడా చేరింది. తనని తాను మునుపటి బ్యాచ్ క్యాండిడేట్‌గా చెప్పుకుంటూ రాజస్థాన్ పోలీసు అకాడమీలోకి చేరింది. స్పోర్ట్స్ కోటాలో జాబ్ వచ్చినట్టు చెప్పుకుంది. ఆ తరువాత రెండేళ్ల పాటు ఆమె పోలీసు అకాడమీలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొంది. ఔట్ డోర్ డ్రిల్స్‌లో పాలుపంచుకుంది. ఉన్నతాధికారులతో కలిసి ఫొటోలకు పోజులిచ్చింది. పోలీసు అధికారిగానే సోషల్ మీడియాలో ఇతర అభ్యర్థుల కోసం స్ఫూర్తివంతమైన కథనాలు పోస్టు చేసేది. ఒకానొక సందర్భంలో ఏకంగా ఐపీఎస్ అధికారుల సమక్షంలో స్టేజిపై ప్రసంగించింది. ఈ క్రమంలోనే కొందరు ట్రెయినీ అధికారులకు ఆమెపై అనుమానం కలిగింది. వారు పైఅధికారులకు ఫిర్యాదు చేయడంతో మోనా ఉదంతం వెలుగులోకి వచ్చింది. పోలీసు శాఖ అంతర్గత విచారణ సందర్భంగా ఆమె తను చేసిన నేరాన్ని అంగీకరించింది. కుటుంబాన్ని ఇంప్రెస్ చేసేందుకు, పోలీస్ జాబ్‌తో వచ్చే సౌకర్యాలను ఎంజాయ్ చేసేందుకు ఈ నాటకమాడినట్టు తెలిపింది. ఈ క్రమంలోనే తప్పించుకుని పారిపోయిన ఆమె చివరకు పోలీసులకు చిక్కింది. ఇక ఆమె అద్దెకు ఉంటున్న ఇంటి నుంచి పోలీసులు వివిధ రకాల నకిలీ డాక్యుమెంట్లు, రూ.7లక్షలు, పోలీసు అకాడమీకి చెందిన ప్రశ్నాపత్రాలు, మూడు ఫేక్ యూనిఫామ్‌లను స్వాధీనం చేసుకున్నారు. బుగాలియా స్వస్థలం రాష్ట్రంలోని నాగోర్ జిల్లా నింబాకే బాస్ గ్రామమని తెలిపారు. ఆమె తండ్రి ట్రక్ డ్రైవర్ అని చెప్పారు. ఆమె ప్రభుత్వ పరీక్ష ఏదీ పాస్ కాలేదన్న విషయం అధికారిక రికార్డుల ద్వారా ధ్రువీకరించారు. మరోవైపు, ఈ విషయమై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది సాధారణ పొరపాటు కాదని వ్యవస్థాగత లోపమని కొందరు సామాజిక కార్యకర్తలు మండిపడుతున్నారు.



## హైదరాబాద్‌లో ఇక 'స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీం

### ప్రత్యేక శిక్షణ, ఆపై నూతన పోలీస్‌డ్రెస్సులు

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా 'స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీం రంగంలోకి దిగింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని సెక్రేటేరియట్ వద్ద భద్రత విధుల్లో కనిపించారు. స్వాట్ బృందం ప్రధానంగా ధర్నాలు, ర్యాలీలు, ఇతర బహిరంగ సభలలో మహిళా నిరసనకారులను సమర్థవంతంగా అడ్డుకుంటారు. ఇక ముఖ్యమైన కార్యక్రమాలు, పండుగల సమయాల్లోనూ మోహరించనున్నారు. స్పెషల్ టీమ్స్ విధులపై అధికారులు సరికొత్త ప్రణాళికను రూపొందించారు. విధులు, ఆందోళనకారులు ఎదుర్కోవడంపై రెండు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సాధారణ పోలీస్ యూనిఫాం కాకుండా సరికొత్త డ్రెస్‌కోడ్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక ఫోర్స్ టీంను జూన్ 3న సీపీ సీవీ.ఆనంద్ ప్రారంభించింది తెలిసిందే. ఈ బృందంలో 35 మంది మహిళా పోలీసులు ఉండగా.. నిరాయుధ పోరాటంలోనూ శిక్షణ అందించారు.




## తొలి త్రైమాసికంలో నూరు శాతం బొగ్గు రవాణా

### సింగరేణి సిఎండి బలరామ్

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి క్వార్టర్‌లో బొగ్గు రవాణాలో 100 శాతం, బొగ్గు ఉత్పత్తిలో 99 శాతం లక్ష్యాలను సాధించినట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. ఏప్రిల్ నుండి జూన్ నెల వరకు బొగ్గు రవాణా లక్ష్యం 160 లక్షల టన్నులు కాగా, 103 శాతం తో కంపెనీ 166 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసిందన్నారు. అలాగే బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 160 లక్షల టన్నులు కాగా, 99 శాతం తో 159.9 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి సాధించిందని చెప్పారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వర్షాకాలంలో కూడా ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉత్పత్తి కుంటు పడకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జులై నెలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు రోజుకు 2.15 లక్షల టన్నుల బొగ్గు రవాణా, 1.80 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించాలన్నారు.

కొత్తగూడెంలో వీకే ఓపెన్ కాస్ట్ గని భూమి పూజ కార్యక్రమాన్ని ఈ నెలాఖరులో నిర్వహించాలని సూచించారు. ఇల్లందు, గోలేటి కోల్ మైన్ కు పర్యావరణ, అటవీ శాఖ అనుమతులకు సంబంధించి ప్రయత్నాలు వేగవంతం చేయాలన్నారు. వినియోగదారులకు ఇస్తామన్న గ్రేడ్ బొగ్గును సరఫరా చేయడానికి ప్రతీ ఏరియాలో సిహెచ్ పి లలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అలాగే రక్షణకు సంబంధించి ప్రతీ గనిలో రక్షణ ఆడిట్లను నిర్వహించాలని, లోపాలు లేకుండా సవరించాలని స్పష్టం చేశారు.

## ఆదిత్య ఫార్మసి ఎండి నరసింహామూర్తి రాజు ఆత్మహత్య

**విజయవాడ. జూలై5, ప్రభా తవార్తప్రతినిధి:** ఆదిత్య ఫార్మసి ఎండి నరసింహా మూర్తిరాజు ఆత్మహత్య చేసుకున్నారు. విజయ వాడ అయోధ్యనగర్ క్షత్రియభవన్‌లో ఆయన బలవన్మరణానికి పాల్పడినట్టు పోలీ సులు గుర్తించారు. గతేడాది స్నేహితుడి హత్య కేసులో నిందితుడిగా ఉన్న నరసిం హమూర్తిరాజు ఇటీవలే బెయిల్‌పై బయ టకు వచ్చారు. నరసింహమూర్తి రాజు గత రాత్రి హైదరాబాద్ నుండి విజయవాడకు వచ్చారు. ఈ క్రమంలో ఆయన అనూ హ్యంగా ఆత్మహత్యకు పాల్పడ్డారు. రూ.కోట్ల అప్పుల్లో తాను ఉన్నట్లు రాజు రాసిన సూసైడ్ లెటర్‌ను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నరసింహా మూర్తి రాజు మృతదేహాన్ని పోలీసులు ఆసు పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణా లపై ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# 2036 ఒలింపిక్స్ పతకాలే లక్ష్యంగా పనిచేయాలి

### క్రీడాభివృద్ధి కొరకు క్షేత్రస్థాయి పర్యటనలు

### క్రీడా శాఖపై సమీక్ష నిర్వహించిన మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 5:** క్రీడలను శిఖర స్థాయికి చేర్చాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు క్రీడా శాఖ పనితనంలో కొత్తదనం కనిపించాలని రాష్ట్ర యువజన సర్వీసులో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం ఆయన సచివాలయంలోని తన చాంబర్‌లో క్రీడా శాఖ పై స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ, గతంలో జరిగిన వైఫల్యాలను అలసత్వాన్ని పక్కనపెట్టి నూతన వొరవడితో క్రీడా శాఖ పనిదానంలో కొత్తదనం కనిపించాలని, సీఎం రేవంత్ ఆలోచనల మేరకు క్రీడా శాఖ పనితనం ఉన్నత స్థాయిలో ఉండాలని ఆయన సూచించారు. 2036 ఒలంపిక్స్‌లో పతకాలు లక్ష్యంగా తెలంగాణ క్రీడా శాఖ పనిచేయాలని, చిత్తశుద్ధితో పనిచేస్తే లక్ష్యాన్ని సాధించ డం సులభతరమైనేనని అన్నారు. క్రీడారంగంలో సమూల మార్పు కోసం కార్యాలయాల్లో కూర్చుంటే సాధ్యం కాదని కార్యక్షేత్రంలోకి వెళ్లాలని ఆయన అధికారులకు సూచించారు. క్రీడా కార్యక్రమాల విజయవంతం కోసం క్రీడా శాఖ పని తీరు మెరుగుదల కోసం క్షేత్రస్థాయిలో పర్యటిస్తామని అదిలాబాద్ కరీంనగర్‌తో పాటు ప్రతి అకాడమీని సందర్శించి విద్యార్థులతో కోచులతో విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చిస్తామని తెలిపారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధి కోసం క్రీడారంగా నిపుణులు నిష్ణాతులతో చర్చిస్తామని, మరి సలహాలు సూచనలు తీసుకుంటూ ముందుకెళ్తామని, త్వరలో అన్ని క్రీడా సంఘాల ప్రతినిధులతో కోచులతో క్రీడారంగా నిపుణు లతో విడివిడిగా సమావేశమై వారి ఆలోచనలను తీసుకొని క్రీడాభివృద్ధికి ముందుకెళ్తామన్నారు. క్రీడల అభివృద్ధి కోసం క్రీడా శాఖ ఒకటే కృషి చేస్తే సరిపోదని, పాఠశాల విద్యాశాఖతో సమన్వయం చేసుకొని పాఠశాల స్థాయి నుండే క్రీడాకారులను గుర్తించాలని గురుకుల విద్యాలయల్లో ఉన్న మంచి ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ యువజన అభివృద్ధి పర్యాటక, క్రీడలు ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సోనీ బాలాదేవి, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు ఇంజనీరింగ్ విభాగం ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



# నేడు జస్టిస్ పిసి ఘోష్ రాక

### ప్రభుత్వం కేబినెట్ తీర్మానాలు ఇవ్వకపోవడంతో ఆలస్యం

### కానున్న నివేదిక?

**హైదరాబాద్, జూలై 5,ప్రభాతవార్త:** కాళేశ్వరం వైఫల్యంపై న్యాయ విచారణ జరుపుతున్న జస్టిస్ పిసిఘోష్ ఆదివారం హైదరాబాద్‌కు రానున్నారు. కాళేశ్వం ప్రాజెక్టులోని మేడిగడ్డ ఏడవ బ్లాక్‌లో పియర్స్ కుంగుబాటు, సుందిళ్ళ అన్నారం బ్యారేజిలు బుంగలు పడటంపై ఆయన గత 17 నెలలుగా విచారణ జరుపుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల కారణంగా ఆయన విచారణ ఆలస్యంగా మొదలైంది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌తో సంబంధం ఉన్న కాంట్రాక్టర్లను, ఇంజనీర్లను, ఐఎఎస్ అధికారులను, రిటైర్డు ఐఎఎస్, రిటైర్డు ఇంజనీర్లను ప్రశ్నించారు. ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్, ఆర్థిక మంత్రి ఈటెలరాజేందర్, నీటిపారుదలశాఖ ఆర్థిక మంత్రిగా బాధ్యతలు వహించిన హరీష్‌రావుల నుంచి కూడా వాగ్మూలం తీసుకొన్నారు. క్యాబినెట్ నిర్ణయం మేరకు అంతా జరిగిందని వీరు తెలుపడంతో ఆ పత్రాలు అందించాలని పిసిఘోష్ కమిటి తెలంగాణ ప్రభుత్వంను కోరింది. కేబినెట్ తీర్మాణం జరుగలేదని ఆనాటి మంత్రిమండలిలో సభ్యులుగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈటెల రాజేందర్ దానికి ప్రతిగా కేబినెట్ సబ్‌కమిటీలో తుమ్మలనాగేశ్వరావు కూడా ఒక సభ్యుడని వ్యక్తిగత వివాదాలు వేరు మంత్రి మండలి సమిష్టి బాధ్యత వేరని ఆనాటి సంఘటన తప్పుదారి పట్టించడం తగదని వ్యాఖ్యానించారు. మంత్రిమండలి సమిష్టి బాధ్యత రాజకీయాల ఎత్తుగడలలో మలినం కావొద్దని ఈటెల రాజేందర్ తనపై విమర్శలు చేసిన తుమ్మలకు సమాధానం ఇవ్వడంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడు కేబినెట్ నిర్ణయం జరిగిందా జరుగలేదా అనే అంశపై అనిశ్చితి నెలకొంది. ఈ క్రమంలో క్యాబినెట్ తీర్మాణాలు ఇవ్వడానికి ప్రత్యేకంగా మంత్రి మండలి సమావేశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేశారు. జూన్ 30న మంత్రి మండలి తీర్మాణాలు ఇస్తామని సంకేతాలు వెలువరించారు. ఐతే ఇప్పటికి మంత్రి మండలి తీర్మాణాల కాపీ ఏదీ కూడా పిసిఘోష్‌కు పంపనట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి మంత్రి మండలి తీర్మాణాలు వస్తే కానీ పిసిఘోష్ ఇచ్చేనివేదికకు స్పష్టమైన చట్టబద్ధత వచ్చే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో పిసిఘోష్ రూపొందించే నివేదికపై కూడా ఇది ప్రభావం చూపుతుంది. జూలై 31తో ఆయన విచారణ గడువు ముగిసి పోతుంది. ఈ సారి జస్టిస్ నాలుగు రోజుల పాటు హైదరాబాద్‌లో ఉంటారని తెలిసింది. ఈ నాలుగు రోజుల్లో నివేదిక ప్రభుత్వంకు అందించడం సాధ్యమవుతుందా అనేదానిపై అనిశ్చితి నెలకొంది.

## స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో కీలక పరిణామం

### మూడు రోజుల పోలీసు కస్టడీకి పూర్ణచందర్‌నాయక్

### నాంపల్లి క్రిమినల్ కోర్టు తీర్పు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూలై 5, ప్రభాతవార్త:** టీవీ యాంకర్ స్వేచ్ఛ ఆత్మ హత్య కేసులో శనివారం కీలకపరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే ఈ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న పూర్ణచందర్‌నాయక్‌ను జూడీషియల్ కస్టడీకి అనుమతించాలని నాంపల్లి కోర్టును చిక్కడపల్లి పోలీసులు ఆశ్రయించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన కోర్టు మూడు రోజుల జూడీషియల్ కస్టడీకి అనుమతిస్తూ తీర్పును వెలువరించింది. కోర్టు ఆదేశాల మేరకు చంచల్‌జైలు నుంచి పూర్ణచందర్ నాయక్‌ను పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు తీర్పును అనుసరించి మూడు రోజుల పాటు తమ కస్టడీలోకి తీసుకున్నట్లు చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.రాజూనాయక్ వివరించారు. మరింత లోతుగా సమాచారం రాబట్టేందుకు పూర్ణచందర్ నాయక్‌ను జూడీషియల్ కస్టడీకి కోర్టును కోరగా మూడు రోజుల పాటు విచారణ జరిపేందుకు అనుమతించినట్లు వివరించారు. దీంతో ఈ మూడు రోజుల పాటు పోలీసులు ఏఏ అంశాలపై పూర్ణచందర్‌నాయక్ ప్రశ్నించడంతోపాటు మరింత లోతుగా కేసు వివరాలు రాబట్టేందుకు చర్యలకు ఉపక్రమించ బోతున్నారు.

## నకిలీ వైద్యులపై కొనసాగుతున్న టిఎంసి దాడులు

### 8 మందిపై కేసులు నమోదు

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న నికలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ దాడులు కొనసాగుతున్నాయి. మెడికల్ కౌన్సిల్‌కి అనుమావనం వచ్చిన ప్రతిచోట దాడులను నిర్వహిస్తోంది. అందులో భాగంగా శనివారం నిర్వహించిన తనిఖీల్లో 8 మంది నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేశారు. హైదరాబాద్ నగరంలోని బౌరంపేట్, దుండిగల్, సూరారం పరిసర ప్రాంతాల్లో అర్హతలేని వ్యక్తులు ఆధునిక అల్లోపతి వైద్యం చేసి ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టి ప్రజలను మోసగిస్తున్నట్టు తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కి సమాచారం అందింది. దీంతో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ జి శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ కెయుఎన్ విష్ణు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మొత్తం 8 మంది అర్హతలేని వ్యక్తులు అల్లోపతి వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. వారు అధిక స్థాయి యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, పెయిన్ కిల్లర్లు, ఐవీ ఫ్లూయిడ్లు వంటి మందులు వినియోగిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని హానికర స్థాయికి తీసుకెళ్తున్నారు. నకిలీ ప్రాక్టీస్ చేసినవారిపై ఎన్ఎంసి చట్టం సెక్షన్ 34, 54, తెలంగాణ స్టేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ రెగ్యులేషన్ యాక్ట్ సెక్షన్ 22, భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్లు 318, 319 ప్రకారం కేసులు నమోదు చేయనున్నారు. ఈ నకిలీ వైద్యుల సమాచారం వాట్సాప్ నంబర్ 9154382727 ద్వారా ప్రజలు చైతన్యవంతులై తెలియజేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేసినట్టు టిఎంసి పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేష్ కుమార్ తెలిపారు.



## విఆర్‌ఒ, విఆర్‌ఎలకు త్వరలోనే మరోసారి జిపిఒ అర్హత పరీక్ష

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 5:** ప్రతి రెవెన్యూ గ్రామానికి గ్రామ పరిపాలనా అధికారి ఉంటారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమావేశమయ్యారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్రామ పరిపాలనా అధికారుల నియామకాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. వీఆర్వో, వీఆర్‌ఎలుగా పని చేసినవారికి జీపీవోలుగా అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక పరీక్ష ద్వారా 3,454 మంది అర్హత సాధించారని వెల్లడించారు. రెవెన్యూ ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు వీఆర్వో, వీఆర్‌ఎలకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అర్హత పరీక్ష త్వరలోనే నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు.

# 32వ ఎపి న్యూరోకాన్ సదస్సు

### ముఖ్యఅతిథి ఎపి మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** నారాయణ మెడికల్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న 32వ ఏపీ న్యూరో కాన్ సదస్సుకు రెండవ రోజు ముఖ్యఅతిథిగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ హాజరయ్యారు. మంత్రితోపాటు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ శరణి పొంగూరు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి నారాయణ మాట్లాడుతూ సౌత్ ఇండియాలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖ న్యూరాలజీ వైద్యులు అందరూ విచ్చేసి వారి విజ్ఞానాన్ని పంచుకోవడం ఈ సదస్సులో జరుగుతుందని.. ఇందువలన రోగులకు ఎంతో ఉపయోగం చేకూరుతుందని ఇటువంటి సదస్సును నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. శరణి పొంగురు మాట్లాడుతూ సదస్సులో న్యూరాలజీలో వస్తున్న అత్యాధునిక వైద్య విధానాల గురించి పరికరాల గురించి తెలుసుకోవడం జరుగుతుందని.. సుమారు 700 మందికి పైగా వైద్యులు పాల్గొంటున్నారని, 70 మందికి పైగా వక్తులు ప్రసంగిస్తారని తెలిపారు. సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ, నారాయణ హాస్పిటల్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ సౌత్ ఇండియా నుంచి కాకుండా నార్త్ నుంచి కూడా



వైద్యులు వచ్చారని, మూర్ఛ, స్ట్రోక్, బ్యాక్ పెయిన్, పార్కిఇన్‌సన్ జబ్బులకు అందించే వినూత్న వైద్య విధానాల గురించి చర్చించుకోవడం ద్వారా విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవడం జరుగుతుందన్నారు. నెల్లూరుపై, మంత్రి నారాయణపై ఉన్న అభిమానంతో లండన్‌లోని కింగ్స్ కాలేజీ వైద్యులు, నెల్లూరు వాసి డాక్టర్ మెట్టా వినోద్ కుమార్ రావడం ఎంతో సంతోషమన్నారు. కింగ్స్ కాలేజ్.. నారాయణ మెడికల్ కళాశాలతో ఎంవోయూ చేసుకోవడం పార్కిన్సన్ జబ్బుకు అత్యాధునిక చికిత్స పద్ధతులను ఇక్కడ అవలంబించేందుకు సహకరించిన డాక్టర్ వినోద్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ న్యూరో సైన్సెస్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ, అపోలో హాస్పిటల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఏవి రమణమూర్తి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా జబ్బులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నెల్లూరు న్యూరో క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ పిఎస్ రెడ్డి గతంలో రెండు మార్లు ఈ సదస్సు నిర్వహించడం జరిగిందని అయితే ఈసారి ఇంత గొప్పగా నిర్వహించడం ఆనందాన్నిస్తుందన్నారు.

## అక్కడి ప్రభుత్వం కొత్త నిబంధనలు!

## ఉన్నత చదువులకు కెనడా వెళ్లేవారు యేడాదికి సరిపడా నిధులను చూపించాలి..

**ఒట్టావా, జూలై 5:** కెనడా వీసా కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారికి అక్కడి ప్రభుత్వం తాజా అప్‌డేట్ ఇచ్చింది. సెప్టెంబర్ 1 నుంచి దరఖాస్తు చేసుకునే వారికి కొత్త నిబంధనలు వర్తించనున్నాయి. క్యూబెక్ మినహా అన్ని రాష్ట్రాలకు వచ్చే వారు ఈ నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ఈ కొత్త అప్‌డేట్ ఏమిటంటే అంతర్జాతీయ విద్యార్థుల జీవన వ్యయం కోసం అవసరమైన నిధుల మొత్తాన్ని దాదాపు 11శాతం పెంచారు. దీంతో కనీస నిధుల మొత్తం 22.89వేల కెనడియన్ డాలర్లకు చేరుకుంది. కెనడాలో ఉన్నత చదువుల కోసం వెళ్లే విదేశీ విద్యార్థులు ఏడాది పాటు ఆర్థిక అవసరాలకు సరిపడా నిధులు తమ దగ్గర ఉన్నట్లు ఇమిగ్రేషన్ అధికారులకు చూపించాల్సి ఉంటుంది. ఈ పరిమితి ప్రస్తుతం ఒక్కో వ్యక్తికి ఏడాదికి 20,635 డాలర్లుగా ఉండగా ఈ యేడాది సెప్టెంబర్ 1 నుంచి 22,895 డాలర్లకు పెంచింది. భారత కరెన్సీ ప్రకారం కనీస నిల్వ ఇప్పటివరకు సుమారు రూ.13లక్షలుగా ఉండగా అది రూ.14.38 లక్షలకు పెరగనుంది. కుటుంబంతో వచ్చేవారికి ప్రస్తుతం ఒక్కో వ్యక్తికి అదనంగా 5599 డాలర్లు కనీస నిల్వ ఉండాల్సి ఉండగా దానిని 6170కి పెంచింది. అంటే ఇద్దరు వ్యక్తులు ఉంటే 28,502 డాలర్లు, ముగ్గురు ఉన్నట్లయితే 35,040 డాలర్ల కనీస నిల్వలు ఉండాల్సిందే.

# ఢిల్లీ లీడరా! గల్లీ లీడరా?

### వరుస వైఫల్యాలతో కాంగ్రెస్‌లో అసహనం

### ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే శుక్రవారం ఒక సభలో ప్రసంగిస్తూ బిజెపి నాయకులు ఆడా కాదు, మగా కాదు అంటూ చేసిన అసభ్యకర, అభ్యంతరకర, అనాలోచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడు తన స్థాయి మరచి, ఇంతటి నీచమైన వ్యాఖ్యలు చేసి, ఢిల్లీ లీడర్ కాస్తా గల్లీ లీడర్ స్థాయికి దిగజారిపోయారు. ఇది కాంగ్రెస్ పతనానికి మరో నిదర్శనం అన్నారు. 80 ఏళ్ల వయస్సు గల ఖర్గే ఈ స్థాయికి దిగజారుతారని ఎవరూ ఊహించలేదని, ఈ వ్యాఖ్యలు ఆయన సొంతమా? లేక ఎవరైనా ఇచ్చిన స్క్రిప్ట్ చదివారా? అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ వరుస వైఫల్యాలతో కట్టలు తెంచుకున్న అసహనంతోనే, తమ అధినాయకత్వాన్ని ఏమీ అనలేక, చేష్టలుడిగి బిజెపిపై విరుచుకుపడ్డారని భావించాలన్నారు. మోడీ ప్రభుత్వం పిఓకె స్వాధీనం చేసుకోకపోవడాన్ని ఖర్గే తప్పుబట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. భారత్ ఆధీనంలో ఉండాల్సిన కశ్మీర్ పాక్ పరమవడం కాంగ్రెస్ పాపమే కాదా? అన్నారు. 1948లో నెహ్రూ ప్రభుత్వం తప్పిదమే పిఓకెకు పుట్టుకకు కారణం కాదా? ఆరోజు భారత సైన్యాన్ని పిఓకె నుంచి వెనక్కు ఎందుకు రప్పించారో చెప్పగలరా? 1971లోనూ భారత సైన్యం పాకిస్తాన్ పై విజయం సాధించినప్పటికీ, నాటి ప్రధాని ఇందిరా గాంధీ పిఓకె స్వాధీనం చేసుకోలేదు కదా? పైగా బందీలుగా పట్టుబడిన 90వేల మంది పాక్ సైనికులను ఎలాంటి షరతుల్లేకుండా విడిచిపెట్టారని, కానీ, మోడీ ప్రభుత్వం పహల్గాం దాడి తర్వాత పిఓకెలో ఉన్న ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసిందన్నారు. ఆపరేషన్ సిందూర్, అంతకుముందు బాలాకోట్ వైమానిక దాడులు, సర్జికల్ స్ట్రైక్స్.. మోడీ పాలనలో వృద్ధి చెందుతున్న భారత సామర్థ్యానికి నిదర్శనం అని అన్నారు. యుపిఎ పాలనలో ఏనాడైనా ఉగ్రదాడులకు జవాబిచ్చారా? ముంబై దాడులు, పార్లమెంటుపై దాడి, ఎన్నో బాంబు పేలుళ్లు జరిగినా ఏమీ చేయలేక అన్నీ ముడుచుకొని మౌనం దాల్చడం వాస్తవం కాదా? అని అడుగుతున్నాను. మోడీ ప్రభుత్వం భారత సైన్యానికి స్వేచ్ఛనిచ్చి ఉగ్రదాడులకు దీటుగా బదులిస్తే, మీరు, మీ నాయకులు రాహుల్ గాంధీ సర్జికల్ స్ట్రైక్స్ ఆధారాలు చూపించండి, ఆపరేషన్ సింధూర్‌లో కూలిపోయిన యుద్ధ విమానాల లెక్క చెప్పండి అంటూ పాకిస్తాన్ భాషలో మాట్లాడారని అన్నారు. రాజ్యాంగ పీఠికలోని సెక్యులర్, సోషలిస్ట్ పదాల విషయంలోనూ ఖర్గే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. 1975లో ప్రతిపక్ష నాయకులను జైల్లో పెట్టి మరీ కాంగ్రెస్ 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలో సవరణలు చేసింది. పీఠికలో చేర్చిన సెక్యులర్, సోషలిస్ట్ పదాల గురించి బిజెపి ఏనాడూ ఏమీ అనలేదు. 1949లో ఆమోదించిన రాజ్యాంగ పీఠికలోని మూల అంశాల్లో సోషలిజం, సెక్యులరిజం పదాలు భాగం కాదని, వాటిపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని కొందరు ఆర్ఎస్ఎస్ పెద్దలు మాట్లాడటం వారి వ్యక్తిగత అభిప్రాయం. దీనిని బిజెపికి ఆపాదించడం బట్ట కాల్చి మీద వెయ్యడమే. గత లోక్ సభ ఎన్నికల సందర్భంలోనూ, బిజెపి గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లు రద్దు చేస్తారని కాంగ్రెస్ భయంకరమైన విష ప్రచారానికి తెరలేపింది. ఇప్పుడు తెలంగాణలో వైఫల్యాలను, అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు మళ్లీ అదే తరహా దుష్ప్రచారం చేస్తోంది. తెలంగాణలో 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్కటీ అమలు చేయక ప్రజలను నిట్టనిలువునా మోసం చేసింది. ప్రభుత్వం ఏర్పాటుచేసిన 100 రోజుల్లో అన్ని హామీలను అమలు చేస్తామని రాహుల్, సోనియా, ఖర్గే లేఖలు రాయడాన్ని, హామీ పత్రాలు ఇవ్వడాన్ని, అబద్ధపు వాగ్దానాలు చేయడాన్ని ప్రజలు నిలదీస్తున్నారు. ఎక్కడిక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, నాయకులను అడ్డుకుంటున్నారు. దీని నుంచి దృష్టి మళ్లించేందుకు ఖర్గే బిజెపిపై అర్థం పర్థం లేని విమర్శలు చేస్తున్నారు. బిజెపి మేనిఫెస్టోలో లేని రూ.15 లక్షలు ఇస్తామన్న అబద్ధాన్ని పదేపదే వల్లెవేయడం కూడా వారి దృష్టి మళ్లింపు రాజకీయంలో భాగమే. తనలో గూడుకట్టుకున్న నిరాశ, నిస్పృహలతో అబద్ధాలు వల్లె వేస్తూ మోసం చేసిన ఖర్గే తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి. లేకపోతే, తెలంగాణ ప్రజల ఆగ్రహ జ్వాలలో కాంగ్రెస్ కొట్టుకుపోవడం ఖాయమన్నారు.

## పుతిన్ ప్రజలను చంపాలనే కోరుకుంటున్నారు

### కాల్పుల విరమణకు ససేమిరా అన్న పుతిన్‌పై ట్రంప్ అసహనం

**వాషింగ్టన్, జూలై 5:** ఉక్రెయిన్‌పై రష్యాతో యుద్ధ విరమణ చేయించడానికి అమెరికా అధ్యక్షుడు అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడిన తర్వాత అసంతృప్తి వ్యక్తం చేస్తూ పుతిన్ కేవలం ప్రజలను చంపాలనుకుంటున్నారని అన్నారు. రష్యాపై కొత్త ఆంక్షలు విధించే అవకాశం ఉందని ట్రంప్ సంకేతం ఇచ్చారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ ఉక్రెయిన్ యుద్ధంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో జరిగిన టెలిఫోన్ సంభాషణ పట్ల తాను చాలా అసంతృప్తిగా ఉన్నానని అన్నారు. పుతిన్ కేవలం ప్రజలను చంపడం కొనసాగించాలనుకుంటున్నారని యుద్ధాన్ని ఆపడానికి సిద్ధంగా లేరని ట్రంప్ ఆరోపించారు. మీడియాతో ట్రంప్ మాట్లాడుతూ ఈ పరిస్థితి చాలా కష్టం. నేను పుతిన్‌తో మాట్లాడాను, కానీ అతను ఇంకా యుద్ధం నుండి వెనక్కి తగ్గడానికి ఇష్టపడటం లేదు. కేవలం ప్రజలను చంపాలనుకుంటున్నాడు, ఇది సరికాదని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. రష్యాపై మరింత కఠినమైన ఆంక్షలు విధించే అవకాశం తాను రష్యాపై కఠినమైన ఆంక్షలను పరిశీలిస్తున్నామని డొనాల్డ్ ట్రంప్ సంకేతం ఇచ్చారు. వ్లాదిమిర్ పుతిన్‌ను ఒప్పించేందుకు గత 6 నెలలుగా ఈ ఆంక్షలను వాయిదా వేసినట్లు వెల్లడించారు. మేము ఆంక్షల గురించి మాట్లాడుతున్నాం. అవి ఇప్పుడు అమలు చేయబడవచ్చని పుతిన్ అర్థం చేసుకున్నాడని ట్రంప్ అన్నారు. డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో కూడా వ్యూహాత్మక చర్చలు జరిపారు. అమెరికా నుంచి అందే సైనిక సహాయంపై పెరుగుతున్న ఆందోళనల మధ్య ఉక్రెయిన్ వైమానిక రక్షణను బలోపేతం చేయడానికి ఇద్దరు నాయకులు అంగీకరించారు. రష్యా ఇప్పటివరకు చేసిన అతిపెద్ద డ్రోన్, క్షిపణి దాడి తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు జెలెన్‌స్కీ తెలిపారు. జర్మన్ ఛాన్సలర్‌తో కూడా మాట్లాడిన ట్రంప్ జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడ్రిచ్ మెర్జ్‌తో కూడా తాను విడిగా మాట్లాడినట్లు ట్రంప్ తెలిపారు.

### పారా ఆర్చరీ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో

## మహిళల కాంపౌండ్, మిక్స్‌డ్ జట్లకు స్వర్ణాలు


### ఒక్క రోజే భారత్ ఖాతాలో 7 పతకాలు




**న్యూఢిల్లీ:** పారా ఆర్చరీ ఆసియా ఛాంపియన్‌షిప్-2025లో భారత మహిళల కాంపౌండ్, మిక్స్‌డ్ రికర్వ్ జట్లు స్వర్ణం సాధించాయి. మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో శీతల్ దేవి, జ్యోతి స్వర్ణం సాధించగా, హర్విందర్ మరియు భావన మిక్స్‌డ్ రికర్వ్ టీమ్ టైటిల్‌ను గెలుచుకున్నారు. శనివారం చైనాలోని బీజింగ్‌లో జరిగిన 2025 పారాఆర్చరీ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత పారాఆర్చర్లు మహిళల కాంపౌండ్ టీమ్ మరియు మిక్స్‌డ్ రికర్వ్ టీమ్ ఈవెంట్‌లలో రెండు బంగారు పతకాలు సహా ఏడు జట్టు పతకాలను గెలుచుకున్నారు. మహిళల టీమ్ కాంపౌండ్‌లో శీతల్ దేవి మరియు జ్యోతి ద్వయం చైనాపై 148-143 తేడాతో విజయం సాధించి స్వర్ణం సాధించగా, హర్విందర్ మరియు భావనలతో కూడిన భారత మిక్స్‌డ్ రికర్వ్ జట్టు షూట్ ఆఫ్‌లో 5-4 తేడాతో చైనాను ఓడించి 0-4 తేడాతో అసాధారణంగా పునరాగమనం చేసింది. మరోవైపు, 3భారతజట్లు పురుషుల రికర్వ్ఓపెన్, పురుషులకాంపౌండ్ ఓపెన్, మిక్స్‌డ్ కాంపౌండ్ ఓపెన్ తమ బంగారు పతక మ్యాచ్‌లను గెలవడంలో విఫలమయ్యాయి, రజత పతకాలతో సరిపెట్టుకున్నాయి. హర్విందర్ మరియు వివేక్ చికారాతో కూడిన పురుషుల రికర్వ్ జట్టు విజయానికి చాలా దగ్గరగా వచ్చింది కానీ చివరికి చైనా చేతిలో (4-5) ఓడిపోయింది, అక్కడ చైనా 18కి బదులుగా వారు 17 మాత్రమే షూట్ చేయగలిగారు. అంతకుముందు, రాకేష్ కుమార్ రెండు రజత పతకాలను గెలుచుకున్నాడు, మొదట శ్యామ్ సుందర్ స్వామితో కలిసి పురుషుల కాంపౌండ్ ఓపెన్ జట్టులో, ఆపై జ్యోతితో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ ఓపెన్ ఈవెంట్‌లో వాటిని సాధించాడు.

### యునైటెడ్ ర్యాపిడ్ బ్లిట్జ్ ఈవెంట్‌లో

## గుకేష్ విజయం




**న్యూఢిల్లీ:** క్రొయేషియాలోని జాగ్రెబ్‌లో జరిగిన 2025 సూపర్ యునైటెడ్ ర్యాపిడ్ మరియు బ్లిట్జ్ ఈవెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ దొమ్మరాజు తన ఆధిపత్యాన్ని కొనసాగించాడు, ర్యాపిడ్ ఈవెంట్ ముగింపులో అతను మూడు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించాడు. ప్రస్తుత క్లాసికల్ ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేష్‌ను ఈ ఈవెంట్‌కు ముందు మైదానంలో బలహీనమైన ఆటగాళ్లలో ఒకరిగా ప్రపంచ నంబర్ 1 మరియు ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన మాగ్నస్ కార్ల్‌సెన్ అభివర్ణించాడు. అయితే, 19 ఏళ్ల గుకేష్ ర్యాపిడ్ ఈవెంట్‌ను 18 పాయింట్లకు 14 పాయింట్లతో ముగించడం ద్వారా తన విమర్శకుల వాదన తప్పని నిరూపించాడు. బ్లిట్జ్ విభాగం ప్రారంభమయ్యే ముందు అతను రెండవ స్థానంలో ఉన్న జాన్ క్రిస్టోఫ్ డుడా కంటే మూడు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నాడు. అదే సమయంలో భారత ఆటగాడు అంతగా రాణించలేదు, డూడాతో జరిగిన తొలి మ్యాచ్‌లో ఓడిపోయాడు కానీ దాన్ని అధిగమించి అద్భుతంగా పుంజుకున్నాడు. ఈ నేథ్యంలో జరిగిన రాపిడ్ గేమ్‌ల చివరి సెట్‌లోకి అడుగుపెట్టే క్రమంలో కార్ల్‌సెన్‌పై గుకేష్ ఘన విజయంతో సహా వరుసగా ఐదు విజయాలు నమోదు చేశాడు.





### వింబుల్డన్ మిక్స్‌డ్ డబుల్స్..

## దూసుకుపోతున్న భాంబ్రీ జోడీ

**న్యూఢిల్లీ:** వింబుల్డన్ మిక్స్‌డ్ డబుల్స్ టోర్నమెంట్‌లో భారత్ డబుల్స్ స్పెషలిస్ట్ యుకీభాంబ్రీ జోడీదూసుకుపోతోంది. అలాగే పురుషుల డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీ కూడా పురోగతి సాధించి, భారత ఆశలను సజీవంగా ఉంచాడు. 2025 వింబుల్డన్ మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో భారత జోడీ యుకీ భాంబ్రీ మరియు చైనా జోడీ జియాంగ్ జిన్యు రెండో రౌండ్‌కు చేరుకున్నారు. అమెరికా ద్వయం నికోల్ మెలిచార్ మార్టినెజ్ మరియు క్రిస్టి యన్ హారిసన్ ద్వయంపై ఆధిపత్యం సంపాదించింది. కోర్టు 16లో ఆడుతున్న ఇండోచైనీస్ జంట ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో విజయం సాధించింది. అమెరికా ద్వయంపై 6-3, 1-6 తేడాతో భాంబ్రీ, జియాంగ్ జంట గెలుపొం దింది. ఈ మ్యాచ్ మొదటి సెట్‌లో భాంబ్రీ మరియు జియాంగ్ బలంగా రాణించారు, ప్రారంభంలోనే సర్వ్‌పై ఆధిపత్యం చెలాయించారు. కానీ రెండవ సెట్‌లో అమెరికన్లు తిరిగి దూసుకెళ్లి, 6-1 సెట్‌తో పోటీని సమం చేశారు. పోటీ ఒక్కో సెట్ తో ముగిసినందున, మ్యాచ్ టైబ్రేక్ ఉత్కంఠభరితంగా సాగింది. భాంబ్రి, జియాంగ్ జోడి తమ స్థానాన్ని మరింత మెరుగ్గా నిలుపు కుని 10-6 తేడాతో విజయాన్ని సాధించి ముందుకు సాగారు. ఈ ఫలితం ఈ సంవత్సరం ఎస్‌డబ్ల్యూ19 లో భాంబ్రీకి మరో సానుకూల అడుగును సూచిస్తుంది. 32 ఏళ్ల అతను తోటి భారతీయుడు రిత్విక్ బొల్లిపల్లితో కలిసి పురుషుల డబుల్స్ ఈవెంట్‌లో రెండవ రౌండ్‌కు చేరుకున్నాడు, రెండు డబుల్స్ డ్రాలపై భారత ఆసక్తిని సజీవంగా ఉంచాడు. అలాగే పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో భాంబ్రి మరియు బొల్లిపల్లితో కలిసి ఎన్ శ్రీరామ్ బాలాజీ ఆడిన ఒక రోజు తర్వాత ఈ విజయం కూడా జరిగింది. మెక్సికోకు చెందిన మిగ్యుల్ రేయెస్‌వారెలాతో కలిసి, బాలాజీ లెర్నర్ టియెన్ మరియు అలెగ్జాండర్ కోవాసెవిచ్‌లతో కూడిన అమెరికన్ జట్టుపై క్లినికల్ ప్రదర్శన ఇచ్చి 6-4, 6-4 తేడాతో విజయం సాధించారు. ఈ జంట మ్యాచ్‌ను ముగించడానికి కేవలం 71 నిమిషాలు మాత్రమే పట్టింది.

### మహిళల టి 20 ఉత్కంఠ పోరులో

# భారత్ ఓటమి

### 5 పరుగుల తేడాతో ఇంగ్లండ్ విక్టరీ






**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో జరిగిన మహిళల మూడో టీ20 మ్యాచ్‌లో టీమ్‌ఇండియా మహిళల జటు నిరాశపరచింది. చివరి వరకూ ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో ఐదు పరుగుల తేడాతా ఓటమిపాలైంది. చివరి బంతికి ఆరు పరుగులు అవసరం కాగా, కెప్టెన్ హర్మన్ ప్రీత్ క్యాచ్ ఔటైంది. దీంతో ఇంగ్లాండ్ విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్, నిర్ణీత 20 ఓవరల్లలో 9 వికెట్లు నష్టపోయి 171 పరుగులు సాధించింది. ఓపెనర్లు సోఫియా డంక్లీ (75: 53 బంతుల్లో 7 ఫోర్లు ఒక సిక్స్), వ్యాట్ హాడ్జ్ (66: 42 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఆ తర్వాత మిగతా బ్యాటర్లు కూడా రాణించారు. టీమ్‌ఇండియా బౌలర్లలో అరుంధతీ రెడ్డి 3, దీప్తి శర్మ 3, శ్రీ చరణి 2, రాధా యాదవ్ ఒక వికెట్ తీశారు. ఆ తర్వాత 172 పరుగుల లక్ష్యంగా బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 166 పరుగులు మాత్రం చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన (56: 49 బంతుల్లో 10 ఫోర్లు) అర్ధశతకంతో షఫాలీ వర్మ (47: 25 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ అదరగొట్టారు. జెమిమా రోడ్రిగ్స్ (20), హర్మన్ ప్రీత్ కౌర్ (23) పరుగులు చేశారు. చివరి రెండు ఓవర్లలో భారత విజయానికి 20 పరుగులు అవసరమవ్వగా, 19వ ఓవర్లో 8 పరుగులు సాధించింది. చివరి 12 పరుగులు చేయాల్సి ఉండగా, టీమ్‌ఇండియా విజయం సాధిస్తుందని అంతా అనుకున్నారు. కానీ ఇంగ్లాండ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌లో తొలి ఐదు బంతుల్లో 6 పరుగులే వచ్చాయి. దీంతో చివరి బంతికి ఆరు పరుగులు అవసరమయ్యాయి. కెప్టెన్ హర్మన్ ప్రీత్ తాను కొట్టిన షాట్‌తో పెవిలియన్ చేరింది. దీంతో 5 పరుగుల తేడాతో భారత్ ఓడిపోయింది. కాగా, ఇప్పటికే భారత్ రెండు టీ20ల్లో గెలిచింది. ఈ నెల 9న మాంచెస్టర్ వేదికగా నాలుగో టీ20 జరగనుంది.






## కెనడా ఓపెన్‌లో సెమీస్‌కు శ్రీకాంత్

### శ్రీయాన్షి నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** కెనడా ఓపెన్-2025లో భారత్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ సెమీఫైనల్స్‌కు చేరగా, వాలిషెట్టి శ్రీయాన్షి ఓటమితో టోర్నీ నుండి నిష్క్రమించింది. 2025 కెనడా ఓపెన్ సూపర్ 300లో భారత ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. మాజీ ప్రపంచ నంబర్ 1 ఆటగాడు చైనీస్ తైపీకి చెందిన టాప్ సీడ్ చౌ టియెన్ చెన్‌ను 21-18, 21-9 తేడాతో వరుస గేమ్‌లలో ఓడించిన శ్రీకాంత్ చివరి నాలుగు స్థానాల్లో తన స్థానాన్ని సంపాదించుకున్నాడు. తొలి గేమ్‌లో 11-7 ఆధిక్యాన్ని సాధించిన శ్రీకాంత్ ప్రారంభం నుంచే ఆటపై నియంత్రణ సాధించాడు. చైనీస్ తైపీ షట్లర్ 15-15తో సమం చేయడానికి పోరాడినప్పటికీ, శ్రీకాంత్ తన ధైర్యాన్ని నిలుపుకుని 21-18తో గేమ్‌ను ముగించగలిగాడు. రెండవ గేమ్‌లో శ్రీకాంత్ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. చౌ టియెన్ చెన్ అతని స్ట్రోక్‌ప్లేను ఎదుర్కోవడంలో విఫలమయ్యాడు. చివరకు శ్రీకాంత్ 9-21 తేడాతో సెమీ ఫైనల్‌కు చేరుకున్నాడు. కాగా మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో డెన్మార్క్‌కు చెందిన అమాలీ షుల్జ్ చేతిలో ఓడిపోయిన తర్వాత శ్రీయాన్షి వాలిషెట్టి పోటీ నుంచి తప్పుకుంది. ప్రపంచ ర్యాంక్‌లో 75వ స్థానంలో ఉన్న 20 ఏళ్ల శ్రీయాన్షి బలమైన పోరాటం చేసినా కానీ చివరికి ప్రపంచ 69వ ర్యాంకర్ షుల్జ్ చేతిలో ఓడిపోయింది. షుల్జ్ 53 నిమిషాల్లో 12-21, 21-19, 21-19 తేడాతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. తొలి గేమ్‌ను ఆహ్లాదకరంగా తీసుకున్నప్పటికీ, షుల్జ్ రెండు, మూడవ గేమ్‌లలో ఆటుపోట్లను తిప్పికొట్టిన పదునైన నెట్ ప్లే మరియు వ్యూహాత్మక లిఫ్ట్‌లతో తిరిగి పోరాడిన వాలిషెట్టి తన జోరును నిలబెట్టుకోలేకపోయింది. అంతకు ముందు జరిగిన మ్యాచ్‌లో వాలిశెట్టి 16వ రౌండ్‌లో ప్రపంచ 45వ ర్యాంకర్ మలేషియాకు చెందిన లెట్షానా కరుపతేవన్‌పై 21-15, 21-14 తేడాతో విజయం సాధించి ఆకట్టుకుంది. ఈ క్వార్టర్ ఫైనల్ ముగింపు సూపర్ 300 ఈవెంట్‌లో వాలిశెట్టి యొక్క ఉత్తమ ప్రదర్శనలలో ఒకటిగా నిలిచింది.

# వాణిజ్యం

## రికార్డు స్థాయికి భారత్ ఫోరెక్స్ నిల్వలు

**న్యూఢిల్లీ, జులై 5:** జీవితకాల గరిష్ట రికార్డును బద్దలు కొట్టడానికి భారతదేశానికి ఇంకా 2 బిలియన్ డాలర్లు అవసరం. మునుపటి విదేశీ మారక నిల్వలలో 1 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ తగ్గుదల లేకపోతే ఈ అంతరం ఇంకా తక్కువగా ఉండేది. ఈ ఏడాది భారతదేశ విదేశీ మారక నిల్వలు 58.39 బిలియన్ డాలర్లు పెరిగాయి. ప్రత్యేకత ఏమిటంటే ప్రపంచంలోని చాలా దేశాల వద్ద ఇంత మొత్తం విదేశీ మారక నిల్వలు లేవు. ప్రపంచంలో అత్యధిక ఫారెక్స్ నిల్వలు కలిగిన నాల్గవ దేశం భారతదేశం. చైనా, జపాన్, స్విట్జర్లాండ్ మాత్రమే భారత దేశం కంటే ముందు ఉన్నాయి. దేశ కేంద్ర బ్యాంకు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ గణాంకా లను విడుదల చేసింది. ఆర్‌బిఐ డేటా ప్రకారం, దేశ ఫారెక్స్ నిల్వలు 700 బిలియన్ డాలర్లను దాటాయి. జూన్27తో ముగిసిన వారంలో, ఇది 4.84బిలియన్ డాలర్లు పెరిగి 702.78 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అన్నింటి కంటే, అక్టోబర్ 2024లో, భారతదేశ ఫారెక్స్ నిల్వలు 700 బిలియన్ డాలర్లను దాటినట్లు కనిపించింది. అంటే దేశ ఫారెక్స్ నిల్వలు 9 నెలల గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. అయితే, దేశ ఫారెక్స్ నిల్వల ఆల్‌టైమ్ హై రికార్డును బద్దలు కొట్టడానికి 2 బిలియన్ డాలర్లకు పైగా అవసరం. దీనిని వచ్చే వారం దాటవచ్చు. సెప్టెంబర్ 2024 చివరి నాటికి విదేశీ మారక నిల్వలు ఆల్‌టైమ్‌హై 704.88 బిలియన్లకు చేరుకున్నాయి. మునుపటి వారంలో, విదేశీ మారక నిల్వలు 1.01 బిలియన్ డాలర్లు తగ్గి 697.93 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. మరో వైపు, భారతదేశ విదేశీ కరెన్సీ ఆస్తులుభారీగా పెరిగాయి. జూన్ 27తో ముగిసిన వారంలో ఈ నిల్వలలో అతిపెద్ద భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 5.75 బిలియన్ డాలర్లు పెరిగి, 594.82 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బిఐ తెలిపింది. డాలర్ పరంగా వ్యక్తీకరించిన విదేశీ కరెన్సీ ఆస్తులలో విదేశీ మారక నిల్వలలో ఉంచిన యూరో, పౌండ్, యెన్ వంటి యుఎస్ కాని యూనిట్ల పెరుగుదల లేదా తరుగుదల ప్రభావం ఉంటుంది.



## ఇండస్ ఇండ్ బ్యాంకుకు ఫలితాల షాక్

**ముంబయి, జులై 5:** ప్రైవేటురంగంలోని ఇండస్ ఇండ్ బ్యాంకు తొలి త్రైమాసికంలో నికర అడ్వాన్సులు 3శాతంమేర తగ్గాయి. అకౌంటింగ్ మోసాలు వెలుగులోకి రావడంతో బ్యాంకు అడ్వాన్సులు కూడా క్షీణించాయి. బ్యాంకు డిపాజిట్లు కూడా 3.3శాతం మేర క్షీణించి 3.97 లక్షలకోట్లకు తగ్గాయి. నికర అడ్వాన్సులు చూస్తే క్రమానుగతంగా 3.1శాతం క్షీణించి 3.34 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఏప్రిల్-జూన్ తొలిత్రైమాసికంలో బ్యాంకు వార్షిక పద్ధతిలో చూస్తే నాలుగు శాతం తగ్గినట్లు ప్రకటించింది. బ్యాంకు పరిధిలో చోటు చేసుకున్న డెరివేటివ్ కుంభకోణం వల్ల ప్రతిష్ట దెబ్బతిని ఇన్వెస్టర్ల నమ్మకం తగ్గింది. మార్కెట్ సెంటిమెంట్ బలహీన పడింది. ఇక కార్పొరేట్ బ్యాంకింగ్ అడ్వాన్సులపరంగా చూస్తే 14.4శాతం క్షీణించాయి. త్రైమాసికం వారీగాచూస్తే 6.2శాతం తగ్గాయి. వినియోగ రంగ బిజినెస్ అడ్వాన్సులు 0.9శాతంగా ఉన్నాయి. వార్షిక పద్ధతిలో గణిస్తే 4.8శాతం పెరిగినట్లు బ్యాంకు ప్రకటించింది. సంక్షోభంలో ఉన్న బ్యాంకు డిపాజిట్లుకూడా 3.3శాతం క్షీణించాయి. 3.97 లక్షలకు చేరాయి. రిటైల్ డిపాజిట్లపరంగా చూస్తే చిన్న వ్యాపార కస్టమర్లు 1.84 లక్షలకోట్లుగా ఉంటే గత త్రైమాసికం కంటే స్వల్పంగా తగ్గాయి. ప్రస్తుతం కరెంటుఖాతా, సేవింగ్స్ ఖాతాలపరంగా కాసా నిష్పత్తి కూడా 31.49 శాతం దిగజారింది. 32.81శాతం అంతకుముందున్న త్రైమాసికం కంటే తగ్గినట్లు బ్యాంకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు నివేదిక ఇచ్చింది. రోజువారి సగటు నగదు లభ్యత కవరేజి నిష్పత్తి కూడా 141.27 శాతంగా ఉంది. బ్యాంకు తొలిత్రైమాసికంలో బిజినెస్ ఈ కుంభకోణం వల్లనే దెబ్బతిన్నట్లు తేలింది. కాసా నిష్పత్తికూడా బ్యాంకు పటిష్టతను సవాల్‌చేసేవిధంగా ఉంది. తక్కువ వడ్డీ ఫండింగ్ వనరులు కొంతమేర దెబ్బతిని బ్యాంకు లాభదాయకతను తగ్గించినట్లు నిపుణులు పేర్కొంటున్నారు.




## విదేశీ సిమ్‌లు, ఇ-సిమ్‌లు భారత్‌లో విక్రయానికి కసరత్తులు

**న్యూఢిల్లీ, జులై 5:** విదేశీ టెలికాంసంస్థల సిమ్‌లు, ఈసిమ్‌లు భారత్‌లో విక్రయించడం, వినియోగించడంపై సంబంధిత టెల్కోలనుంచి అభిప్రాయ సేకరణ జరుపుతూ ట్రాయ్ మార్గదర్శకాలు జారీ చేసింది. విదేశీ టెలికామ్ సర్వీస్ ప్రొవైడర్ల సిమ్‌లు, ఈసిమ్‌లను భారత్‌లో విక్రయించడం, వినియోగించే అంశంపై అభిప్రాయాలు కోరింది. మెషిన్‌టు మెషిన్ విధానంలో సమీకరణంచేసేందుకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌కు అవసరమైన పరికరాల ఎగుమతులు వంటివాటిపై అభి ప్రాయాలు కోరింది. ఇందుకోసం డాట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పాలసీని తీసుకురావాల్సిన అవసరం ఉందా అనేదికూడా ఈ అభిప్రాయ సేకరణలో ఒకభాగం. రిజర్వుబ్యాంకు, కస్టమ్స్ ఇతర అధికారుల నుంచి కూడా ఇందుకు సంబం ధించి అభిప్రాయాలుకోరుతున్నట్లు ట్రాయ్ తన సంప్రదింపుల పత్రంలో వెల్లడించింది. అలాగే భారతీయ టెలికాం కంపెనీలు ఎంటిఎం వ్యవస్థలో సిమ్‌లు, ఈసిమ్‌లతోపాటు వాటిని విదేశాల్లో వినియోగిం చడంపైనా అభిప్రాయాలు కోరింది. ఇందుకు ఫీజులు, అర్హత, కాలపరిమితి, విదేశీ సిమ్‌లు, ఈసిమ్‌ల వినియోగంపై నిర్దిష్టమైన పరిమితులు ఎలా ఉండాలన్న దానిపై అభిప్రాయాలు కోరుతోంది. కొందరు భారతీ య ఉత్పత్తి దారులు ఇప్పటికే ఇంటర్నెట్ ఆఫ్‌థింగ్స్, ఎం2ఎం పరికరాలను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతులుచేస్తున్న సంగతి తెలిసిందే. ఇపుడు ఇదే ఉత్పత్తి దారులు విదేశీ సిమ్‌లు భారత్‌లో అందుబాటులోకి తెచ్చేందుకు అనుమతులు కోరుతున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల విదేశీ నెట్‌వర్క్‌లు తక్షణమే ఆపరేట్ చేయాలన్న అవసరం ఉంటుందని, ఇందుకు సంబంధించి భారతీయ టెల్కోల నుంచి కూడా అభిప్రాయాలను సేకరిస్తోంది. విదేశీ సిమ్‌లు విక్రయించాలంటే భారత టెలికాం నుంచి నిరభ్యంతర ధృవీకరణ పత్రాలు అంటే ఎన్వోసీలు పొందాల్సి ఉంటుంది.




## వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ సోదరుడి అరెస్టు

**న్యూఢిల్లీ, జులై 5:** పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.14 వేల కోట్లకు ముంచేసిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ సోదరుడు నేహాల్ దీపక్‌మోడీని అమెరికాలో అరెస్టు చేసారు. భారత అధికారులు విజ్ఞప్తిమేరకు అరెస్టుచేసి భారత్‌కు అప్పగించనున్నట్లు తేలింది. బెల్జియన్ దేశస్తుడుగా ఉన్న నేహాల్‌మోడీని 4వ తేదీ అమెరికాలోని స్థానిక అధికారులు అరెస్టుచేసారు. ఇంటర్‌పోల్ ఇప్పటికే అతనిపై రెడ్‌కార్నర్ నోటీసులు జారీచేయడంతో అలర్ట్ అయ్యారు. సిబిఐ, ఈడీ విభాగాలు ఇప్పటికే వీరందరిపైనా కేసులునమోదుచేసి దర్యాప్తు వేగంచేసిన క్రమంలో రెడ్‌కార్నర్ నోటీసులు జారీచేసారు. సుదీర్ఘమైన న్యాయపరమై, దౌత్యపరమైన ప్రక్రియ తర్వాత నేహాల్‌మోడీని యుఎస్ పోలీసులు అరెస్టుచేసారు. ఒకదశలో రెడ్‌కార్నర్‌నోటీసులను కూడా వీరు సవాల్‌చేసారు.పీఎన్‌బీ కుంభకోణంలో నేహాల్ మోడీ పాత్రకూడా ఉందని ఇడి, సిబిఐ అధికారులు భావించారు. అతని పెద్దన్న నీరవ్‌మోడీ ఈ కేసులో కీలక నిందితుడు. భారతదర్యాప్తు అధికారుల వివరాల ప్రకారం నేహాల్‌మోడీ నీరవ్‌మోడీకి సహకరించాడని, కీలక సాక్ష్యాలన్నింటినీధ్వంసంచేసి సాక్షులను బెదిరించారని ఆరోపణలున్నాయి. దర్యాప్తునకు భంగం కలిగించేవిధంగా నేహాల్‌మోడీ వ్యవహరించారు. ఈకుంభకోణంలో ఆర్జించిన వేలాదికోట్ల రూపాయలు మనీలాండరింగ్‌ద్వారా దారిమళ్లించారన్న ఆరోపణలున్నాయి. నేహాల్ ఈ సొమ్మును డొల్లకంపెనీల సాయంతో విదేశాల్లో లావాదేవీలు నిర్వహించాడు. ఇక ఈతడిని భారత్‌కు అప్పగించే కేసు విచారణ ఈనెల 17వ తేదీ ఉంది. ఈ సమయంలోనే బెయిల్ దరఖాస్తును కూడా నేహాల్‌మోడీ తరపున దాఖలుచేసే అవకాశం ఉంది. అయితే యుఎస్ ప్రాసిక్యూషన్ ఇప్పటికే తాము బెయిల్‌ను వ్యతిరేకిస్తామని స్పష్టంచేసింది. మొత్తం 14వేల కోట్ల కుంభకోణంలో నీరవ్‌మోడీ ఒక్కడే 6498.20 కోట్లవరకూ కాజేయగా ఆయన మేనమామ మెహుల్‌చోక్సీ 7080.86 కోట్లు దారిమళ్లించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. నీరవ్‌మోడీ, చోక్సీ ఇద్దరూ కూడా 2018 జనవరిలోనే భారత్‌ఋంచి పరారయ్యారు. నీరవ్‌మోడీని బ్రిటన్‌లో 2019లో అరెస్టు చేసారు. లండన్‌లోని వాండ్స్‌వర్త్ జైలులో ప్రస్తుతం ఉన్నాడు. మెహుల్‌చోక్సీ ప్రస్తుతం యాంటిగ్వాలో ఉన్నారు.



## కొత్త హంగులతో బజాజ్ ఆటో డోమినార్

**ముంబై, జులై 5:** ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో, భారతమార్కెట్లో తన పాపులర్ టూరింగ్ బైక్‌లు డోమినార్ 400, డోమినార్ 250 మోడళ్లను సరికొత్త అప్‌డేట్స్‌తో విడుదల చేసింది. కొంతకాలంగా టీజర్లతో ఆసక్తి రేకెత్తించిన ఈ బైకులను, అధునాతన ఫీచర్లు, మెరుగైన రైడింగ్ సౌకర్యాలతో కంపెనీ లాంచ్ చేసింది. ముఖ్యంగా లాంగ్ రైడ్స్ ఇష్టపడే వారి కోసం చేసిన ఈ మార్పులు ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ అప్‌డేట్‌లో భాగంగా బజాజ్ రెండు డోమినార్ బైక్‌లలోనూ రైడర్లకు మెరుగైన నియంత్రణ అందించేందుకు నాలుగు రైడింగ్ మోడ్స్‌ను పరిచయం చేసింది. రెయిన్, రోడ్, స్పోర్ట్, ఆఫ్‌రోడ్ అనే ఈ మోడ్స్ ద్వారా రైడర్ తన అవసరానికి, ప్రయాణిస్తున్న రోడ్డుకు అనుగుణంగా థ్రాటిల్ రెస్పాన్స్, ఏబీఎస్ (యాంటీలాక్ బ్రేకింగ్ సిస్టమ్) పనితీరును మార్చుకోవచ్చు. ఇక డోమినార్ 400 మోడల్‌లో 'రైడ్‌బైవైర్' టెక్నాలజీని కొత్తగా చేర్చారు. దీనివల్ల థ్రాటిల్ మరింత కచ్చితంగా పనిచేస్తుంది. అయితే, డోమినార్ 250లో మెకానికల్ థ్రాటిల్ వ్యవస్థనే కొనసాగించినా, నాలుగు విభిన్న ఏబీఎస్ మోడ్స్‌ను అందించడం గమనార్హం. ఈ మార్పులు భద్రతను, రైడింగ్ అనుభూతిని రెండింటినీ మెరుగుపరుస్తాయి. ఈ రెండు బైక్‌లలోనూ మరో ప్రధానమైన మార్పు డిజిటల్ డిస్‌ప్లే. ఇటీవలే విడుదలైన పల్సర్ ఎన్‌ఎస్400జెడ్‌లో ఉపయోగించిన కలర్ ఎల్‌సీడీ గ్లాస్ బాండెడ్ స్పీడోమీటర్‌ను ఇప్పుడు డోమినార్ సిరీస్‌లోనూ అమర్చారు. ఈ కొత్త డిస్‌ప్లేకు అనుగుణంగా స్విచ్‌గేర్‌ను కూడా మార్చారు. దీంతో పాటు, సుదూర ప్రయాణాల్లో రైడర్లకు అలసట తగ్గించేందుకు హ్యాండిల్ బార్లను సౌకర్యవంతంగా తీర్చిదిద్దినట్లు బజాజ్ తెలిపింది. అంతే కాకుండా, టూరింగ్ రైడర్ల కోసం ప్రత్యేకంగా జీపీఎస్ పరికరాలు లేదా స్మార్ట్‌ఫోన్‌లను అమర్చుకోవడానికి వీలుగా ఫ్యాక్టరీ ఫిట్టెడ్ జీపీఎస్ మౌంట్‌ను కూడా అందించారు. ఇది టూరింగ్ ప్రియులకు ఎంతగానో ఉపయోగపడే ఫీచర్.



## ఇండిగో నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అమితాబ్ కాంత్

**ముంబై, జులై 5:** భారత్‌లోని అతిపెద్ద విమాన యానసంస్థ ఇండిగో నీతి ఆయోగ్ మాజీ సీఇఒ అమితాబ్ కాంత్‌ను నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించుకుంది. ఇండిగో మాతృక ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ సంస్థ ఈ మేరకు ప్రకటించింది. అయితే అందుకు వాటాదారుల అనుమతులు, చట్టపరమైన క్లియరెన్స్‌లు రావాల్సి ఉంది. జి20 సమావేశాల సందర్భంగా అమితాబ్ కాంత్ భారత్ షెర్పాలా వ్యవహరించిన సంగతి తెలిసిందే. నీతి ఆయోగ్ సిఇఒగా ఆరేళ్లపాటు పని చేసారు. నాలుగుదశాబ్దాల సివిల్ సర్వీసు అనుభవం ఉన్న అధికారి కావడంతో ఇండిగో ఆయన్ను నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించుకునేందుకు ఆసక్తి చూపిం చింది. దేశీయంగా విస్తరించడంతో పాటు అంతర్జాతీయ సర్వీసుల్లోను మరింతగా విస్తరించే లక్ష్యంతో అమితాబ్ కాంత్ సేవలు సంస్థకు ఎంతో ఉపకరిస్తాయని భావిస్తోంది. పర్యాటకం, వాణిజ్యం, పెట్టుబడులపరంగా కూడా అమితాబ్‌కాంత్‌కు విశేషానుభవం ఉంది. ఇండిగో బోర్డు ఛైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా మాట్లాడుతూ కాంత్ దశాబ్దాల నాయకత్వ లక్షణాలు తమ సంస్థకు ఎంతో మేలుచేస్తాయని అన్నారు. 2030 నాటికి ఇండిగో గ్లోబల్ ప్లేయర్‌గా మారేందుకు వీలుగా కాంత్‌ప్రణాళికలు వేయగలరన్నారు. గత ఏడాది కెనడా బిలియనీర్ ప్రేమ్ వాట్సా కంపెనీ ఫెయిర్‌ఫాక్స్ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ కాంత్‌ను తమకు సీనియర్ సలహాదారునిగా నియమించుకుంది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Superior Printers (P) Ltd. and published at plot No. 4 - 40/1, Alugunoor, Karimnagar-505527, Ph:2223355, 2277034, 35, FAX:2277036 ; Editor : *Damerla Sai Baba, *r esponsible for selection of News under the Pr B Act. r NI No.APTEL/2001/7563.Postal Licence r egd. No. H/KAr /89/12-14